తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 100 పేజీలు: 12 వెల: 6.50









भारत सरकार

सोमनाथ



సోమలింగం నరో దృష్ట్వా సర్వపాపైః ప్రముచ్యతే |
లభతే ఫలం మనోవాంఛితం మృతః స్వర్గ సమాశ్రయేత్ ||

# సోమనాథ్

## 75 ఏళ్ల వారసత్వం

భారతదేశ అమేయ నాగరికతకు సోమనాథ్ దేవాలయం ఒక మహోన్నత చిహ్నం. 1000 ఏళ్ల వినాశకర దాడుల తర్వాత కూడా, సోమనాథ్ నేడు మన ఆత్మగౌరవానికి, సాహసానికి ప్రతీకగా నిలిచింది. 75 ఏళ్ల క్రితం 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దృఢ సంకల్పంతో ఆధునిక సోమనాథ్ నిర్మాణం ప్రారంభమైంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, నేడు ఈ పుణ్యభూమి భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదికగా నిలుస్తోంది.



## ఈ సువర్ణ ఘట్టాన్ని కనులారా వీక్షించండి

### ముఖ్య కార్యక్రమాలు

కలశ యాత్ర | భజన సంధ్య | ఓంకార మంత్ర జపం
సోమనాథ్ పుస్తకంలో మంత్ర లేఖనం | సోమనాథ్ అనుబంధ గాథల పఠనం

**వేదిక: శ్రీ సోమనాథ్ దేవాలయ ప్రాంగణం, ప్రభాస్ పాటన్, తేదీ: 2026, మే 8 నుండి 11 వరకు**

" వినాశనం కంటే సృష్టించడం ఎంతో ఉన్నతమైనదని సోమనాథ్ మనకు నేర్పించే ఒక జాగృతి గీతం "

- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ (అధ్యక్షులు, శ్రీ సోమనాథ్ ట్రస్ట్)

జారీ చేసిన వారు : సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

సోమనాథ్ దివ్యత్వం మరియు భవ్యత్వంలో భాగస్వాములు అవ్వండి.
గర్వించదగ్గ చరిత్రలో భాగం కావడానికి QR కోడ్‌ని స్కాన్ చేయండి.


ఆదివారం హైదరాబాద్‌లో సిఎం చంద్రబాబు నివాసానికి వెళ్లి మంత్రి లోకేష్, ఇతర కుటుంబ సభ్యులతో ప్రధాని మోడీ

# చంద్రబాబు, పవన్ కుటుంబాలతో భేటీపై ప్రధాని మోడీ పోస్ట్

**విజయవాడ,మే 10,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లిన ఫొటోలను ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యుల్ని కలిసినట్లు తెలిపారు. వారందరినీ కలవడం, ఎన్నో విభిన్నమైన అంశాలపై అభిప్రాయాల్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే, పవన్ యోగ క్షేమాల గురించి తెలుసుకున్నానని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ పోస్టు పెట్టారు.

# అమరావతి పనులకు కార్మికుల కొరత..

## ప్రపంచబ్యాంకు పరిశీలనలో వెల్లడి

**విజయవాడ, మే 10,ప్రభాతవార్తప్రతినిధి:**అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా జరగాలని చెబుతున్నా దానికి తగిన విధంగా కార్మికులను నియమించుకునే విషయంలో నిర్మాణ సంస్థలు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలనుండి వచ్చినకార్మికులకు కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదని, క్యాంపుల్లో వేసవిలో రేకుల కింద నివాసం ఉండాల్సి వస్తోందని, నీటి సదుపాయాలతో పాటు నిబంధనల ప్రకారం మరుగుదొడ్లు కూడా లేవని ఇటీవల ప్రపంచబ్యాంకు బృందం సభ్యుల పరిశీలనలో తేలింది. వెంటనే సదుపాయాలు కల్పించాలని బృంద సభ్యులు సిఆర్‌డిఏ అధికారులకు తెలిపారు. మొత్తం రాజధాని పరిధిలో సిఆర్‌డిఏ ఎడిసిఎల్ కలిపి 88 పనులు చేస్తున్నాయి. ఈ పనులు నిర్వహించేందుకు 11 కాంట్రాక్టు కంపెనీలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 22 వేలమంది కార్మికులు కావాల్సి ఉంది. రాజధాని అమరావతి పరిధిలో కార్మికుల కోసం 20 క్యాంపులు ఏర్పాటు చేశారు. పనులు పెరిగిన నేపథ్యంలో కనీసం 30 వేలకు తగ్గకుండా సిబ్బంది నియమించుకోవాలని అధికారులు సూచించారు. ఇటీవల ఇంటీరియర్, జిఎడి టవర్లు, మంత్రులు జడ్జిల భవనాల అంతర్గత పనులు వంటి వాటికి సిబ్బంది అదనంగా కావాల్సి వచ్చింది. అలాగే లారీలు, బుల్‌డోజర్లు, క్రెయిన్లు, ట్రాక్టర్లు, సిమెంటు మిక్సర్లు అన్నీ కలిపి సుమారు 3600 వరకూ కావాల్సి ఉంది. అవి కూడా 1100 లోపే ఉన్నాయని తేల్చారు. ఇవన్నీ కూడా కాంట్రాక్టు కంపెనీలు ఒప్పందం సమయంలో సిఆర్‌డిఏకు సమర్పించిన నివేదికలే. ఆ నివేదికల ప్రకారం అంత పెద్దఎత్తున సిబ్బంది అవసరం ఉంది. అయితే కాంట్రాక్టు పొందే సమయంలో సమర్పించిన సిబ్బంది లెక్కలకూ, ఇప్పుడు వాస్తవ పరిస్థితికి అసలు పొంతన లేదని అధికారులు గుర్తించారు. మొత్తంగా 17 వేలమంది కార్మికులు కూడా లేరని ఇటీవల అధికారులు తేల్చారు. అయినా, కాంట్రాక్టు కంపెనీలు మాత్రం లెక్కల్లో చూపిస్తున్నాయి. దీనిపై ఇటీవల తనిఖీ చేయగా క్యాంపుల్లోఉండే కార్మికులతోపాటు బయట నుండి రోజువారీ కార్మికులు వస్తున్నారని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. రాజధాని పరిధిలో ఎన్‌సిసి, ఎల్‌అండ్‌టి, కెపిసి, కెఎంవి, ఎస్‌పిసిఎల్, బిఎస్‌ఆర్, ఎంవిఆర్, ఆర్‌విఆర్, ఎంఈఐఎల్, బిఎస్‌సిపిఎల్, పివిఆర్ సంస్థలు పనిచేస్తున్నాయి. ఆయా సంస్థల మొత్తం కాంట్రాక్టు విలువ 43 వేల కోట్లకుపైనే ఉంది. వారిచ్చిన నివేదికల ప్రకారమే మొత్తం రాజధాని పరిధిలో 20 వేలమంది కార్మికులు కూడా లేరు. ఆచరణలో 17 వేలమంది కూడా పనుల్లో లేరని తేలింది. ఇక్కడ 20 ప్రాంతాల్లో కార్మికులకు ఆయా సంస్థలు నివాస సదుపాయం కల్పించాయి. వాటిల్లో ఇటీవల ప్రపంచ బ్యాంకు బృందం ప్రతినిధులు పర్యటించారు. ఏ క్యాంపులో కూడా నిబంధనల ప్రకారం సదుపాయాలు లేవని గుర్తించారు. అదే విషయాన్ని రివ్యూలో సిఆర్‌డిఏ కమిషనర్, ఎడిసిఎల్ ఎమ్‌డి, ఈఎన్‌సి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ సదుపాయాలు కల్పించాలని సూచించారు.

# చంద్రబాబు, పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లిన ప్రధాని మోడీ

## పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నరేంద్రమోడీ

## బాబుతో గంటకు పైగా మోడీ భేటీ, తెలంగాణ పరిస్థితిపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** హెచ్ఐసిసిలో నరేంద్ర మోడీ తన చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జూబ్లీహిల్స్‌లో ఎపి సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నివాసాలకు వెళ్లారు. ప్రధాని తొలుత పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకొని పరామర్శించారు. సైనస్ సమస్య కారణంగా పవన్ కల్యాణ్‌కు ఇటీవల శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ ఇంటికి మోడీ వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు అక్కడ 20 నిమిషాల పాటు ప్రధాని ఉన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్,కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. తర్వాత నేరుగా జూబ్లీహిల్స్‌లోని నారా చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధానికి చంద్రబాబుతో పాటు ఎపి మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. చంద్రబాబుతో మోడీ సమావేశం గంటకు పైగా కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర పరిస్థితిపై చర్చించారని సమాచారం. అంతకుముందు గచ్చిబౌలిలోని సింధు ఆస్పత్రికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ, ఆస్పత్రిని ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం సింధు ఆస్పత్రిని, సింధు ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్ర చికిత్సలను పరిశీలించారు. సింధు ఆస్పత్రి ప్రాంగణంలోని ఆలయంలో మోడీ పూజలు చేశారు. పరిసర ప్రాంతాల్లోనూ ఆరోగ్య సేవారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఇది ఒక ప్రశంసించదగ్గ ప్రయత్నమని, అత్యాధునిక సాంకేతికతనూ, నవీన ఆవిష్కరణలనూ సమన్వయం చేసేందుకు ఆసుపత్రి బృందం ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా అభినందనీయమని ట్వీట్ చేశారు.

# ముస్లిం స్టూడెంట్లకు ఉచిత విద్య

>> ప్రభుత్వం కట్టుబడి ఉందనేదానికి ఇదోక ఉదాహరణగా తెలిపారు.ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందన్నారు.అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామన్నారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నాం అన్నారు.రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాం పైకి తీసుకురావాలని నిర్ణయించాం అన్నారు.గత పాలకుల విధ్వంసం చేసినా రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుంటున్నామన్నారు.రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం లభించింది అన్నారు..డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా చేపడుతున్నాం అన్నారు.రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం అన్నారు.

# హైకోర్టును ఆశ్రయించిన పెరియకరుప్పన్

**చెన్నై, మే 10:** తమిళనాట రాజకీయాల్లోప్రతిరోజు ట్విస్టులు నెలకొంటున్నాయి. నిన్నమొన్నటివరకూ మెజార్టీకోసం చిన్న పార్టీలు ఇచ్చిన ట్విస్ట్‌లు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. అవన్నీ సద్దుమణిగి సీఎంగా విజయ్ ప్రమాణం తోపాటు మరో 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారంచేస్తే ఇపుడు తాజాగా మరో ట్విస్ట్ ఎదురయింది. రాష్ట్రంలోని తిరుపత్తూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న అనూహ్య ఫలితంపై మాజీ మంత్రి, డీఎంకే సీనియర్ నేత కేఆర్ పెరియకరుప్పన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం సంచలనం కలిగించింది. ఈ ఎన్నికల్లో ఆయన కేవలం ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో ఆయన తిరుపత్తూరు నియోజకవర్గంలో చోటుచేసుకున్న అనూహ్య ఫలితంపై సవాలు విసిరారు. హీరో విజయ్ నేతృత్వంలోని టివికె అభ్యర్థి శ్రీనివాస సేతుపతి విజయాన్ని సవాలు చేస్తూ ఆయన తాజాగా మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొత్తగా ఎన్నికైన టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయకుండా, అసెంబ్లీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిరోధించాలని కోరారు. అసెంబ్లీలో జరగబోయే విశ్వాస తీర్మానంలో సదరు అభ్యర్థి ఓటు వేయకుండా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ కేసు ప్రాధాన్యత దృష్ట్యా, మద్రాస్ హైకోర్టు ఆదివారం నాడే ప్రత్యేక విచారణ జరపాలని నిర్ణయించడం గమనార్హం. తిరుపత్తూరులో టీవీకే అభ్యర్థికి 83,375 ఓట్లు రాగా, పెరియకరుప్పన్ కేవలం ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. అయితే ఈ గెలుపు వెనుక మస్కట్ నుంచి వచ్చిన మణికందన్ శివానంతం అనే యువకుడి ఓటు కీలకమైందని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. విజయ్ పార్టీకి ఓటు వేయడానికే తాను విదేశాల నుంచి వచ్చానని ఆ యువకుడు పోస్ట్ చేయడంతో, ఆ ఒక్క ఓటే ఫలితాన్ని తారుమారు చేసిందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.


ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సిఎం పవన్ నివాసానికి వెళ్లి పరామర్శించిన ప్రధాని మోడీ

# 2,500 ఎంబిబిఎస్ సీట్లు

>> తీసుకొచ్చింది. చంద్రబాబే అయితే, దానికి ఐదేళ్ల పాటు కనీసం తాగునీరు కూడా ఇవ్వని నీచ చరిత్ర జగన్ రెడ్డిదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎయిమ్స్‌కు కృష్ణా జలాలను అందించిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడం తప్ప జగన్ చేసిందేమిటి? రూ.8480 కోట్ల అంచనాతో 17 కాలేజీల నిర్మాణానికి కేంద్రం నిధులు మినహా రాష్ట్రం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు అని ఆరోపించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పనులు ఆలస్యమవుతాయనే ఉద్దేశంతోనే ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిన పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానాన్ని ఎంచుకున్నారు. విద్యా వ్యవస్థను ధ్వంసం చేశారు. జగన్ రెడ్డి హయాంలో విద్యా రంగం పూర్తిగా నాశనమైందని కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో ఒక్క డిఎస్సీ నిర్వహించలేదు. వేలాది స్కూళ్లను మూసివేసి గ్రామీణ విద్యార్థులను చదువుకు దూరం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత 62 శాతానికి పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దాన్ని 85 శాతానికి పెంచిన ఘనత నారా లోకేశ్‌ది. అధికారంలోకి రాగానే 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం అని తెలిపారు.


ఆదివారం తిరుమలలో సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

# శ్రీవారి సేవలో సిఇసి జ్ఞానేష్ కుమార్

**తిరుమల,మే 10ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు. తిరుమలశ్రీవారిని ఆదివారం ఉదయం సిఇసి గ్యానేష్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తమిళ సిఎం విజయ్‌కు అభినందనలు: డిసిఎం పవన్

**విజయవాడ,మే 10,ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాడు సీఎంగా ప్రమాణం చేసిన విజయ్‌కు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అభినందనలను తెలియజేశారు. విజయ్‌తో పాటు ప్రమాణం చేసిన మంత్రులందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలను తెలిపారు. నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆకాంక్షిస్తున్నానన్నారు. పారదర్శక, ప్రగతిశీలమైన పాలనను అందిస్తుందని ఆకాంక్షిస్తున్నానని వివరించారు. తమిళనాడును మరింత అభివృద్ధి, సుసంపన్న దిశగా నడిపిస్తారని ఆశిస్తున్నానని పవన్ పేర్కొన్నారు.

# దళపతి విజయ్

>> ఆప్యాయంగా మాట్లాడటం అందరినీ ఆకర్షించింది.

**ఏది ఆచరణ సాధ్యమో అదే చేసి చూపిస్తా: తొలి ప్రసంగంలో విజయ్**

ఆలోచిస్తాం, అది చేస్తాం, ఇది చేస్తామని చెప్పబోనని, ఏది సాధ్యమో అదే చేస్తామని టివికె అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. నెహ్రూ స్టేడియంలో ఆదివారం రాష్ట్రముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసిన తర్వాత ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తొలిప్రసంగంలోనే డిఎంకె ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. రాష్ట్రం సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలో ఉందని, ఖజానాను పూర్తిగా తుడిచిపెట్టేశారని సంచలన ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందని, అవినీతిని ఏమాత్రం సహించబోనని, తప్పు చేస్తే తన వారిని కూడా ఉపేక్షించనని గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

ఈ సందర్భంగా విజయ్ భావోద్వేగంగా ప్రసంగించారు. సినిమాల్లో ఎలాగైనా నిలదొక్కుకోవాలని కష్టపడిన ఒక సాధారణ అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకుగా, నాకు పేదరికం, ఆకలి విలువ బాగా తెలుసు. నేనేమీ రాజుల కుటుంబం నుంచి రాలేదు. మీలో ఒకడిగా, మీ కుటుంబ సభ్యుడిగా, మీ బిడ్డగా, మీ అన్నగా, తమ్ముడిగా నన్ను నేను భావిస్తున్నా. మీరు కూడా నన్ను అలాగే ఆదరించినందుకే ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని అన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తనను ఎన్నో అవమానాలు, కష్టాలు చుట్టుముట్టినా ప్రజలు అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకోవడానికే వచ్చానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రంపై మోయలేని అప్పుల భారాన్ని మోపి, ఖజానాను పూర్తిగా ఖాళీ చేసి వెళ్లిపోయింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనం బాధ్యతలు స్వీకరించాం. ఇది నిందలు వేయడం కాదు, వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుంచాలి. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు తెలియజేసేందుకు ఒక శ్వేతపత్రం విడుదల చేస్తాను. మాది పారదర్శకమైన ప్రభుత్వం. ఏదీ దాపరికాలు లేకుండా, ముసుగులు వేసుకోకుండా బహిరంగంగానే వ్యవహరిస్తానని విజయ్ ప్రకటించారు. అవినీతిపై తన వైఖరిని స్పష్టం చేస్తూ, ప్రజాధనం నుంచి ఒక్క పైసా కూడా నేను ముట్టుకోను. ఆ అవసరం నాకు లేదు, అది మీకు బాగా తెలుసు. ఈ విజయ్ తప్పు చేయడు, ఇతరులను చేయనివ్వడు. నా ప్రభుత్వంలో ఉన్నవారైనా సరే, తప్పు చేస్తే ఉపేక్షించేది లేదు.

గెలిచాం కదా అని ఆటలు ఆడదామనే ఆలోచన ఎవరికైనా ఉంటే, ఇప్పుడే దాన్ని తుడిచిపెట్టేయండి. ఇక్కడ ఒకే ఒక్క పవర్ సెంటర్ ఉంటుంది, అది నా నాయకత్వంలోనే ఉంటుంది. వేర్వేరు అధికార కేంద్రాలకు తావు లేదని గట్టిగా హెచ్చరించారు. తన ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరిస్తూ, మహిళల భద్రతకు కఠిన చర్యలు తీసుకుంటాం. యువతను నాశనం చేస్తున్న డ్రగ్స్ సంస్కృతిని అణిచివేసేందుకు ఇప్పటి నుంచే చర్యలు మొదలుపెడతాను. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, విద్య, రేషన్, వైద్యం, తాగునీరు, రోడ్లు, బస్సు సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాలపైనే నా పూర్తి దృష్టి ఉంటుందని హామీ ఇచ్చారు. తన ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సిపిఎం నేతలు ఎంఎ బేబీ, కే. బాలకృష్ణన్, విసికే నేత తిరుమావళవన్, సిపిఐ నేత డి.రాజా సహా ఇతర మిత్రపక్షాల నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది ఒక కొత్త ఆరంభం. నిజమైన లౌకిక, సామాజిక న్యాయంతో కూడిన పాలన ఇక్కడి నుంచే మొదలవుతుందని విజయ్ అన్నారు.

## వారం - వర్జ్యం

11-05-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
నవమి మ.3.18
శతభిష రా.1.25
వర్జ్యం : ఉ.8.10-9.48
దు.మ.12.30-మ.1.21,
2)మ.3.04-మ.3.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:**గత అనుభవం ద్వారా కొన్ని సమస్యల నుండి తప్పించుకోగలుగుతారు. అతిథి మర్యాదలకు ఖర్చు చేస్తారు.

**వృషభం:** కుటుంబసభ్యుల అభివృద్ధికి మీరు ఎక్కువ శ్రమ చేయవలసి వస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి.

**మిథునం:**మీ గురించి చెడుగా ప్రచారం చేసే వ్యక్తుల నుండి దూరంగా వుండడం మంచి, కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం:**అనుకూల ఫలితాలు ప్రతికూల ఫలితాలు సరిసమానంగా ఉంటి. వస్తు భద్రత పట్ల జాగ్రత్త అవసరం.

**సింహం:**నూతన బాధ్యతలు సంతోషం కలిగిస్తాయి. బంధువులతో మాట పట్టింపులు రాకుండా జాగ్రత్త పడండి.

**కన్య :**నిర్వహించ లేక పారిపోతారని ఇతరులు వేసిన అంచనాలు తలక్రిందులు చేస్తాయి.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**తుల :** ఇష్టం లేకపోయినా, నమ్మకం లేకపోయినా కొందరిని తాత్కాలికంగా నమ్మాల్సిన స్థితి తప్పదు. వస్త్రలాభం.

**వృశ్చికం:** మీ పలుకుబడి అన్ని విధాలుగా ఉపయోగించి ఉద్యోగపరమైన ఒత్తిళ్ళను తట్టుకుంటారు. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** అధిక శ్రమ వలన ఆరోగ్య పరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఉంటాయి. సమావేశాలలో పాల్గొంటారు.

**మకరం:** అన్ని విషయాలలో పురోగతి బాగుంటుంది. లాభాలు మాత్రం చేతి కందవు. సమయం పడుతుంది.

**కుంభం:** ఉద్యోగపరంగా మీ స్థాయి తగ్గనున్నదని శత్రువర్గం ప్రచారం అధికం అవుతుంది. ఋణాలు తీరుస్తారు.

**మీనం:** ఆర్థిక పరమైన ఒత్తిళ్ళు ఉంటాయి. సర్దుబాటు చేసే కొద్ది మరికొన్ని పుట్టు కొస్తాయి. కళా,సినిమా రంగాల వారికి ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# దేవాన్ష్‌కు ప్రధాని మోడీ అభినందనలు

## మా ఇంటికి వచ్చి ప్రధాని చూపిన ఆప్యాయత మరువలేనిది:చంద్రబాబు

## చంద్రబాబు నివాసంలోని సీతారాములకు మోడీ పూజలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** ప్రధాని నరేంద్ర మోడీ తమ నివాసానికి రావడం తన కుటుంబానికి ఎంతో ప్రత్యేకమైన, చిరస్మరణీయమైన సాయంత్రమని ఎపి సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రధాని మోడీ చూపిన ఆప్యాయత, కుటుంబ సభ్యులతో ఆయన కలివిడిగా మాట్లాడిన తీరు ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆత్మీయ పర్యటనకు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహానికి ప్రధానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. 'ఈ (ఆదివారం) సాయంత్రం మా కుటుంబం ఎప్పటికీ గుర్తుంచుకోదగిన ఒక మధురానుభూతిని మిగిల్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఈరోజు(ఆదివారం) మా నివాసంలో ఆతిథ్యం ఇవ్వడం ఒక గౌరవంగా, ఆనందంగా భావిస్తున్నాను. ఆయన చూపిన ఆత్మీయత, ఆప్యాయత, మాతో ఎంతో ఉదారంగా సంభాషించిన తీరు ఈ సందర్భాన్ని మా అందరికీ ఎంతో ప్రత్యేకంగా మార్చాయి. ఆయనతో గడిపిన ప్రతి క్షణం మాకు చాలా విలువైంది.

మా ఆహ్వానాన్ని మన్నించి, ఎంతో దయతో మా నివాసానికి వచ్చినందుకు ప్రధానమంత్రికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఆయన అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి, మద్దతుకు కూడా ధన్యవాదాలు' అంటూ చంద్రబాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు (నారా లోకేశ్, దేవాన్ష్) ప్రధానికి సాదరంగా స్వాగతం పలికారు. దేవాన్ష్ భుజంపై చేయి వేసి ప్రధాని మోడీ ఇంట్లోకి వెళ్లారు. ఎంతో ఆత్మీయంగా దేవాన్ష్‌ను ప్రధాని మోడీ మాట్లాడాలి ఫోటోలను సైతం పంచుకున్నారు. సుమారు గంటా పది నిమిషాల పాటు చంద్రబాబు నివాసంలో గడిపిన మోడీ, అక్కడి సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెస్‌లో విశేషంగా రాణిస్తున్న నారా లోకేష్ తనయుడు దేవాన్ష్‌ను అభినందించారు. మరిన్ని అవార్డులు గెలుచుకుని దేశానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. అనంతరం, చంద్రబాబుతో ప్రధాని మోడీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ప్రధాని తమ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించడంపై చంద్రబాబు కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.


చంద్రబాబు మనుమడు దేవాన్ష్ భుజంపై చేయివేసి ఇంటి లోపలకు వస్తున్న ప్రధాని మోడీ

# మార్పు కోరుతున్న దేశం

>> చేసుకుందని, పుదుచ్చేరిలో కూడా ఎన్డీయే రెండెసారి అధికారంలోకి వచ్చిందన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్న ప్రధాని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బిజెపి సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని మండిపడ్డారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉందని, కాంగ్రెస్ ఎక్కడున్నా ఒక్కటే మోడల్ ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇస్తారు. తర్వాత సాకులు వెతుకుతారు. తెలంగాణలో కూడా అదే జరుగుతుందన్నారు. కాంగ్రెస్ విద్వేష రాజకీయాలను రెచ్చగొడుతుందని, పార్టీ ఎంఎంసిగా మారిందని ప్రధాని నరేంద్రమోడీ విమర్శించారు. దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటున్నప్పటికీ, మావోయిస్టులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన సంక్షోభం తలెత్తినప్పటికీ దేశంలో పెట్రోల్,డీజిల్ ధరలు పెరగకుండా జాగ్రత్త పడుతున్నామని ప్రధాని తెలిపారు.పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించండి. విదేశీ మారకద్రవ్యాన్ని మనం కాపాడుకోవాలి. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలి. ప్రజా రవాణాను వినియోగించాలి. మధ్యతరగతి ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలి. మధ్యతరగతి ప్రజలు విదేశీ ప్రయాణాలు మానుకోవాలి అని అన్నారు. దేశం నుంచి బయటకు వెళ్లే ధనాన్ని అరికట్టడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. బంగారం కొనుగోలుపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగారం ధర భారీగా పెరిగిపోయిందని.. ఏడాదిపాటు ప్రజలు బంగారం కొనడం ఆపేయాలని సూచించారు. ఇక, వంట నూనెల వినియోగాన్ని కూడా తగ్గించుకోవాలని చెప్పారు. అలాగే, ఎరువులు, రసాయనాల వినియోగం తగ్గించాలన్నారు. విదేశాల నుంచి భారీగా రసాయన ఎరువులను దిగుమతి చేసుకుంటున్నామని.. రసాయన ఎరువుల వల్ల భూమికి చాలా నష్టం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయంలో డీజిల్‌కు బదులు సౌర పంపులను ప్రోత్సహిస్తున్నామని.. వ్యవసాయంలో స్వదేశీ వస్తువులను ఎక్కువగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కనీసం ఏడాది పాటు విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని ప్రధాని అన్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాలని.. రసాయన ఎరువులను తగ్గించుకుంటే విదేశీ ద్రవ్యాన్ని మిగిలించుకోగలమని మోడీ చెప్పారు.

# మోడీ విధానాలే స్ఫూర్తి

>> పనిచేస్తున్నారని, 75 ఏళ్ల వయస్సులో ప్రధాని పాటించే ఆరోగ్య సూత్రాలు, శారీరక ధృడత్వం వంటివి తనకు స్ఫూర్తి అని మంత్రి లోకేష్ ప్రధానితో చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ పని విధానం చూస్తుంటే... 25 ఏళ్ల వయస్సున్న ముగ్గురు యువకులు ప్రధానిలో ఉన్నట్టు చురుగ్గా పని చేస్తారని ఈ సందర్భంగా లోకేష్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లే ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజకీయాల్లోనూ, అభివృద్ధిలోనూ, ప్రజా సంక్షేమంలోనూ దేశంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు తనకు మార్గదర్శకులని... ఇద్దరూ తనకు మెంటార్లేనని, గురువులుగా వారిని అనుసరిస్తానని లోకేష్ అన్నారు. అంకితభావంతో, సేవా ధృక్పథంతో భావితరాల కోసం నిస్వార్థంగా పని చేసే మోడీ, చంద్రబాబుల స్పీడ్ అందుకోవాలనే తన కల సాకారం కావాలని కోరుకుంటున్నానన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని ఎప్పుడు కలిసినా తన నియోజకవర్గం మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించడం నారా లోకేష్ ఆనవాయితీగా పెట్టుకున్నారు. మంగళగిరి చేనేత శాలువాతో ప్రధానిని సత్కరించి లోకేష్.. మంగళగిరి చేనేత విశిష్టతను ప్రధానికి వివరించారు.

పాతాళ్ గని సొరంగాల్లో చీకటి (unclear)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 100 పేజీలు: 12 వెల: 6.50

అసోం ఎన్డీయే పక్ష నేతగా హేమంత; రేపు ప్రమాణం

ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగిస్తాం: పుతిన్

8లో

# మార్పు కోరుతున్న దేశం


ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో డప్పు వాయించిన ప్రధాని మోడీ

- ఏ రాష్ట్రంలోను కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవడం లేదు..
- కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ..
- బంగారం ధర భారీగా పెరిగింది.. యేడాది పాటు కొనకండి
- హైదరాబాద్ బహిరంగ సభలో ప్రధాని మోడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** పశ్చిమ బంగాల్‌లో తొలిసారి బిజెపి ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పశ్చిమబంగాల్‌లో బిజెపి చరిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అక్కడి ప్రజలు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం బిజెపిని గెలిపించుకున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజల నుంచి కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణలో ఈసారి వచ్చేది బిజెపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్స్‌లో బిజెపి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు. అంతకుముందు తన కోసం కార్యకర్తలు తెచ్చిన పెయింటింగ్స్‌ను సేకరించాలని ప్రధాని ఎస్పీజీని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్ర కళాకారులకు తిరిగి లేఖలు రాస్తానని చెప్పారు. ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. మోడీని చూసిన ఆనందంలో బిజెపి శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలతో సభ ప్రాంగణాన్ని హోరెత్తించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న ప్రధాని మోడీ, పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. టిఎంసీ తానాషాహీ మోడల్‌తో ప్రజలను ఇబ్బంది పెట్టిందని, బెంగాల్ ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువు పీల్చుకుంటున్నారని చెప్పారు. పదేళ్ల క్రితం బెంగాల్‌లో బిజెపి ఎమ్మెల్యేలు ముగ్గురే ఉండేవారని, ఇప్పుడు 200 మందికి పైగా గెలిచారని, పశ్చిమబెంగాల్‌లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. బెంగాల్ విజయోత్సవం తెలంగాణలో కనిపిస్తోందని, ఆ రాష్ట్రంలో ఎలాంటి ఉత్సాహాన్ని చూశామో అచ్చం తెలంగాణలో కూడా అదే ఉత్సాహం కనిపిస్తోందని చెప్పారు. అస్సోంలో బిజెపి హాట్రిక్ విజయాన్ని సొంతం >>2



ఆదివారం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో గవర్నర్ అర్లేకర్ విజయ్‌చేత ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించిన దృశ్యం

# దళపతి విజయ్

## చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో అశేష అభిమానుల మధ్య సిఎంగా ప్రమాణం

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రముఖులు హాజరు

## మరో 9 మంది మంత్రులు కూడా ప్రమాణం

**చెన్నై, మే 10:** తమిళనాట రాజకీయ పార్టీని స్థాపించి రెండున్నరేళ్లలోపే అధికారంలోకి తీసుకువచ్చిన టివికె చీఫ్ విజయ్ ఆదివారం ముఖ్యమంత్రిగాప్రమాణ స్వీకారంచేసారు. నగరంలోని జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈకార్యక్రమంలో గవర్నర్ విశ్వనాథ్ అర్లేకర్ విజయ్‌చేత రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. 1967 తర్వాత డిఎంకె, అన్నాడిఎంకెలు కాని రాజకీయ పార్టీగా టివికె రికార్డుసాధించిన తరుణంలో టివికె విజయ్ ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలుచేపట్టారు. ఆయనతోపాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణస్వీకారంచేసారు. ప్రమాణస్వీకారం సందర్భంగా నెహ్రూ స్టేడియం పరిసరాల్లో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లుచేసారు. రాజకీయ, సినీ ప్రముఖులు, పారిశ్రామికరంగాల ఉద్దండులు ఎందరో ఈ ప్రమాణ స్వీకారకార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీనుంచి రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. విజయ్‌తోపాటు ఎన్ ఆనంద్, అదవ అర్జున, కెఎ సెంగోట్టియన్,ఎస్‌కీర్తన, కెజి అరుణ్‌రాజ్, పి వెంకటరమణన్, సిఆర్ నిర్మల్‌కుమార్, రాజ్‌మోహన్, టికెప్రభులు మంత్రులగా ప్రమాణస్వీకారంచేసారు. బిజెపి అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, మాజీ చీఫ్ కె అన్నామలైలు కూడా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చారు. వీరితోపాటు విసికె అధ్యక్షుడు పెరుమావళన్, సిపిఐ, సిపిఎం నేతలు బాబీ, రాజా వంటి సీనియర్‌నేతలు కూడా పాల్గొన్నారు. ఐయుఎంఎల్ పార్టీ నాయకులు, ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్యేలు సైతం ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం సచివాలయానికి వెళ్లి తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

కాగా జోసెఫ్ విజయ్‌ప్రమాణస్వీకార కార్యక్రమంలో సినీ నటి త్రిష కృష్ణన్, ఆమె తల్లికి ముందువరుసలోనే సీట్లు కేటాయించారు. అదే వరుసలో విజయ్ తండ్రి చంద్రశేఖరన్, తల్లి శోభ చంద్రశేఖరన్‌లకు సీట్లు ఏర్పాటుచేసారు. వేడుక ప్రారంభానికిముందే అక్కడకు చేరుకున్న త్రిష విజయ్ తల్లి శోభతో >>2

# మోడీ విధానాలే స్ఫూర్తి

- ప్రధాని, చంద్రబాబు నాకు గురువులు: మంత్రి లోకేష్
- ఎపి అభివృద్ధికి ప్రధాని చేసిన సాయానికి కృతజ్ఞతలు చెప్పిన సిఎం చంద్రబాబు
- ఇక బరువు తగ్గొద్దంటూ లోకేష్‌కు ప్రధాని సలహా
- గంటపైగా చంద్రబాబు నివాసంలో గడిపిన ప్రధాని మోడీ


ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం చంద్రబాబు నివాసంలో సమావేశమైన ప్రధాని మోడీ. చిత్రంలో మంత్రి లోకేష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే10:** హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఎపి సిఎం నారా చంద్రబాబు ఇంటికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ గంటకుపైగా సమయాన్ని చంద్రబాబు నివాసంలో గడిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసాంతం నవ్వులు విరిశాయి. సిఎం చంద్రబాబు నివాసంలోకి అడుగు పెడుతుండగానే... ఓ ఫొటో చూసిన ప్రధాని ఏడాది క్రితం అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా సరిగ్గా ఏడాది క్రితం యువగళం కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ ఢిల్లీలో చేయించారు మంత్రి నారా లోకేష్. అప్పటి ఫోటోను ఫ్రేమ్ చేయించి.. అందులో యువగళం కాఫీ టేబుల్ బుక్ కూడా భద్రపరిచారు. ఇది సిఎం చంద్రబాబు ఇంట్లోకి వెళ్లే ముందు కనిపిస్తుంది. ప్రధాని మోడీ ఆ ఫొటోను చూసి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తకాన్ని ప్రధాని మోడీ ఆవిష్కరించి ఏడాది పూర్తైందని.యాధృచ్ఛికంగా ప్రధాని తమ ఇంటికి వచ్చారంటూ ప్రధాని మోడీకి నాటి సంఘటనలను లోకేష్ గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ సిఎం చంద్రబాబు ఇంటలోని రామమందిరం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలు దశాబ్దాల క్రితం నాటివని, ఆ పంచలోహ విగ్రహాలను నందమూరి తారకరామారావు తమకు ఇచ్చారని సిఎం చంద్రబాబు ప్రధాని మోడీకి వివరించారు. చంద్రబాబు నివాసంలో ప్రధానితో సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న సాయానికి సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

ఇక ఈ సమావేశంలో లోకేష్ ఫిట్నెస్‌పై ఆసక్తికర సంభాషణ జరిగింది. లోకేష్ ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోడీనే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అనంతరం లోకేష్ ఫిట్నెస్, డైట్‌పై శ్రద్ధ పెట్టారని సిఎం చంద్రబాబు ప్రధానికి చెప్పారు. లోకేష్ ఇంకా బరువు తగ్గొద్దంటూ మోడీ సలహా ఇచ్చారు. ఫిట్నెస్ విషయంలో మీరే స్ఫూర్తి అని... మరింత ఫిట్‌గా మారతానని లోకేష్ ప్రధానితో చెప్పారు.దేశం కోసం క్షణం తీరికలేకుండా >>2

# నేడు సింగపూర్‌కు మంత్రి లోకేష్

## పలు కీలక సమావేశాలకు హాజరు

**విజయవాడ,మే 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సోమవారం ఆయన సింగపూర్ లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలే లక్ష ్యంగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఎంటీఐ కార్యాలయంలో జరిగే జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో లోకేష్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం సింగపూర్‌లోని సన్ టెక్ సిటీలో వరుస భేటీలు జరపనున్నారు.

మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు కమోడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో, సీఎఫ్‌ఓలతో సమావేశమవుతారు. ఆ తర్వాత 2:30 నుంచి 3 గంటల వరకు డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధులతో లోకేష్ భేటీ అవుతారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

# నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

## సిఐఐ బిజినెస్ సమ్మిట్‌కు హాజరు

**విజయవాడ, మే 10,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. నేడు హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు. సిఎం ఉదయం 11.30 గంటలకు హోం మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తోనూ ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, నిధులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో సిఎం చర్చించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు సిఎంతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు హోటల్ తాజ్ ప్యాలెస్‌లో భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతిఆయోగ్ సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. సోమవారం రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్నారు.

# పేద ముస్లిం స్టూడెంట్లకు ఉచిత విద్య



## కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్ చదువుకు ప్రభుత్వ సాయం: మంత్రి అనగాని

**విజయవాడ మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ చదవబోయే పేద ముస్లిమ్ విద్యార్థులకు సువర్ణ అవకాశం కల్పించిందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆయన కార్యాలయం నుంచి మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం ఆర్థిక స్తోమతలేని పేద ముస్లిం విద్యార్దులకు చదువుకునేందుకు సహాయం అందజేస్తుందని తెలిపారు.వారికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య పూర్తిగా ఉచితం అందిస్తోందన్నారు. ఉచిత హాస్టల్ భోజనం పాఠ్యపుస్తకాలు, బోధనతోపాటు ఐఐటి-జీ, నీట్, ఎంసెట్ లకు ప్రత్యేక కోచింగ్. తెల్లకార్డు కలిగి స్టేట్ బోర్డుల్లో 450 మార్కులు, సీబిఎస్ఇలో 75శాతం కంటే ఎక్కువ వచ్చిన విద్యార్థులకు అవకాశం కల్పించిందన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా పేద ముస్లీమ్ విద్యార్థుల ఎంపిక చేస్తామన్నారు.ఈ నెల 12వ తేదీనే ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని తెలిపారు.సంక్షేమ ప్రదాత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు. ముస్లీమ్‌ల సంక్షేమానికి కూటమి >>2

# నాలుగు రోజులు వర్షసూచన

**విజయవాడ మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** బీహార్ నుండి జార్ఖండ్, ఒడిశా, చత్తీస్‌గఢ్‌ల మీదుగా కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు ద్రోణి కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీలంక ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. వీటి ప్రభావంతో కోస్తాంధ్రలో గురువారం వరకు, రాయలసీమలో మంగళవారం వరకు విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా సురక్షిత భవనాల్లో ఆశ్రయం పొందాలన్నారు. పాత భవనాలు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో వర్షం పడేటప్పుడు రైతులు, పశు కాపరులు చెట్ల క్రిందకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

# పిపిపి ద్వారా రెండేళ్లలో 2,500 ఎంబిబిఎస్ సీట్లు

## ఆ ఆసుపత్రుల్లోని 70 శాతం పడకలు పేదలకు ఉచితవైద్యం: మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పిపిపి విధానం ద్వారా రెండేళ్లలో 2500 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పిపిపి ఆసుపత్రుల్లో 70 శాతం పడకలు ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారులకు కేటాయించి పేదలకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు.ఆదివారం టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్సీ నేతలపై తీవ్ర విమర్శలు చేసారు. ఆనాడు అరాచకాలు చేసి నేడు నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేసారు.విద్యా, వైద్య రంగాలను జగన్ సర్కార్ నాశనం చేసిందనీ ఆరోపణ. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టింది వైసీపీయేనని ఫైర్. పిపిపి విధానంతోనే మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం. వైఎస్సార్సీ నేతలు నాడు ప్రజల పీకలు కోసి, అరాచకాలకు పాల్పడి నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వారి ఉత్తర కుమార ప్రగల్భాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. వైద్య రంగంలో వాస్తవాలు ఇవి ఓ స్వయం ప్రకటిత మేధావి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తామే కట్టామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారంచుట్టింది ఎన్టీఆర్ అని, ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు 22 మెడికల్ కాలేజీలు నిర్మించారని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మక ఎయిమ్స్ ఎపికి >>2

# 'కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలి'

**విజయవాడ,మే 10,ప్రభాతవార్త, ప్రతినిధి:** కాంప్లెక్స్ ఎరువుల ధరలను పెంచడంపై ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది కేంద్రం ఎరువులపై సబ్సిడీని పెంచి ధరలు పెరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఉన్న ధరలపై సుమారు 20 శాతం వరకు పెంచి రైతులపై అదనపు భారం మోపారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.బలరాం, ఎం.హరిబాబులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20:20 ఎరువు బస్తా ధరను రూ.1500 నుంచి రూ.1800కు పెంచారని, ఇదే విధంగా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినట్లు తెలిపారు.

వార్త

నిమిషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికీ, ఆజ్ఞలకూ అతీతమైనదే అసలైన సంతోషం.

- ఎమర్సన్

# బంగ రాజకీయాల్లో కొత్త మలుపు!

ఎన్‌డిఏకు నేతృత్వం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ ఇప్పుడు పశ్చిమ బంగ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నెలకొల్పింది. శనివారం ఉదయం ఘడియల్లో సువేందు అధికారి ప్రమాణస్వీకారంతో కొత్తగా కొలువు తీరింది. భారతీయ జనతాపార్టీకి మూలబిందువైన భారతీయ జనసంఘ్ పార్టీకి ప్రాణప్రతిష్ట చేసిన వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ బెంగాల్ వాసి. 1951లో ఏర్పడిన ఈ జనసంఘ్ పార్టీయే 1980లో భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందింది. ఒక్కో రాష్ట్రంలోనూ ప్రభుత్వాలను ఏర్పరచుకుంటూ నిన్నమొన్నటి ఎన్నికలతో దాదాపు 21రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పర్చుకుంది ఇంతకు ముందు ఎన్ని రాష్ట్రాలలో బిజెపి జైత్రయాత్ర సాగించినా 'పశ్చిమ బంగ' రాష్ట్రంలో జరిగిన అధికార మార్పిడికి ప్రత్యేక కారణముంది. నిన్నమొన్నటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అహంకారమేనని చాలా విశ్లేషణల్లో చెప్తుంటారు. కానీ అసలు సిసలుగా చెప్పుకోవాల్సింది ఆమె వ్యవహారశైలితోపాటు చెప్పుకోవాల్సినవి ఇంకా ఉన్నాయి. జాతీయ భద్రత, బెంగాల్‌లో చొరబాట్లు, గోవుల అక్రమ రవాణా వంటి అంశాలు ఆరాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. అందుకే ఈ రాష్ట్రాన్ని తన కనుసన్నల్లో నడిచే 'డబుల్ ఇంజిన్ సర్కార్' రాష్ట్రంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వానికి ఏర్పడింది. బెంగాల్‌లో తొలి బిజెపి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి చరిత్ర సృష్టించారు. బెంగాల్‌ను సామాజిక అవలక్షణాలకు దూరంగా సాధారణ పరిస్థితికి తీసుకురావడానికి ఆయనకే పాలనా పగ్గాలు అప్పగించాల్సిన పరిస్థితి బిజెపికి అనివార్యం. ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో జనతా భద్రత రీత్యా బిజెపి ముఖ్యమంత్రిని కొలువు దీర్చటమే తక్షణావశ్యకం. కొత్త ప్రభుత్వం వ్యక్తిగత అధికారం చుట్టూ తిరగకుండా 'నేను కాదు మనం' అనేభావనతో ప్రజలకు సేవ చేస్తుందని ప్రమాణస్వీకారానికి ముందు కాబోయే ముఖ్యమంత్రిగా సువేందు భరోసా ఇచ్చారు. గత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు భయోత్పాతానికి గురయ్యారని ఇకపై అలాంటి పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఒకప్పటి మమతా బెనర్జీకి ఆయన వీర విధేయుడు అయినా ఆమె వైఖరిని వ్యతిరేకించారు. 2020 డిసెంబరులో బిజెపిలో చేరి ఆమె హయాంలోప్రతిపక్ష నాయకునిగా ప్రజలకు అండదండలిచ్చారు. మమతా బెనర్జీ 15 ఏళ్ల పరిపాలనలో ఆమెకు కేంద్ర ప్రభుత్వంతో తగాదాలే సరిపోయాయి. సజావుగా పరిపాలన చేయడం కన్నా ప్రతి విషయంలోనూ వివాదాస్పదంగా వ్యవహరించేవారు.. ఎన్నికల ముందు ఆమె నిర్వహించిన పాత్ర బెడిసికొట్టింది. ఏది చేసినా డ్రమెటిక్‌గా చేయాలనుకునే తీరు బంగ ప్రజలకు నచ్చలేదు. ఎన్నికల కమిషన్ విస్తృత ఓటర్ల తనిఖీ ప్రక్రియను 'సర్' కార్యక్రమంగా చేపట్టారు. దానిని ఆమె పూర్తిగా వ్యతిరేకించింది. చివరికి వ్యక్తిగత ధోరణిలో వ్యాఖ్యానాలు, చాలెంజీలు విసరడం ప్రజలు అంగీకరించలేదు బెంగాల్‌లో పరిశ్రమలవృద్ధి చెప్పుకోదగినంతగా లేదు. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాస్పద ధోరణి కారణంగా పెద్దగా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రాలేదు. పాలకులపై నమ్మకం సన్నగిల్లింది. పాలక వర్గంపై అవినీతి ఆరోపణలువచ్చాయి. రాజకీయ హింస చెలరేగింది. 2 దశాబ్దాల క్రితం కమ్యూనిస్టులు పరిపాలించిన నేలపై మమతా బెనర్జీ గట్టిగానే పోరాడారు. ఆమె దూకుడును బట్టి సత్పరిపాలన అందిస్తారనే ఆశపడినప్రజలకు అడియాసే మిగిలింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు జమ అయింది. ప్రజలు మార్పుకోరుకున్నారు. అందుకు తగినట్లుగానే ఓటింగ్ ప్రక్రియ జరిగింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలు తమ విజయంపై ప్రభావితం చేసిందని ఆమె గొంతెత్తి అరిచారు. ఓటమి మిగిలాక కూడా ఆమె గద్దెదిగనన్నారు. రాజీనామా చేయను గాక చేయనన్నారు. మొంటి పట్టుపట్టారు. చివరికి అసెంబ్లీ రద్దుచేసి ఇకఆమెతో పనిలేదని గవర్నర్ చెప్పాల్సి వచ్చింది. పరాజయాన్ని ప్రజల తీర్పును హుందాగా అంగీకరించే సంయమనం కోల్పోయారు. ఎన్నికల ముందొకసారి 'ఐప్యాక్' ప్రతినిధులపై ఇ.డి దాడులు జరిపినప్పుడు మమత వ్యక్తిగత ప్రతిష్టకు పోగా సుప్రీంకోర్టు మందలించిందన్న అపప్రథ పొందారు. ఇవన్నీ ఆమె పట్ల ఏకుమేకులయ్యాయి. బంగ రాజకీయ చరిత్రలో 2026ఎన్నికలు ఒక మార్పు. 'సర్' అనే విస్తృత ఓటర్ల గుర్తింపు ప్రక్రియే ఒక ముఖ్య సంస్కరణ. సంక్షేమ పథకాలద్వారా గ్రామీణ మహిళలు, రైతులు పేద వర్గాలపై మొదట్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభావితం చూపింది. ప్రధానంగా యువత సంక్షేమం కాదు. ఉద్యోగాలు కావలన్న నినాదంతో నిరుద్యోగులు ప్రభుత్వంపై ఎదురుతిరిగారు. తమ వద్దనున్న ఓటు హక్కుతో ప్రభుత్వాన్ని మార్చదలచుకున్నారు. అదే చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడంతో కలిగిన నష్టాలను చవిచూసిన జనం ఈసారి బిజెపికి పట్టం కట్టారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఆదినుంచీ భావోద్వేగాలు, ప్రాంతీయ గౌరవం, సాంస్కృతిక సౌరభం వంటి అంశాలతో ముడిపడి ఉన్నాయి. వాటిని గౌరవిస్తూ కొత్త ప్రభుత్వం పాలనలో ముందుకు సాగాలి. అధికార మార్పు ప్రతీకార రాజకీయాలకు చోటివ్వకుండా ఉన్నప్పుడే బంగ రాజకీయాలు రాణిస్తాయి. ఒకప్పుడు భారతదేశ వాణిజ్యానికి తలమానికంగా ఉన్న కోల్‌కత్తా నుంచి పరిశ్రమలు తరలివెళ్లిపోయాయి. మళ్లీ పెట్టుబడుల సమన్వయంతో పరిశ్రమలు రాగలిగితే నిరుద్యోగ సమస్య తీరగలదు. ఏది ఏమయినా పారదర్శక పాలనను బంగప్రజలు కోరుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల్లో వివిధ సామాజిక అంశాలపట్ల విశ్వాసం కల్పించినప్పుడే బెంగాల్ సర్వతోముఖాభివృద్ధిగా సాగుతుంది.

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

పనులను చేయడంలో రహస్యం ఒకటుంది. అదేమిటంటే ఆ పనుల్ని వాయిదా వేయడం కాదు. వెంటనే చేయడం.



ఆడమ్‌స్మిత్

## ప్రజావాక్కు

### మాతృభాషపై తప్పుతున్న పట్టు

మార్చినెలలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో 41.3 శాతం విద్యార్థులు తప్పారు. బాలికలు కంటే బాలురే ఎక్కువ మంది ఫెయిలవ్వటం గమనార్హం. ఈ నేపథ్యంలో బాలురకు మాతృభాష పట్ల ఏ మాత్రం అనురక్తి లేదని తేటతెల్లమౌతోంది. ఈ విద్యా సంవత్సరంలో మన రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను 6,17,827 మంది రాయగా 5,26,677మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో ప్రభుత్వ పాఠశాలలలో చదివిన బాల, బాలికలు అత్యధిక మార్కులు, ర్యాంకులు సాధించటంతో తల్లిదండ్రులందరూ సంతోష పడ్డారు. కానీ పదో తరగతి పరీక్షలలో తప్పిన వారిలో అత్యధిక మంది తెలుగుసబ్జెక్టులో తప్పటం తెలుగు భాషా వేత్తలు, భాషాభిమానుల హృదయాలను తీవ్ర నిరాశ పరుస్తోంది. రాష్ట్రంలో ఐదుకోట్ల మందికి మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు సైతం ఫెయిలవ్వటం శోచనీయం.

- జి.సూర్యనారాయణ, కృష్ణాజిల్లా

### ఇలాంటి వ్యక్తులు గవర్నర్ పదవికి అనర్హులు

తమిళనాడులో ప్రజాస్వామ్యం ఖూనీయవుతుంది. గవర్నర్నును తక్షణమే తొలగించాలి. 108మంది శాసన సభ్యులు ఉన్న టీవీకే పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పరచమని ఆహ్వానించాలి. ఆపార్టీ నాయకుడు విజయ్ రెండుసార్లు వెళ్ళి గవర్నరును కలిసినా కూడా 118సభ్యుల లిస్ట్ నాకు చూపమని అడగడం ఆయన అహంకారానికి నిదర్శనం. మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆహ్వానించాలి అని చెప్పాడు. విజయ్‌కు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత మీ బలాన్ని నిరూపించుకో అనిగవర్నరు చెప్పాలి. నిరూపించుకుంటే కొనసాగుతారు. లేదంటే రాజీనామ చేస్తాడు. 'బొమ్మై కమిషన్ తీర్పులో సుప్రీం కోర్టు కూడా చెప్పింది. మరి తమిళనాడు గవర్నరు ఇలా ప్రవర్తించటం అపదవిని దుర్వినియోగ పరచట మే అవుతుంది.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మనం అభివృద్ధి చెందాలి

దేశంలో దినదిన అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానరంగంతోపాటు సమాజంలో జరుగుతున్న విషయాలను క్రోడీకరించి భవిష్యత్ జీవితంలో మలచుకోవాల్సిన అవసరాలకుఅనుగుణంగా మనంనిరంతరంశ్రమిస్తేనే అందరితోపాటు ముందంజలో ఉంటూఅభివృద్ధి చెందగలం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### భారీ క్లైమాక్స్ దిశగా విజయ్ 'సర్కార్'

తమిళ హీరో విజయ్ సినిమా 'సర్కార్' అని ఒకటిఉంది. అది ఎలా ఉందో తెలీదు కానీ ఇప్పుడాయన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మంచి పనితీరు కనపరిచి, సర్కారు ఏర్పాటు చేసే దశకు వచ్చాక క్లైమాక్స్ సీను పలు మలుపులు తిరుగుతూ వస్తోంది. భారీ క్లైమాక్స్ తర్వాత ఆయన హీరోగా వస్తారా, ఒక ప్రధాన పాత్రగా సరిపెట్టుకుంటారా అన్నది ఊహించనలవి కావడంలేదు. అయితే ఈ సీను వరకూ ఆయన సోలో సూపర్ స్టార్‌గానే ఉన్నారు. తమిళనాడులో దశాబ్దాలుగా రెండు పార్టీలే అధికారాన్ని మార్చి మార్చి అందుకుంటున్నాయి. ఈసారి మూడో ప్రత్యామ్నాయంగా విజయ్ టీవీకే పార్టీ స్థాపించి, పొత్తుల్లేని సింగిల్ పార్టీగా ఎన్నికల్లో పోటీ చేసి, సంఖ్యాబలంలో అతిపెద్దపార్టీగా గెలిపించుకున్నాడు. సినిమా తెరను మించి మసాలా పంచుతున్న తమిళ రాజకీయాల క్లైమాక్స్ ఘట్టం ప్రజలకు మాత్రం రుచించనిది.

- డా.డి. వి. జి. శంకరరావు, విజయనగరం

### దెబ్బతింటున్న భక్తుల మనోభావాలు

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యివాడకంపై వెలువడిన వాస్తవాలు భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన దినేష్ కుమార్ ఏకసభ్య కమిషన్ నివేదిక ప్రకారం, గతప్రభుత్వ హయాంలో ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండానే సుమారు 70 లక్షల కిలోల నెయ్యిని సేకరించడం దిగ్భ్రాంతికరం. ఈ నెయ్యిలో వనస్పతి వంటి కూరగాయల కొవ్వులు ఉన్నాయని ప్రయోగశాల నివేదికలు స్పష్టం చేసినప్పటికీ, ఆ విషయాలను తొక్కిపెట్టడం అత్యంత విచారకరం. తొలుతనెయ్యి స్వచ్ఛతను పరీక్షించడానికి ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐసూచించిన 'సిటోస్టెరాల్'పరీక్షావిధానాన్ని అమలు చేయాలని అధికారులు భావించినప్పటికీ, ఆ తర్వాత ఆ నిర్ణయాన్నివెనక్కి తీసుకోవడం అనుమానాలకు దారితీసింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇంటర్ విలీనం వద్దు

ప్రస్తుతం ఉన్న ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో కలపాలని ఆలోచన సరికాదు. గతంలో 7వ తరగతికి బోర్డు ఎగ్జామ్ ఉండేది. ప్రస్తుతం దానిని రద్దుచేసి 10వ తరగతిని బోర్డు ఎగ్జామ్ కొనసాగుతుంది. ఇంటర్ విద్య పాఠశాల విద్యలో కలపడం వలన పోటీ తత్వం తగ్గుతుంది. ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉద్యోగ పోటీ పరీక్షలు రాసేవారు ఆసక్తి లేకుండా ఉంటారు. జూనియర్ లెక్చరర్‌గాఎన్నికైన వారు నిరుత్సాహం పడతారు.

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఫీజుల దోపిడీకి కళ్లెం ఇంకెప్పుడు?

**ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ విద్యా రంగంపై నియంత్రణ కోల్పోయిన పాలకులు దానిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారనిచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచిత పథకాలపై చూపుతున్న శ్రద్ధ విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై కనిపించడం లేదు. ఉచిత, నాణ్యమైన విద్య కోసం ప్రజల్లో మరో చైతన్య పోరాటం రావాల్సిన అవసరం ఉంది. విద్యారంగం లోని ఈ వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. విద్యను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చి అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధ్యమవుతుంది. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది.**



మేకిరి దామోదం

భారతదేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ మాత్రమే కాదు పలు ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజులు తల్లిదండ్రులకు షాక్‌కు గురిచేస్తున్నాయి. అగ్రశ్రేణి స్కూళ్లని చెప్పుకునే కొన్ని విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఏడాదికి లక్షలల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈ భారీ ఫీజులను చూసి తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని ఐవీ లీగ్ అండర్‌గ్రాడ్యుయేట్ ట్యూషన్ ఫీజులు లేదా యూరప్‌లోని ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూళ్ల ఫీజులకు సమానంగా ఇక్కడ ఫీజులు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారతదేశంలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారిపోతోంది. కార్పొరేట్ శక్తుల ప్రవేశంతో విద్యారంగంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. పలు బడా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల భారం తల్లిదండ్రుల నడ్డి విరుస్తోంది. చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయానికి మించి పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోని సింగపూర్, దుబాయ్, న్యూయార్క్ వంటి నగరాల్లో ఉన్న స్కూల్ ఫీజులతో సమానంగా భారత దేశంలో ఫీజులు వసూలు చేస్తున్నా అందుకు తగ్గట్టుగా భారతీయ తల్లిదండ్రుల ఆదాయాలు మాత్రం లేవు. అంతేగాక, లక్షల్లో ఫీజులు చెల్లిస్తున్న పిల్లలకు అందుకు తగిన విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు కూడా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలపై కఠిన నియంత్రణ ఉండాలని విద్యావేత్తలు, నిపుణులు సూచిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయి ఫీజులు భరించే ఆర్థిక స్థోమత భారతీయ కుటుంబాలకు లేకపోయినా ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వారిని ఆ దిశగా నెట్టేస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ శక్తులు, వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారతదేశంలో చాలామంది తల్లిదండ్రులు తమ వార్షిక ఆదాయంలో 50శాతం నుంచి 130 శాతం వరకు పిల్లల స్కూల్ విద్య కోసం ఖర్చు చేస్తున్నారనే అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంటే కొన్ని సందర్భాల్లో వార్షిక ఆదాయం కంటే ఎక్కువ మొత్తాన్ని విద్య కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మన దేశంలో అంతర్జాతీయ ప్రమాణాల పేరుతో భారీ ఫీజులు వసూలు చేస్తున్న అనేక స్కూళ్లలో మౌలిక వసతులు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఒక తరగతి గదిలో సగటున 35 నుంచి 40 మంది విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. స్విమ్మింగ్ పూల్స్, ల్యాబ్‌లు, ఆడిటోరియంలు ఉన్నప్పటికీ వాటిని పరిమితికి



మించి విద్యార్థులు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాల విద్య అని ప్రచారం చేస్తున్నా.. ఉపాధ్యాయుల శిక్షణ, బోధనా విధానాలు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విదేశాల్లోని అనేక ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఒక తరగతి గదిలో 15నుంచి 20 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారు. ఫీజులకు తగినట్టుగా సదుపాయాలు, వ్యక్తిగత శ్రద్ధ, నాణ్యమైన విద్య అక్కడ విద్యార్థులకు అందుతుంది. రాష్ట్రంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచకుండా నియంత్రిస్తామనే మాటలు సంవత్సరాలుగా వినిపిస్తున్నా అవి ఆచరణలోకి రావడం లేదు. మరో విద్యాసంవత్సరం ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నప్పటికీ, ఫీజుల నియంత్రణపై స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా ఫీజుల నియంత్రణ కోసం కమిటీలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా చట్టపరమైన చర్యల విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదు. దేశంలోని అనేక నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే స్కూల్ ఫీజులు అధికంగా ఉన్నాయని కొన్నిఅధ్యయనాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఇంజినీరింగ్ విద్యకు సమానంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో కొన్ని చోట్ల ప్రతి ఏడాది 20నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని హైకోర్టులో అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలుఉన్నాయి. విద్యా హక్కు చట్టం-2009లోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు 25శాతం సీట్లను బలహీన వర్గాలు, అనాథలు, ఎయిడ్స్ బాధిత కుటుంబాల పిల్లలకు కేటాయించాలి. ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం తిరిగి చెల్లించవచ్చు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే ఈ నిబంధనఅమలు చేస్తున్నప్పటికీ మన రాష్ట్రంలో మాత్రం సవరణల పేరుతో అమలు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు సమిష్టి బాధ్యతగా రాజ్యాంగంలో పొందుపరిచాయి. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కానీ విద్యా రంగంపై నియంత్రణ కోల్పోయిన పాలకులు దానిని కార్పొరేట్ శక్తుల చేతుల్లో వ్యాపార వస్తువుగా మారనిచ్చారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఉచిత పథకాలపై చూపుతున్న శ్రద్ధ విద్య, వైద్యం వంటి ప్రాథమిక రంగాలపై కనిపించడం లేదు. ఉచిత, నాణ్యమైన విద్య కోసం ప్రజల్లో మరో చైతన్య పోరాటం రావాల్సిన అవసరం ఉంది. విద్యారంగం లోని ఈ వ్యాపారీకరణ, కార్పొరేటీకరణకు అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. విద్యను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొచ్చి అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధ్యమవుతుంది. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది.

# లోపాలను తొలగిస్తేనే మూడో డిస్కమ్ సక్సెస్

గువ్వల పవన్ కుమార్

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.ఎమ్ఎస్.నం.44 ప్రకారం మూడో డిస్కమ్ ఏర్పాటు నిర్ణయం విద్యుత్ రంగంలో ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడం, ముఖ్యంగా వ్యవసాయం, లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ వంటి సబ్సిడీ వినియోగదారులకు సేవలను అందించడం అనే లక్ష్యంతో తీసుకోబడింది. ప్రస్తుతం రాష్ట్రంలో టిజిఎస్‌పిడిసిఎల్ 15జిల్లాలు, టిజిఎన్‌పిడిసిఎల్ 18 జిల్లాలకు సేవలు అందిస్తుండగా, కొత్త డిస్కమ్‌కు సుమారు 29 లక్షలకుపైగా కనెక్షన్లు బదిలీ చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు సూచిస్తున్నాయి. ఈ పరిమాణంలో సంస్థాగత మార్పు తీసుకురావడం చిన్న విషయం కాదు. అందుకే ప్రభుత్వం స్పష్టంగా విధానపరమైన మార్గదర్శకాలను అమలు చేయాలని, సంబంధిత వర్గాలతో చర్చలు జరిపి సందేహాలను నివృత్తి చేయాలని సూచించింది. అయితే ఈ కీలక దశలో ఉన్నతాధికారులు అనుసరిస్తున్న విధానం బాధాకరం. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలలో ముఖ్యంగా ఉద్యోగుల వ్యవహారాల్లో స్పష్టత, పారదర్శకత అవసరమని పరోక్షంగా వెల్లడైంది. మూడో డిస్కమ్‌కు సుమారు 2,000 మంది సిబ్బంది అవసరమని అంచనా వేసి, వారిని ప్రస్తుత సంస్థల నుంచి బదిలీ చేయాలని ప్రణాళికలో పేర్కొనబడింది. కానీ అదే సమయంలో ఖాళీ అయ్యే పోస్టులను తొలగించాలనే నిబంధనను ఉన్నతాధికారులు ఒక సాధనంగా ఉపయోగించుకుంటూ, మాతృ సంస్థల కేడర్ నిర్మాణాన్ని క్రమంగా తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇది సంస్కరణ కంటే సంస్థల బలహీనతకు దారి తీసే చర్యగా కనిపిస్తోంది. ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం ఏమిటంటే, కొత్త డిస్కమ్ ఏర్పాటు కోసం అవసరమైన పోస్టులను ప్రభుత్వం నుంచి కొత్తగా మంజూరు చేయించుకోవచ్చు. అలాంటి చర్య తీసుకుంటే ప్రస్తుత విద్యుత్



సంస్థలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదు. కానీ ప్రస్తుత పరిస్థితిలో ఉన్నతాధికారులు అనుసరిస్తున్న విధానం వేరే దిశలో ఉంది. ఇప్పటికే ఉన్న పోస్టులను మళ్లించడం, ఉద్యోగులను ఆకర్షించడానికి ప్రమోషన్లు ఆఫర్ చేయడం వంటిచర్యలు తక్షణంగా సిబ్బంది కొరతను తీర్చినప్పటికీ, చట్టపరమైన సంక్లిష్టతలను సృష్టించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా సేవా నియమావళి, కేడర్ నిష్పత్తులు, సీనియారిటీ వంటి అంశాలు పూర్తిగా పక్కన పడుతున్నాయి. ఇందులో అత్యంత ఆందోళనకరమైన విషయం మాతృ సంస్థలలో పోస్టుల రద్దు. ఒకసారి పోస్టులను రద్దు చేస్తే, ఆ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్ అవకాశాలు మూసుకుపోతాయి. ఇది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ఉన్న ప్రమోషన్ నిష్పత్తులు, నియమాలు దెబ్బతినడంతో వారి కెరీర్ పురోగతి నిలిచిపోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం ఉద్యోగులపై మాత్రమే కాకుండా, సేవల నాణ్యతపై కూడా పడే అవకాశం ఉంది. ఇక ఉద్యోగ సంఘాల పాత్రను పరిశీలిస్తే, వారు ఈ సంస్కరణకు వ్యతిరేకంగా నిలవడం లేదు. వారి ప్రధాన డిమాండ్ ఒక్కటే న్యాయం జరగాలి, సేవా నియమావళి పాటించాలి. భవిష్యత్తు ప్రమోషన్ అవకాశాలు దెబ్బతినకూడదు. తగిన ప్రమోషన్లు కల్పించి, కేడర్ నిర్మాణాన్ని కాపాడితే, మూడో డిస్కమ్‌కు సేవలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టంగా తెలిపారు. అంటే సమస్య సంస్కరణలో కాదు, దాని అమలులో ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నతాధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగ సంఘాలతో సార్థక చర్చలు జరిపి, వారి ఆందోళనలను పరిష్కరించి, కొత్త పోస్టులకు ప్రభుత్వ అనుమతి తీసుకుని, పారదర్శక విధానంతో ముందుకు వెళ్లాలి. లేకపోతే మూడో డిస్కమ్ ఏర్పాటు అనే మంచి ఉద్దేశ్యం, అమలు లోపాల కారణంగా ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయంగా మారిపోతుంది. సంస్కరణలు విజయవంతం కావాలంటే అవి న్యాయం, నిబంధనలు, విశ్వాసం అనే మూడు సూత్రాలపై నిలవాలి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఈ మూడు సూత్రాలను విస్మరిస్తున్నాయి.

# ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు!

బొల్లిముంతసాంబశివరావు

నేపాల్లో కేపీశర్మ ఓలీ ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి వెడల ప్రజల్లోతీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఓలీ పాలనలో ఉపాధిలేమి, నిరుద్యోగం వల్ల యువతలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఉపాధిలేమితో సతమతమవుతున్న యువతలో తిరుగుబాటు ఆలోచన మొదలైంది. జెన్జెడ్ పేరుతో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ యువత ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించినా ప్రదర్శనలు తీవ్రమైనాయి. ప్రభుత్వం ఉద్యమకారులపై జరిపిన కాల్పుల్లో 19మంది మరణించారు. జెన్జెడ్ ఉద్యమకారులకు దేశమౌలిక సమస్యల వెడల అవగాహనలేదు. యువత ఆందోళన ప్రధాని, మంత్రుల ఇళ్లముట్టడి రూపం తీసుకోవడంతో చివరికి ఓలీప్రభుత్వం రాజీనామా చేసింది. ఆ తర్వాత మార్చి5, 2026లో జరిగిన ఎన్నికల్లో జెన్జెడ్‌మూవెంట్/ప్రొటెస్ట్ పేరుతో ఎన్నికల్లో పాల్గొన్న యువత విజయం సాధించారు. మార్చి 27న బాలేంద్రషా ప్రధానిగా ప్రభుత్వం ఏర్పడింది. బాలేంద్ర షా ప్రభుత్వం ప్రజల మౌలికసమస్యలను ఎలా పరిష్కరిస్తుందో చెప్పలేదు. మౌలికసమస్యల వెడల ప్రభుత్వానికి అవగాహనలేదని అది తెలియచేస్తున్నది. నేపాల్ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు, సాగు భూమి, ఉపాధి, నిరుద్యోగం, పేదరికం. ఈసమస్యలు పరిష్కారం కాకుండా దేశాభివృద్ధి ముందుకుసాగదు. నేపాల్ వ్యవసాయిక దేశం. దేశంలోని 62శాతం కుటుంబాలు, వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. 2021- 22 లెక్కల ప్రకారం దేశ జనాభాలో 77శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయ గణాంకాల ప్రకారం సుమారు 2.89 మిలియన్ల రైతు కుటుంబాలు 12 లక్షల హెక్టార్ల భూమికి సాగునీటి సౌకర్యం పొందారు. సాగు నీరు అందే భూమి చాలాతక్కువ. జలవనరులు అపారంగా ఉన్నా అత్యధిక భూములకు నీటిసౌకర్యం లేకపోవడానికి కారణం ప్రాజెక్టుల నిర్మాణం చేయకపోవడమే. నేపాల్ సగటు కుటుంబ భూమి విస్తీర్ణం 0.54హెక్టార్లు. పెద్ద రైతుల వద్ద5 హెక్టార్ల పైగా ఉంది. అసలు భూమి లేని కుటుంబాల సంఖ్య 12,13,812గా తాజా కమిషన్ నివేదిక డేటా తెలియ చేస్తున్నది. భూకేంద్రీకరణ పెద్దఎత్తున లేకపోయినా, నేపాల్ భౌగోళిక పరిస్థితుల్లో అది ఎక్కువగానే గుర్తించాలి. భూమి వ్యత్యాసాలు సామాజిక, ఆర్థిక అసమానతలకు దారితీసింది. ప్రభుత్వాల భూసంస్కరణల చట్టాలు, ఆచరణలో అమలు జరగలేదు. భూసమస్య నేపాల్ ప్రజల ముఖ్యమైన మౌలిక సమస్యగా నేటికీ ఉంది. ఇది పరిష్కారం కావాలి. నేపాల్ ప్రజలు తీవ్రమైన ఉపాధిలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ సమస్య యువతను వెంటాడుతోంది. 2025-26 సంవత్సరాల్లో నిరుద్యోగరేటు 20శాతం కన్నా ఎక్కువగా ఉంది. దేశ జనాభాలో79శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. వీరిలో నిరుద్యోగం 24.66శాతంగాఉంది. దేశంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల ప్రతిరోజు వేలాది మంది యువత గల్ఫ్ దేశాలకు, మలేసియా, భారతదేశాలకు వలసలుపోతున్నారు. నేపాల్ ఆర్థికవ్యవస్థకు వలస ప్రజలు పంపే డబ్బులు, ఆ దేశ జీడీపీలో 1/3ఉందంటే వలసల తీవ్రత తెలుపుతున్నది. వలసవెళ్లిన వారు అనధికార లేదా అసంఘటిత



రంగంలో పనిచేస్తూ శ్రమదోపిడీకి గురౌతున్నారు. విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య సమన్వయం లేకపోవడం వల్ల చాలామంది పట్టభద్రులు ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత నిరాశ, నిస్పృహలోజీవిస్తున్నారు. నేపాల్లో పేద, ధనిక వ్యత్యాసాలు తీవ్రంగా ఉన్నాయి. దేశజనాభాలో 10శాతంగా ఉన్న ధనిక కుటుంబాలు జాతీయసంపదలో 39.1శాతం సంపద కలిగి ఉంటే, దిగువ అత్యల్పంగాఉన్న 10శాతం ప్రజలవద్ద 2.6సంపద మాత్రమే ఉంది. ఇది ఆ దేశంలో ఆర్థికవ్యత్యాసాలకు అద్దంపడుతున్నది. పేదరిక తీవ్రతను తెలియచేస్తున్నది. ఈదేశంలో అపారంగా సహజవనరులు న్నాయి. ఇనుప ఖనిజం, రాగి, జింక్, కోబాల్టురియు బంగారం లాంటి లోహాలున్నాయి. ఇవికాకుండా సున్నపురాయి, మాగ్నసైట్, మార్బుల్, గార్నెట్మరియులూర్మాలిన్, క్వార్ట్జ్ మొదలైన రత్నాల నిల్వలున్నాయి. వీటిని దేశప్రయోజనాలకు ఉపయోగించే విధానాలు అమలు జరపడంలో దేశ పాలకులు విఫలం అయ్యారు. అంతేకాకుండా ఖనిజసంపద మైనింగ్ రంగాన్ని ప్రైవేటీకరించడం అనేది ఆ దేశ ఆర్థిక సంస్కరణల్లో అనేక మార్పులు తెచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికసరళీకరణ విధానాల్లో భాగంగా, నేపాల్లో కూడా పాలకులు ఆ విధానాలు అమలు జరిపారు. 1990ల నుండి ప్రభుత్వరంగ సంస్థలను, ప్రైవేట్ రంగానికి అప్పగించడం ప్రారంభం అయింది. నేపాల్లోని అన్ని ఖనిజవనరులు ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉన్నా, ప్రైవేట్ కంపెనీలకు ఖనిజాలను వెలికితీసే హక్కును (లైసెన్సు) ప్రభుత్వాలు కల్పించాయి. అందుకోసం మైనింగ్ నియంత్రణ 1985నాటి గనుల చట్టం1999నాటి గనుల, ఖనిజాల నియమాల ద్వారా జరుగుతున్నది. ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేటీకరణ ప్రక్రియ చేపట్టింది. 2025-26 సంవత్సరం నాటికి సుమారు 40 ట్రిలియన్ నేపాలీ రూపాయల విలువైన రాయి, ఇతర ఖనిజ నిక్షేపాలు దేశం కలిగి ఉంది. నేపాల్ ఆర్థికవ్యవస్థలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల, విదేశీ కంపెనీల ప్రభావం పెరుగుతూ ఉంది. విదేశీపెట్టుబడుల్లో 59.7శాతం పారిశ్రామికరంగంలో ఉంటే, 30శాతం జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో, 29.4శాతం తయారీ రంగంలో ఉన్నాయి. నేపాల్లో 58దేశాలు పెట్టుబడులు పెడుతున్నాయి. ముఖ్యంగా భారతదేశం, చైనా, యూరప్ దేశాలనుంచి పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. పెట్టుబడులకోసం నేపాల్ పాలకులు 100శాతం విదేశీ యాజమాన్యానికి అనుమతి ఇస్తున్నారు. వచ్చే లాభాలను ఎటువంటి ట్యాక్సులు లేకుండా వారి స్వదేశాలకు తరలించుకుపోయే అవకాశం కల్పించింది. ఆవిధంగా నేపాల్ పాలకులు విదేశీ పెట్టుబడి దారుల ప్రయోజనాలను కాపాడుతూ వస్తున్నారు. ఫలితంగా విదేశీపెట్టుబడిదారుల ఆధిపత్యం నేపాల్లో కొనసాగుతూ ఉంది. డెన్మార్క్, యూరోపియన్యూనియన్, చైనా వంటి దేశాల బహుళజాతి సంస్థలు నేపాల్ సహజవనరుల పట్ల దశాబ్దాలుగా కన్నువేశాయి. అనేక అంతర్జాతీయబ్రాండ్లు నేపాల్లో పనిచేస్తున్నాయి. వీటి స్థానిక విభాగాలను నేపాల్ వ్యాపారవేత్తలు లేదా మేనేజింగ్ డైరెక్టర్లు నిర్వహిస్తారు. ఈ సంస్థలు నేపాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలు తరలించుకుపోతున్నాయి. అవినీతి రూపుమాపడం గురించి మాత్రమే మాట్లాడుతూ, ఆ అవినీతిలోనే బాలేంద్రషాప్రభుత్వం కూరుకుపోతున్నది. అవినీతి ఆరోపణలతో పోలీసుతోసహా ఇద్దరు మంత్రులు పదవుల నుంచి వైదొలిగారు. ప్రజాసమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసింది. నెలాపదిరోజుల్లోనే ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏర్పడింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి. ప్రజాసమస్యలు పట్టని బాలేంద్రషా ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులపైకేసులు బనాయిస్తున్నది. సోషలిస్టు ఆర్థికవిధానాలు, వర్గదృక్పథం లేని ఏ ఉద్యమం, ఏప్రభుత్వం వల్ల ఏ దేశంలో కూడా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు.

## పట్టణ పరిధిలో మురుగునీటి పారుదలకు ఆటంకం లేకుండా

# డ్రైయిన్ల నిర్మాణం

## మంత్రి మనోహర్

**తెనాలి మున్సిపాలిటీ మే10(ప్రభాతవార్త):** రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ,పట్టణ పరిధిలో మురుగునీటిపారుదలకు ఆటంకాలు లేకుండా డ్రెయిన్‌ల నిర్మాణాలు వేగవంతం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం తెనాలి ఆర్టిసి బస్ స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బస్ స్టేషన్‌లో జరుగుతున్న ప్లాట్‌ఫారం అభివృద్ధి పనులను ఆదివారం సాయంత్రం పరిశీలించి, అనంతరం బస్ స్టేషన్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించి, ప్రయాణికులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి



చేశామని, స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని చినరావూరు డొంక ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డునిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. 40 లక్షల రూపాయలతో డొంక రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు అదేవిధంగా రానున్న వర్షాకాలంలో పట్టణంలోని ప్రధాన డ్రైన్ల నుండి వచ్చే మురుగునీరు పారుదలకు ఆటంకం తెలుసుకున్నారు. అలాగే పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమై పరిశుభ్రత నిర్వహణ, సౌకర్యాల మెరుగుదలపై సూచనలు చేశారు. ప్రయాణికులకు మరింత మెరుగైన వసతులు కల్పించే దిశగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయా లని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, ఆర్టిసి డిపో మేనేజర్ రాజశేఖర్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## అమ్మ లేని ఇల్లు ఎలా ఉంటుందో

## శానిటరీ వర్కర్లు లేని వీధి కూడా అలానే ఉంటుంది

### ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు, మే10,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికుల కోసం వికాస్ హాస్పిటల్, శ్రీ భ్రమర ట్రస్ట్ సౌజన్యంతో గుంటూరులోని పోలీస్ కళ్యాణ మండపంలో ఆదివారం మెగా మెడికల్ క్యాంప్, ఉత్తమ పారిశుధ్య కార్మికుల సన్మానం, చీరల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని మొత్తం 720 మంది



మహిళా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరికీ చీరలను బహుమతిగా అందజేశారు. వివిధ డివిజన్లలో ఉత్తమ సేవలు అందిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను ప్రత్యేకంగా సన్మానించారు. వేదిక పై ముఖ్య అతిథులతో పాటు ఉత్తమ పారిశుధ్య కార్మికురాళ్ళను కూర్చోబెట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ సమాజ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమని, "గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమైన స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని కార్యరూపంలో తీసుకువెళ్తున్న నిజమైన సైనికులు శానిటరీ వర్కర్లే" అని పేర్కొన్నారు. అమ్మ లేని ఇల్లు ఎలా అస్తవ్యస్తంగా ఉంటుందో, శానిటరీ వర్కర్లు లేని వీధి కూడా అలాగే ఉంటుంది. ఇంట్లో అమ్మ ఎంత ముఖ్యమో సమాజంలో పారిశుధ్య కార్మికులు అంతే ముఖ్యమైన వారు అని ఎమ్మెల్యే భావోద్వేగంగా పేర్కొన్నారు. మహిళలు ప్రపంచం లోని ప్రతి విషయంపై శ్రద్ధ పెడతారని, కానీ తమ ఆరోగ్యం విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తారని పేర్కొంటూ, మహిళా పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగానే ఈ మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వికాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో వ్యాస్కులర్ సర్జరీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, నెఫ్రాలజీ, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాలకు చెందిన ఆరుగురు నిపుణులైన వైద్యులు పాల్గొని మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా వికాస్ హాస్పిటల్స్ ఎండీ గళ్ళ రామచంద్రరావు, సీఈఓలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా కార్మికులకు చీరలు, అల్పాహారం ఏర్పాటు చేసిన శ్రీ భ్రమర ట్రస్ట్‌కు కూడా ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మాతృదినోత్సవం సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికుల కోసం ఇంత పెద్ద స్థాయిలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ మహిళా కార్మికులను గౌరవిస్తూ మెడికల్ క్యాంప్, చీరల పంపిణీ నిర్వహించడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు సేవా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముందుంటున్నారని అభినందించారు. కనపర్తి శ్రీనివాసరావు, తాళ్ళ వెంకటేష్ యాదవ్, సింహాద్రి కనకాచారి మాట్లాడుతూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రశంసించారు. మహిళా పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి ఘనంగా సన్మానించడం అభినందనీయున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రజల కోసం పనిచేస్తున్న మమ్మల్ని గుర్తించి ప్రత్యేకంగా మాతృదినోత్సవ వేడుక నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. మా ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం, చీరలు అందించడం, సన్మానం చేయడం ఎప్పటికీ మర్చిపోలేం. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా భావించి గౌరవించడం ఎంతో సంతోషంగా ఉంది" అని భావోద్వేగంగా తెలిపారు. తమ కోసం టాయిలెట్ లు నిర్మించాలని కార్మికులు కోరడంతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తితో తాను 2లక్షలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా అందజేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలలు కంటున్న పేదరికం లేని సమాజం కోసం దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద మహిళలను సత్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, మే 10,ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 26 డివిజన్లకు చెందిన పేద మహిళలను ఆహ్వానించి ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా



మాధవి చేతుల మీదుగా చిరు సత్కారం చేసి నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళలు, వృద్ధులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారి సాధక బాధకాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు, జీవన ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. మహిళలు సమాజానికి అండగా నిలిచే మహోన్నత శక్తులని, తల్లుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. పేద మహిళలకు అండగా ఉండటం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలంటే మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## ప్రజా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

### నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు కార్పొరేషన్, మే 10, ప్రభాతవార్త :** నగరంలో సమస్యలపై సత్వరం పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ నెల 11 వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

## ఉల్లాస్..వయోజనుల అక్షరాస్యతే లక్ష్యం.!

**గుంటూరు,మే 10,ప్రభాతవార్త ప్రతినిధి :**

ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం క్రింద వయోజనుల అక్షరాస్యత వంద శాతం సాధించడమే లక్ష్యమని గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఏడాది లక్ష్యం 77,501 అని కలెక్టర్ తెలిపారు. 2026 27 సంవత్సరంలో ఉల్లాస్ అక్షర ఆంధ్రా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని అన్నారు. 2029 నాటికి వయోజనులను శత శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వంద గంటల పాఠ్య ప్రణాళిక నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఇందులో ఆడియో విజువల్ కంటెంట్, తరగతి గదులు, ప్రాక్టీస్ చేయించడం జరుగుతుందన్నారు. తరగతులను సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతిరోజు స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎప్పటిలాగానే ప్రాథమిక పాఠ్యాంశాలు, సాధన పత్రాలు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి ఇంట అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. 2027 మార్చిలో గ్రామ స్థాయిలో అసెస్మెంట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ ఏడాది జూలై 21 నుండి వచ్చే ఏడాది మార్చి 15వ తేదీ వరకు తరగతుల నిర్వహణ ఉంటుందని తెలిపారు. గత ఏడాది జిల్లాలో అక్షర ఆంధ్రా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని అన్నారు.

**పి.జి.ఆర్.ఎస్‌కు టోల్ ఫ్రీ నంబర్ 1100**



ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల పరిస్థితిని టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ దరఖాస్తులను పి.జి.ఆర్.ఎస్ తో పాటు మీకోసం వెబ్ సైట్‌లో ఆన్ లైన్ లోను సమర్పించవచ్చని తెలిపారు.

# ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా

### మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, మే10,(ప్రభాతవార్త):** రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భీమా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనుందని తెనాలి శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నందు 13 మంది అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రు. 11,84,711ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తెనాలి నియోజకవర్గంలో ఇప్పటివరకు 537 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 5.53 కోట్ల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని, ఆర్థికంగా వెనుకబడి వైద్య చికిత్స చేయించుకోలేని అనారోగ్య బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉండి ,ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరోగ్య భద్రత కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో ఎవ్వరు అనారోగ్యంతో బాధపడకుండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో, ప్రత్యేక చొరవతో జాప్యం లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ ను లబ్ధిదారులకు అందిస్తూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ కు ప్రాధాన్యతనిస్తూ, అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు.

# మామిళ్ళపల్లిలో ఉద్రిక్తత

### -భారీగా పోలీసుల మోహరింపు -మొక్కజొన్నలు నిల్వ ఉంచిన గోదాముకు సీజ్

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకొన్నాయి. ఈ నెల 5వ తేదీన మామిళ్ళపల్లి గ్రామంలో అక్రమంగా మొక్కజొన్నలను నిల్వ ఉంచారంటూ వచ్చిన సమాచారం మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు మామిళ్ళపల్లి



వెళ్ళి మొక్కజొన్నల గోదాము వద్ద భారీ ఎత్తున ధర్నా చేశారు. గోదామును సీజ్ చేయాలని తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ గోదాములోని మొక్కజొన్నలు వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు చెందినవని టిడిపి వారు ఆరోపణ, గోదాములోని మొక్కజొన్నలతో తనకు ఎలాంటి సంబంధం లేదని మురళీకృష్ణ చెప్పడం...గోదాములో ఉన్న మొక్కజొన్నలు మావేనని పలువురు రైతులు ముందుకు వచ్చి ఆందోళన చేయడం వంటి సంఘటనలు జరిగాయి. ఏది ఏమైనా ఐదో తేదీ నుంచి రోజులు గడుస్తున్నా...గోదామును ఏ శాఖాధికారులు సీజ్ చేయాలనే మీమాంసతో ఇప్పటి వరకు తాత్సరం చేస్తూ వచ్చారు. ఇరు పార్టీలకు చెందిన వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో పొన్నూరు రూరల్ పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ నెల 13వ తేదీన ఛలో మామిళ్ళపల్లికి పిలుపునిచ్చారు. దీంతో మామిళ్ళపల్లిలో వాతావరణం వేడెక్కింది. గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశాలుండడంతో అధికారులు ఆదివారం గోదామును సీజ్ చేసేందుకు పోలీసులతో గ్రామానికి వెళ్ళారు. అయితే గోదాములో మొక్కజొన్నలు నిల్వ చేసుకున్న



రైతులు పోలీసులను అడ్డగించడం..తహాశీల్దార్ కారుకు అడ్డుపడడం వంటి సంఘటనలు జరిగాయి. పలువురు మహిళా రైతులు శాపనార్థాలు కూడా పెట్టారు. పొన్నూరు అర్బన్, రూరల్ సిఐలు లావూరి వీరానాయక్, కృష్ణయ్య ఎస్సైలు వాగాల శ్రీహరి పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎట్టకేలకు తహాశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ గోదామును సీజ్ చేసి, అందులోని సరుకును మార్కెటుయార్డు అధికారులకు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ మామిళ్లపల్లి గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఆరోపణలు ఎదుర్కొంటున్న గోదామును సీజ్ చేశామని, గోదాము ప్రొప్రైటర్ త్రివేణికి నోటీసులు అందించామన్నారు. గోదాములో ఉన్న సరుకుకు సంబంధించిన ఆధారాలు చూపిస్తే సంబంధిత రైతులకు అందజేస్తామని, ఆధారాలు చూపని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకొంటామన్నారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే మాత్రం చూస్తూ ఊరుకోమని తహాశీల్దార్ హెచ్చరించారు.

## శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి గ్రామోత్సవం

**తెనాలి,మే10,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం వైకుంఠపురంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు శ్రీస్వామివారికి,నిత్య హోమార్చన, అనంతరం గ్రామోత్సవం నిర్వహించటం జరిగిందని, ఆలయ కార్యనిర్వహణాధికారి వి. అనుపమ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఆదివారం శ్రీస్వామి వారికి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. మే 6వ తేదీ బుధవారం నుండి 12వ తేదీ వరకు,వారం రోజులపాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు, తెనాలి పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుండి సుమారుగా పదివేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆమేరకు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అళహరి రవికుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా,భక్తులకు అన్న ప్రసాద వితరణ మరియు లడ్డు ప్రసాదం భక్తులకు అందుబాటులో ఉంచామని, అంతేకాకుండా,వాలంటీర్ల సేవలను వినియోగించుకుంటూ, భక్తుల దర్శనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా క్యూలైన్ల ద్వారా దర్శనం చేసుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా



నిర్వహించే శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను, ఆలయ అర్చకులు, సేవకులు, భక్తులతో కలిసి సమన్వయం చేసుకుంటూ,ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దయచేసి భక్తులు కూడా సహకరించి శ్రీ స్వామివారి కళ్యాణం, బ్రహ్మోత్సవాలను తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని, ఆలయ కార్యనిర్వహణాధికారి వి. అనుపమ భక్తులకు సూచించారు.

## జడ్‌పిటిసి సుబ్బయ్యపై చేసిన ఆరోపణలు అవాస్తవం

**నిజాంపట్నం, మే 10, ప్రభాతవార్త:** తెదెపా నాయకుడు జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్యపై తాను చేసిన ఆరోపణలలో అవాస్తవమని ప్రకృతి వ్యవసాయం మండల కో ఆర్డినేటర్ వై ఎస్ కుమారి తెలిపారు. ఈ విషయమై ఆమె సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి చుక్కా విజయరాజుతో గత సంవత్సర కాలంగా కలిసి ఉంటున్నానని, ఇటీవల తమ మధ్య విభేదాలు తలెత్తాయని ఆమె తెలిపారు. రాజకీయ నాయకుల సహకారంతో మండల వ్యవసాయ అధికారి చుక్కా విజయరాజు తనకు ఇబ్బందులు కలిగిస్తారేమోనని భయపడి తాను జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్యపై ఆరోపణలు చేశానన్నారు. జడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య తనను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయలేదని ఆమె తెలియజేశారు. తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

## నేడు గ్రీవెన్స్‌లో ప్రజాసమస్యల పై అర్జీలను స్వీకరించనున్న మంత్రి నాదెండ్ల

**తెనాలి మున్సిపాలిటీ, మే10,(ప్రభాతవార్త):** రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) గ్రీవెన్స్ కార్యక్రమంలో,



సోమవారం పురపాలకసంఘ కార్యాలయంనందు స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వయంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు, మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుండి నేరుగా వినతి పత్రాలను స్వీకరించి వెంటనే సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గ ప్రజలు, తమ సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేస్తూ, తమ ఆధార్ కార్డు ప్రతిని జోడించి,నేరుగా సమర్పించాలని, పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ప్రజాసమస్యలను నేరుగా ప్రజల వద్ద నుండే తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వ పరంగా ప్రత్యేకంగా అధికారులను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా, స్థానిక శాసనసభ్యులు, మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్న నిర్ణయం పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారతీయ సాంస్కృతిక వైభవ చిహ్నం ఆంధ్ర నాట్యం

### -రెక్టార్ శివరాం ప్రసాద్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మే10,ప్రభాతవార్త: భారతీయ సాంస్కృతిక వైభవాన్ని అత్యద్భుతంగ ఆవిష్కరించే నాట్యరీతఉల్లో ఆంధ్ర నాట్యం ఒకటని ఏఎన్‌యు రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అన్నారు. శ్రీ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పంచశత ఆంధ్రనాట్య




సంగమం పేరుతో 500మంది ఆంధ్ర నాట్య కళాకారులు చేసిన నృత్యాంశాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదైన సందర్భంగా పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం ఏఎన్‌యు వేదికగా ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రెక్టార్ పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో అనేక నాట్యరీతులు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తున్నాయన్నారు. అందులోనూ తెలుగు వారి నాట్యానికి మరింత ప్రాముఖ్యతను తీసుకొచ్చే దిశగా పంచశత ఆంధ్ర నాట్య సంగమం తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదుకావడం ఆనందంగా ఉందన్నారు. వర్సిటీ సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించే దిశగా పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర నాట్యానికి ప్రాచుర్యాన్ని కల్పించేందుకు ప్రఖ్యాత నాట్యాచార్యులు అభినవ సత్యభామ కళాకృష్ణ, కళారత్న పిళ్లా ఉమామహేశ్వరపాత్రుడు వంటి వారు అద్భుతమైన సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రఖ్యాత నాట్య కళాకారులు కళాకృష్ణ మాట్లాడుతూ మరుగున పడిన ఆంధ్రనాట్యానికి పునరుజ్జీవంకు డాక్టర్ నటరాజ రామకృష్ణ పాటుపడ్డారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ పోతిన మహేష్ మాట్లాడుతూ కళల వికాసానికి పిళ్ళా ఉమామహేశ్వరపాత్రుడు అపూర్వసేవలు అందిస్తున్నారని కొనియాడారు. కళారత్న పిళ్ళా ఉమామహేశ్వరపాత్రుడు మాట్లాడుతూ 500మంది కళాకారులు అనేక ప్రాంతాల నుంచి వచ్చిపంచశత ఆంధ్రనాట్య సంగమంలో భాగస్వాములయ్యారని వివరించారు. అందరి సహకారంతో ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. దానికి గుర్తుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్ట్స్‌లో నమోదుకావడం సంతోషంగా ఉందన్నారు. సుమధుర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కరశర్మ, మాజీ కార్పోరేటర్ మరుపిళ్ళ రాజేష్ తదితరులు ప్రసంగించారు.

## తన విధులకు ఆటంకం కలిగిస్తున్న వివాహిత

### మండల వ్యవసాయశాఖ అధికారి చుక్కా విజయరాజు

**నిజాంపట్నం, మే 10, ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయ మండల కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న వివాహిత తన విధులకు ఆటంకం కలిగిస్తున్నదని మండల వ్యవసాయశాఖ అధికారి చుక్కా విజయరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తన భర్త వాయిస్‌లా ఉందని ఆమె తనతో పరిచయం పెంచుకుందన్నారు. కుటుంబానికి అవసరమని తన వద్ద ఉన్న నగలు, డబ్బులు తీసుకుందని, వాటిని తిరిగి ఇవ్వమన్నందుకు తనను వివాహం చేసుకోవాలని తన విధులకు ఆటంకం కలిగిస్తున్నదన్నారు. తన బంధువులతో దిగిన ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తనను బెదిరిస్తున్నదని ఆయన తెలియజేశారు. తనను బెదిరిస్తున్నదనే విషయమై రేపల్లె, చందోలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

MN 6 PAGE-GNT:MN 6 PAGE-GNT 01/01/2001 09:21 Page 1



# హనుమజ్జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

-భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి
-భక్తులు కూడా క్యూ పద్ధతిలో స్వామివారిని దర్శించుకోవాలి
-త్రాగునీరు, తదితర ఏర్పాట్లు పూర్తి
-వివరాలు వెల్లడించిన కార్యనిర్వహణాధికారి,ఛైర్మన్ గుప్తా

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వీరాంజనేయస్వామివారికి హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు అందుకు తగ్గట్లుగా ఏర్పాటుల పూర్తి చేసినట్లు



కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జిఎంఎస్ గుప్తా తెలిపారు. స్థానిక దేవాలయం కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ గుప్తా మాట్లాడుతూ ఈ నెల 11,12,13తేదీలలో స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 11వ తేదీన ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనము, అలంకారములు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12గంటలకు లక్ష తమలపాకుల పూజ నివేదన, సాయంత్రం 6గంటలకు ఉష్ట్రవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతాయన్నారు. 12వ తేదీన వేకువజామున 4గంటలకు స్వామివారి మూల విరాట్‌కు అభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12గంటలకు లక్ష తమలపాకుల పూజ, రాత్రి 7గంటలకు శ్రీ సువర్చలా సమేత శ్రీ వీరాంజనేయస్వామివారికి దివ్య తిరుకళ్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు.13వ తేదీ సాయంత్రం 5గంటలకు దివ్య రథోత్సవం జరుగుతాయన్నారు. కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దేవాలయాన్ని కనువిందు చేసేవిధంగా, కన్నులు మిరుమిట్లు గొలిపేవిధంగా విద్యుద్దీకరణ చేశామన్నారు. భక్తులకు త్రాగునీరు, దేవాలయం, దాతల సహకారంతో చలివేంద్రాలు, ప్రసాదాల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు కూడా క్యూ పద్ధతిలో స్వామివారిని దర్శించుకొని తరించాలని కోరారు. ఈసారి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 11వ తేదీన సాయంత్రం విజయవాడ, తెనాలి వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. గ్రామోత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు.12వ తేదీన హనుమత్ వైభవం అనే అంశంపై ప్రవచనం, తెనాలి, విజయవాడ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, స్వర్ణపురి పట్టణ పుర ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి మొక్కులు తీర్చుకొని ఆశీస్సులు అందుకోవాలని వారు కోరారు.

# ఏటుకూరులో ప్రారంభమైన హనుమాన్ జయంతి వేడుకలు

**వట్టిచెరుకూరు, మే 10, ప్రభాతవార్త :** గుంటూరు రూరల్ మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహించే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు



మాట్లాడుతూ..ఆదివారం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ జయంతి వేడుకల్లో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఏడాది హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ వేడుకలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి వీరాంజనేయ భక్తి బృందంచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించబడుతుందన్నారు. అలానే ప్రతిరోజు కోలాటం, కర్రసాము, చెక్కభజన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.12వ తేదీ మంగళవారం రాత్రి ఏడు గంటలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని తెలిపారు. పూజా కార్యక్రమాలు అర్చకులు సుధీర్ శర్మ, దీపక్ శర్మలచే నిర్వహించబడతాయని చెప్పారు. కార్యక్రమంలో చాసరి బాబు, అములోతు మస్తానావు ఉప్పు వెంకటరత్తయ్య, అములోతు అంకమ్మరావు, ఉగ్గిరాల అంకమ్మరావు, జిడుగు నాగేశ్వరరావు, తన్నీరు క్రిష్ణ, దాసరి వాసు, తోట లక్షణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంగళగిరి రోటరీ క్లబ్ నూతన ప్రెసిడెంట్‌గా నిరంజన్ గుప్తా

**మంగళగిరి, మే 10, ప్రభాతవార్త:** మంగళగిరి రోటరీ క్లబ్ 20262027 సంవత్సరానికిగాను నూతన కార్యవర్గ పరిచయ సమావేశం ఆదివారం లిటిల్ విలేజ్ లో జరిగింది. మంగళగిరి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రెగడ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నె రత్నప్రభాకర్, మంగళగిరి రోటరీ క్లబ్ ఎలెక్ట్ ప్రెసిడెంట్, ప్రస్తుత సెక్రటరీ పారేపల్లి నిరంజన్ గుప్తా, అసిస్టెంట్ గవర్నర్ ఎలెక్ట్ గాజుల శ్రీనివాసరావు, చార్టర్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీ హిల్స్ పాస్ట్ ప్రెసిడెంట్ శేషసాయిశంకర్, రొటేరియన్లు పాల్గొన్నారు. మంగళగిరి రోటరీ క్లబ్ నూతన ప్రెసిడెంట్ గా పారేపల్లి నిరంజన్ గుప్తా, సెక్రటరీగా వడ్లమూడి శ్రీనివాసరావు, ట్రెజరర్ గా చనుమోలు గోపాల్, ఇతర డైరెక్టర్లు, చైరపర్సన్ లను పరిచయం చేశారు. నూతన కార్యవర్గం జూలై ఒకటో తేదీ నుంచి వచ్చేయేడాది జూన్ 30 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ అనతికాలంలోనే రోటరీ డిస్ట్రిక్ట్ 3150లో ప్రత్యేక గుర్తింపును పొందిందని ప్రశంసించారు. ఇదే ఒరవడిని నూతన కార్యవర్గ ప్రతినిధులు కొనసాగిస్తూ మరిన్ని సామాజికపరమైన



సర్వీసు ప్రాజెక్టులను చేపట్టి మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని వారు ఆకాంక్షించారు. సమావేశంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ కేవీఎస్ ప్రకాశరావు, రొటేరియన్లు అందె మురళీమోహన్, జొన్నాదుల బిక్షారావు, కె.శివరామరాజు, బట్టు వెంకటేశ్వరరావు, రావెల శ్రీనివాసరావు, ఉడతా శ్రీనివాసరావు, నేరెళ్ల బాలాజీ, గోలి శ్రీకాంత్, నూతలపాటి వెంకటేశ్వరరావు, జవ్వాది కిరణ్ చంద్, మునగాల విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సంక్షోభం పై చలనచిత్రం

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** దేశంలో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. మరీ ముఖ్యంగా గత మూడేళ్ళుగా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రంగాలు తీవ్రమైన సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో దాదాపు 90శాతం జనాభా తమ జీవనోపాధి కోసం వ్యవసాయంపై ఆధారపడి ఉండేవారు. నేడు ఆ సంఖ్య దాదాపు 60శాతానికి పడిపోయింది. యువతరం వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించడానికి విముఖత చూపుతోంది. ఈ మార్పుకు గల ప్రధాన కారణాలలో ఒకటి రైతు ఎంత కష్టపడినా వారికి తగిన ప్రతిఫలం దక్కడం లేదు.ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి ఆర్థిక సహాయం అందుతున్నప్పటికీ, నిరంతరం ప్రతికూల పరిస్థితుల కారణంగా చాలా మంది రైతులు వ్యవసాయంపై నమ్మకాన్ని కోల్పోతున్నారు. తుఫానులు, వరదలు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల, ధరల్లో హెచ్చుతగ్గులు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యవసాయాంత్రీకరణ ప్రభావం, పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాలు అన్నీ రైతుల ఆర్థిక అస్థిరతకు కారణాలుగా నిలుస్తున్నాయి. రైతుల ఆర్థిక ఇబ్బందులు, వ్యవసాయాధిరిత పరిశ్రమలపై కూడా ప్రభావం చూపి, సంబంధిత రంగాలలో వ్యాపార మందగమనానికి, ఆర్థిక సంక్షోభానికి దారితీస్తున్నాయి. ఈ



సవాళ్ళ పర్యవసానంగా, విస్తృత భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. రైతుల సాదకబాధలను దగ్గర నుంచి చూసిన తేజు ఫిల్మ్స్ కార్యవర్గం ఒక చలన చిత్రాన్ని రూపొందించేందుకు శ్రీకారం చుట్టింది.అందులో భాగంగా వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులను తేజు ఫిల్మ్స్ ద్వారా షూట్ చేస్తోంది. ఈ చిత్రానికి కథ, దర్శకత్వం తానిపర్తి సుధాకరరెడ్డి, ప్రొడ్యూసర్‌గా సంతోష్‌రావు బాల్లురి, కెమెరా,ఎడిటర్ దాసరి రవికుమార్, సహనిర్మాత రాజశేఖరరెడ్డి శ్రమిస్తున్నారు.

# నేటి నుంచి 83వ జయంతి బ్రహ్మోత్సవాలు

-హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ



**పొన్నూరు, మే 10, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నందూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామివారి 83వ జయంతి కళ్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాసశర్మ తెలిపారు. 11వ తేదీన ఉదయం విఘ్నేశ్వరపూ, పుణ్యాహవాచనము, దీక్షాధారణ, ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు నిత్యవిధితోపాటు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శ్రీ లలితా,విష్ణు సహస్రనామ పారాయణలు జరుగుతాయన్నారు. 12వ తేదీ హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6.30గంటలకు నిత్య అనుష్టానములు, అభిషేకాలు, విశేషార్చనలు జరుగుతాయన్నారు. రాత్రికి ఎదురుకోలోత్సవం, కళ్యాణోత్సవం జరుగుతాయన్నారు. 13వ తేదీన ఉదయం 5గంటలకు 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రి 6గంటలకు కళ్యాణ మూర్తులకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి నిత్యం సాయంత్రం 7 గంటలకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగు తాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని వల్లూరు శ్రీనివాసశర్మ కోరారు.

# పాత గంజాయి నేరస్తులకు రాపిడ్ టెస్టులు

## గంజాయి రహిత తెనాలికి కృషి : డిఎస్పీ జనార్ధనరావు

**తెనాలి,మే10,(ప్రభాతవార్త):** "గంజాయి రహిత తెనాలి" లక్ష్యంగా, పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెనాలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని,రౌడీషీటర్లు, పాత నేరస్తులు గతంలో గంజాయి



కేసులో పట్టుబడిన వారికి ఆదివారం, తెనాలి పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయము వద్ద కౌన్సిలింగ్ నిర్వహించారు. డి.ఎస్.పి జనార్ధన రావు ఆధ్వర్యంలో పాత నేరస్తులందరికీ రాపిడ్ టెస్టులు చేశారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి వచ్చిన ప్రత్యేక పరికరాల ద్వారా ఈ టెస్ట్ లు నిర్వహించారు. వీటి ద్వారా గత 24 గంటల లోపల నేరస్తులు ఎటువంటి గంజాయి మత్తు పదార్థాలు సేవించిన వారి రక్తం మరియు మూత్రం పరీక్షల ద్వారా గంజాయి సేవించారా లేదా అనేది తెలుస్తుందని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని 150 మంది అనుమానితులకు రాపిడ్ టెస్ట్ లు నిర్వహించగా,వీరిలో 18 మందికి పాజిటివ్ గా నమోదు అయిందని వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, అనుమానితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని డిఎస్పి తెలిపారు. అనంతరం డిఎస్పి బి.జనార్ధనరావు మాట్లాడుతూ,గంజాయి మాదకద్రవ్యాలు అదుపు చేయటానికి,స్థానిక శాసనసభ్యులు,రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ పోలీసులకు పూర్తి



స్వేచ్ఛనిచ్చారని,అదేవిధంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, సంకల్పం కార్యక్రమంలో భాగంగా, మాదకద్రవ్యాల రహిత తెనాలి ని తీర్చిదిద్దటానికి పోలీసులకు మీరంతా కలిసి రావాలని, మాదకద్రవ్యాలు,గంజాయి ఉచ్చులో పడి మీ జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దని,అంతేకాకుండా సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం కోల్పోతారని, ఆర్థికంగా ఆరోగ్యపరంగా జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని అలాంటి పరిస్థితులు తెచ్చుకోకుండా, యువత గంజాయి,మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలని డిఎస్పి సూచించారు.నేడు నిర్వహించిన రాపిడ్ టెస్ట్ లో పాజిటివ్ తేలిన 18 మంది అనుమానితులకు,ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వటం జరుగుతుందని వారిలో మార్పు వచ్చేంతవరకు వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వారితో పాటు వారి చుట్టుపక్కల ఉండే స్నేహితులు ఇంకా ఎవరైనా గంజాయి సేవించేవారు ఉన్నా వారిని కూడా కౌన్సిలింగ్ ద్వారా మార్చుతామని ఆయన తెలిపారు.అనంతరం వారితో గంజాయి, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా "గంజాయి వద్దు బ్రో‌ఫ్యామిలీ ముద్దు బ్రో"అనే నినాదంతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. తదుపరి గంజాయి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తెనాలి పోలీస్ సబ్ డివిజనల్ పరిధిలోని పలువురు సిఐలు,ఎస్సైలు పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సందేశాత్మకంగా నాటికల పోటీలు

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా ప్రాంగణంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులకు గొప్ప సందేశాన్ని అందిస్తున్నాయి. కళాపరిషత్ రజతోత్సవ వేడుకల సందర్భంగా ఈసారి నాటికల పోటీలు కనీవినీ ఎరుగని రీతిలో సాగాయి. నాటికల పోటీల మధ్యలో భరతనాట్యాలు, కూచిపూడి నృత్యప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు ఆహుతులను విశేషంగా



ఆకట్టుకున్నాయి. ఆదివారం హైదరాబాదువారి గోవాడ క్రియేషన్స్ ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతోపాటు సమాజానికి చక్కటి సందేశాన్నందించింది. సృష్టిలో ఉత్తమమైనది మానవ జన్మ. ఈ మానవజన్మలో స్త్రీ, పురుషుల గురించే మనం మట్లాడుకుంటూ ఉంటాం. కానీ పురాణకాలం నుండి నేటి వరకూ, ఆదిమానవ యుగం నుండి ఇప్పటి వరకూ స్త్రీ, పురుషులే కాకుండా మానవజాతిలో దాదాపు 20రకాల శరీరతత్వాలు కలిగిన మనుషులు ఉన్నారని ఎంత మందికి తెలుసు? వాళ్ళు స్త్రీలను, పురుషులను మాత్రమే గౌరవించే ఈ బూటకపు నాగరికతలో ఎలా మనగలుగుతున్నారు..? అలాంటి వాళ్ళకు ఎలాంటి గుర్తింపు, గౌరవం ఉంది..? అసలు ఈ ఆలోచన మనకు ఎప్పుడైనా కలిగిందా..? అనే ప్రశ్నలతో సాగిన ఈ నాటిక ఆలోచనలను రేకెత్తించింది. అనంతరం ప్రత్యేక ప్రదర్శనగా ఫోటో నాటిక ప్రదర్శింపబడింది. కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# నవులూరులో ఉచిత మంచినీటి టాంకర్స్ ప్రారంభం

**మంగళగిరి, మే 10, ప్రభాతవార్త:** నవులూరు వాటర్ ట్యాంక్ సెంటర్లో రాష్ట్ర మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ స్ఫూర్తితో వేసవి ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మర్రి ఏసుబాబు ఆధ్వర్యంలో శనివారం గ్రామ ప్రజలకు ఉచితంగా మంచినీటి సరఫరా చేసేందుకు రెండు మంచినీటి సరఫరా ట్యాంకర్లను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గ్రామ టీడీపీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు హాజరై ఉచిత మంచినీటి ట్యాంకర్లకు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, దాత ఏసుబాబు మాట్లాడారు. గ్రామంలో వేసవి కాలం వరకు ఉచితంగా రెండు మంచినీటి ట్యాంకర్ల ద్వారా త్రాగునీటిని సరఫరా చేయటం జరుగుతుందన్నారు. గ్రామంలో



ప్రధానంగా తాగునీటి సమస్య ఉన్న ఎన్టీఆర్ కాలనీ, ఉడా కాలనీ, ఎంఎస్ఎస్ కాలనీ, ముస్లిం బజార్ లతో పాటు గ్రామంలో ఇతర ప్రాంతాలకు కూడా నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసుబాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి మైనర్ బాబు, మల్లవరపు వెంకట్, పొన్నం శ్రీను, బత్తుల నాగరాజు, తోట శ్రీను బాబు అన్నం శివకృష్ణ, రుద్రు శ్రీను, కట్టెపోగు ముత్తయ్య, దేశబోయన వెంకట్రావు, కొత్త శ్రీను, ఆదినేయుడు శివ, దేశబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవంలో లక్ష మల్లెల పూజ

**గుంటూరు విద్య మే 10 ప్రభాతవార్త:** గుంటూరు పట్టణం కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవలో భాగముగా అదివారం ఉదయం 9.00 గం.లకు పంచామృతసపన్న ఉదయం 11.00 గం.లకు లక్ష మల్లెల పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి టి సుభద్ర, దేవస్థానం చైర్మన్‌మల్లెంపూడి శ్రీనివాసరావు, శ్రీ హనుమాన్ దీక్షా



సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకట సుబ్బారావు దీక్ష సమాజం సభ్యులు, నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్, మారుతి, వెంకట రమణ, మంశీ ప్రసాద్, బాపి రాజు, కిషోర్ ఆలయ ముఖ్య అర్చక స్వామి నరసింహచార్యులుధర్మకర్తల మండలి సభ్యులు అరుణ, జగదీష్ కుమార్, గిరిబాబు, లలిత, కిరణ్ కుమార్, దుర్గ, అరుణ కుమారి, శివయ్య గిరి వెంకట ప్రసాద్ రావు, దాసరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# సేవా తత్పరుడు సూరా రామారావు

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** తెలుగు పండితునిగా, ప్రధానోపాధ్యాయునిగా ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన సూరా రామారావు, రిటైర్ అయ్యాక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవలందించడం అబి .నందనీయమని పొన్నూరు కళాపరిషత్ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు అన్నారు. సూరా రామారావు లయన్స్‌క్లబ్‌లో సభ్యుడుగా ఉండి ఎన్నో సేవా కార్యక్రమాలకు తన వంతు సహకా



రాన్ని అందించారన్నారు. ఎంజెఎఫ్ సభ్యుడిగా కూడా ఇంటర్నేషనల్ లయన్స్ గుర్తింపు పొందారన్నారు. కళాపరిషత్‌కు కూడా తన వంతు సహాయసహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా కళాపరిషత్ తరపున సూరా రామారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు సూరినేని ఆంజనేయులునాయుడు, రామకృష్ణ, కోటేశ్వరరావు తదితరులున్నారు.

# జీవన శైలిలో మార్పుల ద్వారా గుండె జబ్బుల నివారణ సాధ్యం

## ముఖా ముఖి కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్

**గుంటూరు, మే10,ప్రభాతవార్త :** మానసిక ఒత్తిడి, పర్యావరణ కాలుష్యం, అసమతుల్య ఆహారం వంటి పలు సమస్యల ఫలితంగా ఎక్కువ మంది ప్రజలు పలు రకాల వ్యాధులతో అనారోగ్యం బారిన పడుతున్నారని, వారిలో గుండెకు సంబంధించిన పలు




రకాల సమస్యలకు గురవుతున్న వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారని లలితా పి.వి.ఎస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, గుంటూరు ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోలవరపు అనురాగ్ తెలియ చేశారు.గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో "గుండె మరియు రక్త ప్రసరణ" అనే అంశంపై బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వి.వి.కే సురేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనురాగ్ ఖిగుండె మరియు రక్త ప్రసరణఖి అంశంపై సవివరంగా మాట్లాడారు. గుండె సంబంధిత సమస్యలపై ఆయన సమగ్ర విశ్లేషణ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గుండెకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఎదురైనా, ఆందోళన చెందకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జీవనశైలిలో మార్పులు చేసుకుని, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. ఒక నిర్దిష్ట వయస్సు వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సలహాలను పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎన్. భావనారాయణ, ప్రజా ఆరోగ్య వేదిక తరపున ఎల్.ఎస్.భారవి, జి. శ్రీనివాస్, మురళీకృష్ణ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు పరమేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి హాజరైన అనేక మంది బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి తమ ఆరోగ్య సమస్యలపై సూచనలు పొందారు.



# ఘనంగా ఐసిఎస్ఐ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ సదస్సు

**గుంటూరు విద్య, మే 10, ప్రభాతవార్త :** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, అమరావతి చాప్టర్ హోస్ట్ గా , విశాఖపట్నం చాప్టర్ కో హోస్ట్‌గా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సదస్సు ఘనంగా జరిగింది. కంపెనీ సెక్రటరీల వృత్తిని వివిధ పారిశ్రామిక రంగాల్లో సెక్టార్ స్పెసిఫిక్ స్పెషలిస్ట్స్ గా తీర్చిదిద్దడం, అలాగే సంస్థలకు గవర్నెన్స్ ఆర్కిటెక్ట్స్ గా మారి నాయకత్వం వహించేలా ప్రోత్సహించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం అని నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సుకు ఐసీఎస్ఐఎస్ఐఆర్సీ చైర్మన్ సీఎస్ మహదేవ్ తిరునగరి ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా వ్యవహరించగా, అమరావతి చాప్టర్ ఛైర్మన్ సీఎస్ పీవీఎస్ఆర్ సిద్ధార్థ, విశాఖపట్నం చాప్టర్ ఛైర్మన్ సీఎస్ ఎం. చలపతి రావు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. సదస్సులో సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు సీఎస్ వెంకట రమణ, కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ ఎన్ ఏఆర్‌కే చౌదరి, శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి. సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్వాంటమ్ మిషన్ మిషన్ డైరెక్టర్ శ్రీధర్ సీవీ పాల్గొని ప్రసంగించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ సంస్థల విజన్‌ను సాధించడంలో కంపెనీ సెక్రటరీలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సంస్థలకు సమర్థవంతమైన మార్గనిర్దేశనం చేసి, పరిపాలనా వ్యవస్థలను బలోపేతం చేయడంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతి, విశాఖపట్నం చాప్టర్లకు చెందిన మేనేజింగ్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్ కురువెళ్ళ, కిలారి శ్రీనివాసరావు, ఎన్డి సయ్యద్ అబ్బాస్, ఎన్ వి ఎస్ నాగరాజు, మనోజ్ పరాక్, అమరావతి చాప్టర్ ఫౌండర్ చైర్మన్ కే శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# హనుమజ్జయంతి ఉత్సవానికి పూర్తి సహకారం

-ముస్లీం సంఘాలు స్పష్టీకరణ

**పొన్నూరు, మే 10,ప్రభాతవార్త:** స్థానిక శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలకు తమ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని ముస్లీం సంఘాల నాయకులు స్పష్టం చేశారు. కడప పట్టణంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ఆదివారం ముస్లీం సోదరులతో ధర్మకర్తల మండలి ఛైర్మన్ జిఎంఎస్ గుప్తా సమావేశమయ్యారు. మంగళవారం నాడు హనుమజ్జయంతి సందర్భంగా జరిగే రథోత్సవానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని పోలీసు అధికారులకు కూడా తెలిపారు. కడప పట్టణంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ముస్లీం సోదరులపై, మరీ ముఖ్యంగా మత గురువులు అయిన మౌలానా, ముఫ్తీలపై లాఠీ చార్జి చేసి పోలీసులను తక్షణమే చర్యలు



తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వర్ణపురి పట్టణలో హిందూ, ముస్లీంలు ఎప్పుడూ సోదరుల్లాగానే ఎవరి సంప్రదాయాలను వారు గౌరవించుకునే విధంగా నడుచుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తనీయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, వైకాపా నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము), జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ప్రధాన కార్యదర్శి హాసన్‌బేగ్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, మైనార్టీ నాయకులు షేక్ బాబ్జి, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, పఠాన్ మునీర్‌ఖాన్, అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ తదితరులున్నారు.

# ఎన్డీయే పక్షనేతగా హిమంత



## అధికారికంగా ప్రకటించిన జెపి నడ్డా
## గవర్నర్‌తో భేటీ, రేపే ప్రమాణం

**గువహటి, మే 10:** అసోంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వం మూడోసారి కొలువుదీర నుంది. హిమంత బిశ్వ శర్మ వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం మే 12న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం గువహటిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన బిజెపి ఎమ్మెల్యేలు, ఎన్‌డియే నేతల సమావేశంలో బిజెపి శాసనసభా పక్ష నేతగా, ఎన్‌డియే కూటమి నేతగా హిమంత బిశ్వ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని బిజెపి మాజీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జెపి నడ్డా అధికారికంగా ప్రకటించారు. అసోంలో ఎన్‌డియే శాసనసభ పక్ష నేత ఎన్నిక కోసం బిజెపి అధిష్టానం కేంద్ర పరిశీలకులుగా నియమించిన కేంద్ర మంత్రి జెపి నడ్డా, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీలు ఆధ్వర్యంలోనే ఈ తంతు ముగిసింది.

కూటమి శాసనసభ పక్ష నేతగా ఎన్నికైన తర్వాత, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ కాబోయే ముఖ్య మంత్రి హిమంత బిశ్వ శర్మ అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. రాజ్‌భవన్ సందర్శన సమయంలో, అసోం బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా, ఆర్థిక మంత్రి అజంతా నేగ్‌తో సహా పలువురు సీనియర్ బిజెపి నాయకులు, ఇతర పార్టీ కార్యకర్తలు శర్మ వెంట ఉన్నారు. అసోంలోని ఎన్‌డియే కూటమిలో కీలక భాగ స్వామ్య పక్షమైన 'అసోం గణపరిషత్' అధ్యక్షుడు, అసోం మంత్రి అయిన అతుల్ బోరా కూడా గవర్నర్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. కొత్త అసోం ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మే 12న గువహటిలోని ఖానాపరా వెటర్నరీ కళాశాల మైదానంలో జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, దేశవ్యాప్తంగా బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఈ భారీ వేడుకకు హాజరవుతారని భావిస్తున్నారు. ఈశాన్య భారతదేశంలో బిజెపి తన రాజకీయ బలాన్ని ప్రదర్శించే వేదికగా భావిస్తున్న ఈ కార్యక్రమంలో, అసోంలోని వివిధ ప్రాంతాల నుండి సీనియర్ ఎన్‌డియే నాయకులు, పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొనే అవకాశం ఉంది.

# ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగిస్తాం..



## కీలక దశకు చర్చలు:పుతిన్

**మాస్కో, మే 10:** నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. శనివారం రష్యాలోని మాస్కోలో జరిగిన విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే ఉక్రెయిన్ యుద్ధం ముగిసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ యుద్ధం ముగించేందుకు యురోపియన్ యూనియన్‌తో కూడ చర్చలు జరుపుతానని పుతిన్ వెల్లడించారు. ఇయు అండతోనే ఉక్రెయిన్.. రష్యాపై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా యురోపియన్ యూనియన్ (ఇయు)తో చర్చల కోసం జర్మనీ మాజీ ఛాన్స్‌లర్ గెర్హార్డ్ ష్రోడెర్ పేరును పుతిన్ సూచించారు. ఈ చర్చల ద్వారా ఇయుతో రక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కూడా పుతిన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉక్రయిన్‌తో కాల్పుల ఒప్పందానికి అంగీకరించారు. అలాగే, రెండు దేశాల మధ్య 1,000 మంది సైనిక ఖైదీల అప్పగింతకు కూడా అంగీకరించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా, ఉక్రెయిన్ మధ్య కుదిరిన కీలక ఒప్పందం ఇది. ఈ యుద్ధం 2022, ఫిబ్రవరిలో ప్రారంభమైంది. నాలుగేళ్లుగా ఇంకా యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధంలో రష్యాకు ఉత్తర కొరియా సైన్యం కూడా సహకరించినట్లు ఆరో పణలు ఉన్నాయి. తాజాగా మాస్కోలో జరిగిన విక్టరీ పెరేడ్‌లో కొరియా సైనికులు కూడా పాల్గొనడం ఈ ప్రచారానికి బలం చేకూర్చింది.

# వెన్నంటి నడిచిన కేబినెట్ మంత్రులు

## విజయ్‌తోపాటు తొమ్మిది మంది ప్రమాణ స్వీకారం



**చెన్నై, మే 10:** దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త శకానికి పునాదులు పడ్డాయి. నటన నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగం టీవీకే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతోపాటు వెనువెంటనే తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణంచేసారు. వీరంతా విజయ్‌కు ఆదినుంచి వెన్నంటి నడిచినవారే కావడం విశేషం. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ సమక్షంలో విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మరో 9 మంది టీవీకే ఎమ్మెల్యేలు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పార్టీని ప్రారంభించక ముందే ఆయన అభిమాన సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా ఆనంద్ వ్యవహరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నైలోని త్యాగరాయనగర్ నియోజకవర్గం నుంచి ఆనంద్ పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి రాజా అన్బళగన్‌ను ఆయన ఓడించారు. 6 అడుగుల 7 అంగుళాల ఎత్తుతో ఆకట్టుకునే మాజీ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ఆధవ్ అర్జున. తమిళనాడుకు చెందిన రాజకీయ వ్యూహకర్త. విల్లివాక్కం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా ఆధవ్ అర్జున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. విజయ్ కేబినెట్‌లో ఏకైక మహిళా మంత్రిగా కీర్తన ఎంపికయ్యారు. తమిళనాడులోని బాణసంచా పరిశ్రమకు కేంద్రమైన శివకాశి నియోజకవర్గం నుంచి టీవీకే అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. టీవీకేలో కీలక నేత డాక్టర్ టీకే ప్రభు దంత వైద్యుడు. కారైకుడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అన్నాడీఎంకేలో అత్యంత సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్ ఐదు దశాబ్దాల అనుబంధం తర్వాత గత సంవత్సరం ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. విజయ్ పార్టీలో చేరి తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. న్యాయవాది అయిన పి వెంకటరమణన్ చెన్నైలోని కీలకమైన మైలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీవీకే ఎమ్మెల్యేగా గెలుపొందారు. టీవీకే కోశాధికారిగా ఆయన వ్యవహరిస్తున్నారు టీవీకే ఐటీ, సోషల్ మీడియా శాఖ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా నిర్మల్ కుమార్ మదురైలోని తిరుప్పరన్‌కుండ్రం నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. నటుడు, స్టాండ్‌అప్ కమెడియన్, ప్రేరణాత్మక వక్తగా బహుముఖ పాత్రలు పోషించిన రాజమోహన్ అరుణ్మొగం చెన్నైలోని ఎగ్మోర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి టీవీకే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. విజయ్ తొలి కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## బాధ్యతలు స్వీకరించిన వెంటనే కీలకమార్పులు




తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా, తమిళగ వెట్రి కళగం టీవీకే అధ్యక్షుడు విజయ్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించిన గంటల వ్యవధిలోనే ఆయన తన కార్యాలయం సీఎంఓలో కీలక నియామకాలు చేపట్టారు. ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను తన సహాయకులుగా నియమిస్తూ తొలి ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఆరోగ్యశాఖ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి పి.సెంథిల్ కుమార్‌ను ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శి స్పెషల్ సెక్రటరీ1గా నియమించారు. అదేవిధంగా, ఆది ద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న జి.లక్ష్మీ ప్రియను ముఖ్యమంత్రికి రెండో ప్రత్యేక కార్యదర్శి స్పెషల్ సెక్రటరీ2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే మూడో ప్రత్యేక కార్యదర్శి నియామకం కూడా ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయంలో ముగ్గురు ప్రత్యేక కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తారు. అంతకు ముందు, జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయ్ నేరుగా సచివాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి ఛాంబర్‌లోకి ప్రవేశించిన ఆయన, తొలిసారిగా సీఎం కుర్చీలో కూర్చునే ముందు కాస్త భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో సీనియర్ మంత్రి కె.ఏ. సెంగొట్టయ్యన్ ఆయనను ప్రోత్సహించడంతో, విజయ్ చిరునవ్వుతో తన కుర్చీలో ఆసీనులయ్యారు. అసెంబ్లీ కార్యదర్శి శ్రీనివాసన్‌తో పాటు పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నూతన ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ నియామకాలను గత డీఎంకే ప్రభుత్వం నుంచి పరిపాలన మార్పులో భాగంగా చూస్తున్నారు. స్టాలిన్ హయాంలో ఉదయచంద్రన్, షణ్ముగం, అను జార్జ్ వంటి అధికారులు సీఎంఓలో పనిచేసిన విషయం తెలిసిందే.

# యోగి కేబినెట్‌లోకి మరో ఆరుగురు



## రానున్న ఎన్నికల నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ

**లక్నో, మే 10:** ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా ఆరుగురికి అవకాశం కల్పించారు. ఆదివారం లోక్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఆ ఆరుగురితో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించారు. కొత్తగా మంత్రివర్గంలోకి చేరిన వారిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, కృష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దిలేర్ ఉన్నారు. ఈ కీలకమైన విస్తరణలో, భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో, కృష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దిలేర్ సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తన బృందాన్ని విస్తరించడంతో పాటు, ముఖ్య మంత్రి యోగి అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్‌లను స్వతంత్ర బాధ్యతలతో కూడిన సహాయ మంత్రులుగా పదోన్నతి కల్పించారు. వచ్చే ఏడాది ప్రారంభంలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంత్రి వర్గాన్ని విస్తరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**అఖిలేష్ సెటైర్లు:** యోగి ఆదిత్యనాథ్ మంత్రివర్గ విస్తరణపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ ఇది కేవలం 'కాలక్షేపం' చేయడానికి చేసే వ్యాయామం అని సెటైర్లు వేశారు. బిజెపిలో ముఖ్యమంత్రి పాత్ర కేవలం 'చీటీలు చదవడం' వరకే పరిమితమైందని వ్యాఖ్యానిస్తూ, ఆయన పార్టీ నాయకత్వ శైలిని కూడా విమర్శించారు.

# ప్రమాణ స్వీకారోత్సవంలో మెరిసిన త్రిష



**చెన్నై, మే 10:** తమిళనాడు ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ, ప్రముఖ నటి త్రిష కృష్ణన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నీలిరంగు కంచి పట్టుచీర, జడలో మల్లెపూలు, వజ్రాలు, కెంపుల నెక్లెస్‌తో సాంప్రదాయబద్ధంగా ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని కార్యక్రమానికి ముందు త్రిష పేర్కొన్నారు. ఆమె వెంట తల్లి ఉమా కృష్ణన్ కూడా ఉన్నారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి త్రిష తన మిత్రుడు విజయ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఫలితాల రోజు నాల్గవతేదీ తన పుట్టినరోజున తిరుపతిలో ప్రత్యేక పూజలు చేశారు. విజయ్ పార్టీ ఆధిక్యం ఖరారయ్యాక చెన్నైలోని ఆయన నివాసానికి కూడా వెళ్లారు. అంతకుముందు, పోలింగ్ రోజున గిల్లి సినిమా నేపథ్య సంగీతంతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి పరోక్షంగా తన మద్దతు తెలిపారు. మరోవైపు, విజయ్ భార్య సంగీత విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత, విజయ్ త్రిష సంబంధంపై ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ వార్తలపై ఇద్దరూ మౌనం పాటిస్తున్నప్పటికీ, పలు సందర్భాల్లో కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తమిళనాట ఏకైక మహిళామంత్రి కీర్తన



**చెన్నై, మే 10:** రాజకీయ వ్యూహకర్త స్థాయి నుంచి పిన్నవయసులోనే టివికెలో చేరి మంత్రిగా ఎదిగిన కీర్తన ఇపుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దళపతి విజయ్ నేతృత్వంలోని తమిటీవీకే ప్రభుత్వం కొలువుదీరిన వేళ, ఆయన కేబినెట్‌లో సాధించిన 29 ఏళ్ల యువతిగా, ఏకైక మహిళగా కీర్తన రికార్డు సాధించారు. విరుదునగర్ జిల్లాలోని భారత బాణసంచా రాజధానిగా పేరుగాంచిన శివకాశీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. విరుదునగర్ జిల్లాలో 1996లో పుట్టిన కీర్తన, తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రభుత్వ తమిళ మీడియం పాఠశాలలో పూర్తి చేశారు. ఆ తర్వాత మదురై కామరాజ్ యూనివర్సిటీ అనుబంధ కళాశాల నుంచి బీఎస్సీ మ్యాథమెటిక్స్‌లో పట్టా పొందారు. ఉన్నత చదువులపై ఆసక్తితో పుదుచ్చేరి యూనివర్సిటీలో చేరి 2019లో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. చదువులో చురుగ్గా ఉండే ఆమె, ప్రజా జీవితంపై ఆసక్తితో రాజకీయ వ్యూహరచన రంగంలోకి అడుగుపెట్టారు. ఐప్యాక్ మరియు షోటైమ్ కన్సల్టింగ్ వంటి ప్రఖ్యాత పొలిటికల్ కన్సల్టెన్సీ సంస్థల్లో డిజిటల్ క్యాంపెయిన్ స్ట్రాటజిస్ట్‌గా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాట ద్రవిడ మున్నేట్ర కజగం వంటి బలమైన పార్టీల ఎన్నికల వ్యూహరచనలో పాలుపంచుకున్నారు. ఈ అనుభవంతో ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ, చంద్రబాబు నాయుడు వంటి నేతల పనితీరును దగ్గర నుంచి గమనించారు. ఈ అనుభవమే పాలన, అధికార యంత్రాంగం, బ్యూరోక్రసీ పనితీరుపై తనకు లోతైన అవగాహన కల్పించిందని ఆమె ఒక సందర్భంలో తెలిపారు.

# వీళ్లూ ఓ తల్లి కన్నబిడ్డలే..

## శ్వేతసౌధం మహిళా ప్రతినిధికి ఇరాన్ సందేశం





**వాషింగ్టన్, మే 10:** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఇటీవల ఓ పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారికి వివియానా అని పేరు పెట్టినట్లు వెల్లడించారు. లీవిట్ పోస్ట్‌పై అమెరికాలోని ఇరాన్ ఎంబసీ స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. అదే సమయంలో ఫిబ్రవరి 28న మినాబ్‌లోని ఒక పాఠశాలపై అమెరికా చేసిన దాడిలో 160 మందికిపైగా విద్యార్థులు మరణించిన విషయాన్ని గుర్తు చేసింది. 'పిల్లలు అమాయకులు. వారికి ప్రేమించటం తప్ప ఇంకేమీ తెలియదు. మినాబ్‌లోని పాఠశాలలో మీబాస్ హత్య చేసిన పిల్లలు కూడా మీలాంటి తల్లులు నవమాసాలు మోసి కన్నవారే కదా.. మీరు మీ బిడ్డను ముద్దుపెట్టుకునే ముందు ఆ తల్లుల గురించి ఒకసారి ఆలోచించండి' అని ఇరాన్ ఎంబసీ రాసుకొచ్చింది.

ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా తొలిరోజు చేసిన దాడుల్లో మినాబ్ నగరంలోని ఓప్రాథమిక పాఠశాలను తోమహాక్ క్షిపణితాకింది. ఈ ఘటనలో 160మందికిపైగా చిన్నారులు, 14మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం సామూహిక సమాధులు తవ్వి వారందరినీ ఒకే దగ్గర పూడ్చిపెట్టిన దృశ్యాలను ఇరాన్ అధికారులు సోషల్ మీడియాలో షేర్‌చేశారు. దీనిపై అప్పట్లో కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ అమెరికా ఎప్పుడూ పౌరులను లక్ష్యంగా చేసుకోదని అన్నారు. ఈ విషయంపై తమ యుద్ధ విభాగం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## పాక్‌లో అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌పై ఆత్మాహుతి దాడి..

# 15 మంది పోలీసులు మృతి

**ఇస్లామాబాద్, మే 10:** పాకిస్థాన్‌లోని అశాంతి నిలయమైన ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో శనివారంరాత్రి ఉగ్రదాడి జరిగింది. బన్నూ జిల్లాలోని ఫతేఖేల్ పోలీసు స్టేషన్‌ను లక్ష్యంగా చేసుకొని శనివారం జరిగిన భారీ ఆత్మహుతి దాడిలో 15 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారని సమాచారం. ఆదివారం బలూచిస్థాన్‌లో జరిగిన వరుస దాడులతో పాకిస్థాన్ రక్తసిక్తమైంది. పేలుడు ధాటికి సమీపంలోని నివాసగృహాలు కుప్పకూలడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించిందని తెలుస్తున్నది. పేలుడు ధాటికి అనేకమంది అధికారులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. డిఐజి సజ్జాద్‌ఖాన్ పర్యవేక్షణలో రాత్రంతా సహాయక సహాయక చర్యలు కొనసాగాయి. పేలుడు జరిగిన వెంటనే డజన్ల కొద్దీ సాయుధ ఉగ్రవాదులు పోలీసుస్టేషన్‌ను అన్ని వైపుల నుంచి చుట్టుముట్టారు. దీంతో భద్రతా సిబ్బందికి, ఉగ్రవాదులకు మధ్య గంటల తరబడి కాల్పులు జరిగాయి. ఈ భీకర పోరాటంలోనే 15 మంది పోలీసులు వీరమరణం పొందారని తెలుస్తోంది. గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ దాడిని ఖైబర్ ఫఖ్తూన్‌ఖ్వా ముఖ్యమంత్రి ముహమ్మద్ సోహైల్ అఫ్రిది తీవ్రంగా ఖండించారు. అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. 'ఉగ్రవాదంపై పోరాటం కేవలం ఒక ప్రాంతానిది కాదు, ఇది దేశం మొత్తానిది. బలవంతంగా రుద్దిన కొనిన తప్పుడు విధానాల వల్లే దేశం నేడు అభద్రతా ఊబిలోకి నెట్టబడింది. మన పోలీసుల త్యాగాలను వృథాకానివ్వం' అని అఫ్రిది స్పష్టం చేశారు. ఆత్మాహుతి దాడి తీవ్రతకు పోలీసు స్టేషన్ పరిసరాల్లోని నివాసగృహాల పైకప్పులు కూలిపోయాయి. స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతాన్ని భద్రతా దళాలు తమ అధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

**బలూచిస్థాన్‌లో 'బిఎల్‌ఎఫ్' మారణహోమం:** ఒక వైపు బన్నూలో ఈ దారుణం జరుగుతుండగానే, మరోవైపుబలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్) ఆదివారం వరుస దాడులకు తెగబడింది. బలూచిస్థాన్‌లోని ఖరాన్, వాషుక్, మస్తుంగ్ సహా పది ప్రాంతాల్లో భద్రతా బలగాలే లక్ష్యంగా దాడులు జరిగాయి. ఈ ఘటనల్లో 10 మంది పాకిస్థానీ సైనికులు, నలుగురు రాష్ట్ర ఏజెంట్లు మరణించినట్లు బిఎల్‌ఎఫ్ ప్రకటించింది. సైనిక స్థావరాలు, కాన్వాయ్‌లపై రాకెట్లు, గ్రెనేడ్ లాంచర్లతో విరుచుకుపడ్డామని ఆ సంస్థ వెల్లడించింది.



## విభేదాలున్నా ఇండియా కూటమి చెక్కు చెదరదు: చిదంబరం

**చెన్నై, మే 10:** తమిళనాట రాజకీయాల్లో డిఎంకెను కాదని విజయ్ టివికెకు కాంగ్రెస్ మద్దతివ్వడంతో డిఎంకె ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఇండియా కూటమికి బీటలు తప్పవన్న వాదనలపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం స్పందించారు. రాష్ట్ర స్థాయిలో విభేదాలు తలెత్తినా ఇండియా కూటమికి ఎలాంటి నష్టం వాటిల్లదని చిదంబరం ధీమా వ్యక్తం చేశారు. తన దృష్టిలో ఇండియా కూటమి కొనసాగుతుంది. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూటమికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కేవలం తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు ముగిసిందని మాత్రమే చెప్పారని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పొత్తుల మధ్య తేడా ఉంటుందని ఆయన వివరించారు. కేరళలో కాంగ్రెస్, సీపీఎంలు ప్రత్యర్థులుగా ఉన్నా, ఢిల్లీ స్థాయిలో ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోనూ మమతా బెనర్జీ కూటమిని బలోపేతం చేస్తానని పునరుద్ఘాటించారు. కాబట్టి కూటమి కొనసాగకపోవడానికి కారణం కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. డీఎంకే కూటమిలో కొనసాగుతుందని తాను ఆశిస్తున్నట్లు చిదంబరం తెలిపారు. అంతేకాదు, విజయ్ నేతృత్వంలోని టీవీకేని కూడా ఇండియా కూటమిలోకి తీసుకురావాలని ప్రయత్నించాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# వస్తూనే డబ్బుల్లేవని మాట్లాడొద్దు: మాజీ సిఎం స్టాలిన్ కౌంటర్



**చెన్నై, మే 10:** తమిళనాడు నూతన ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీవీకే అధినేత విజయ్‌కు డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూనే, తీవ్రమైన రాజకీయ విమర్శలతో కూడిన హెచ్చరికలు జారీ చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మీరు సంతకం చేసిన ఉత్తర్వులను కూడా నేను స్వాగతిస్తున్నాను. వస్తూనే ప్రభుత్వం దగ్గర డబ్బు లేదని మాట్లాడటం మొదలుపెట్టవద్దు. అవన్నీ ఉన్నాయి. ప్రజలకు ఇవ్వాలన్న మనసు, పరిపాలనా దక్షత మాత్రమే కావాలి. గత ఐదేళ్లలో మేము కోవిడ్, వరదలు వంటి ఎన్నో సమస్యలను, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వివక్షను ఎదుర్కొని లెక్కలేనన్ని ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశాం. గత ప్రభుత్వం రూ. 10లక్షల కోట్ల అప్పు చేసి, ఖజానాను ఖాళీ చేసి వెళ్లిపోయిందని మీ మొదటి ప్రసంగంలోనే ఆరోపించారు కదా. తమిళనాడు అప్పులు అనుమతించిన పరిధిలోనే ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి గత ఫిబ్రవరి బడ్జెట్‌లోనే మేము స్పష్టంగా చెప్పాం. ఆ విషయం మీకు తెలియదా ఆ తర్వాతే కదా మీరు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చింది మీకు ఓటు వేసిన ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించి మోసం చేయకండి. ఆచరణ సాధ్యమైన వాటినే హామీలుగా ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనలోకి అడుగుపెడుతున్నారు. మాలాగా మీరు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలనే మెలకువలను నేర్చుకుంటారని నేను నమ్ముతున్నాను. ఓటు వేసిన ప్రజలతో పాటు, నేను కూడా అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రయాణం కొనసాగాలని మరోసారి ఆకాంక్షిస్తూ, నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానంటూ స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# మనందరి మొదటి శత్రువు బిజెపియే

## పార్టీకేడర్‌తో మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మే 10:** మనందరి మొదటి శత్రువు బీజేపీయేనని, కాబట్టి అందరం కలిసి ఆ పార్టీపై పోరాటం చేద్దామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది. సువేందు అధికారి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ ఏకం కావాలని సూచించారు. విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలు కూడా మద్దతివ్వాలని కోరారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే వామపక్షాలు, ప్రతిపక్షాలతో పాటు జాతీయ పార్టీలు కూడా కమలం పార్టీపై పోరాటానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. శత్రువుకు శత్రువు మిత్రుడు అని ఆలోచించే సమయం ఇది కాదని అన్నారు. మనందరి మొదటి శత్రువు బీజేపీయే అన్నారు. బీజేపీ వంటి దుష్ట శక్తులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులుచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నాయకులతో పాటు వివిధ పార్టీల నాయకులు తనతో మాట్లాడారని వెల్లడించారు. తాను ఎవరి సానుభూతిని కోరుకోవడం లేదని, యుద్ధంలో ఎవరు గెలుస్తారనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ పార్టీకి అన్యాయం జరిగిందని మమతా బెనర్జీ ఆరోపించారు.



## పూర్తిస్థాయిలో వందేమాతరం ఆలాపన

**చెన్నై, మే 10:** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వేదికపై వందేమాతరగేయాన్ని పూర్తిగా ఆలపించారు. ఈ సందర్భంగా గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను పాడటం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని రెండు భాగాలను మాత్రమే ఆలపిస్తారు. అయితే ఇకపై అందులోని ఆరు చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. అందువల్లనే ప్రమాణస్వీకారం సమయంలో తమిళనాడు కొత్త ప్రభుత్వం ఈ విధానం పాటించింది.

# శివయ్య సేవలో సిఇసి జ్ఞానేష్‌కుమార్



**శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్‌లు శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఒ బికె వెంకటేశులు వేదపండితులతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. వారు ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా వెంటనే సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులతో ప్రత్యేక పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజల అనంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. చైర్మన్, ఇఒలు మెమెంటోలు, తీర్థ ప్రసాదాలు అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్లు రాగా సన్నిధివీధిలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. కాగా స్వాగతం చెప్పిన వారిలోతిరుపతి జాయింట్ కలెక్టర్ గోవిందరావు, తిరుపతి డిఆర్‌ఓ నరసింహులు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ టివి సుబ్రమణ్యం, ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్‌ఓ రవిలు ఉన్నారు.

# మహిళలను గౌరవించడం బాధ్యత

● మాతృదినోత్సవంలో హోంమంత్రి వంగలపూడి అనిత



వృద్ధాశ్రమంలో మహిళతో విమెన్స్‌డే కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, తదితరులు

**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. తల్లుల త్యాగాలను మరవొద్దని పేర్కొన్నారు. అందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గోశాల "బంధం" వృద్ధ మహిళల ఆశ్రమంలో "మదర్స్ డే "వేడుకల్లో అనిత, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ఆ ఆశ్రమంలో ఎంతోమందికి ఆశ్రయం కల్పిస్తున్నారని చెప్పు కొచ్చారు. చాలామంది మాతృమూర్తులు వారి పిల్లలకు దూరంగా ఉన్నారని తెలిపారు. వాళ్లకు ఒక చిన్న ఆనందాన్ని ఇవ్వాలని, వాళ్లందరి దీవెనలు పంచుకోవాలని ఈ ఆశ్రమానికి తాను వచ్చానని అన్నారు. నిస్వార్థమైన ప్రేమకు నిలువుటద్దం అమ్మ అని అన్నారు. బిడ్డల ఎదుగుదల కోసం తన జీవితాన్నే ధారబోసే ప్రతి తల్లికీ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో తల్లుల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్న ఆమె, మాతృదినోత్సవాన్ని జరుపుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. ఆ దేవుడు కూడా మొదటి స్థానాన్ని తల్లికే ఇస్తాడన్నారు. తల్లి పడే కష్టాలు వర్ణనాతీతం అని, పిల్లలను మంచి స్థాయికి తీసుకెళ్లాలని తల్లి ఎప్పుడూ తపన పడుతుంటుందని అన్నారు. తల్లి విలువ తెలియాలని నా పిల్లలను కూడా ఈ కార్యక్రమానికి తీసుకువచ్చాను అని మంత్రి అనిత పేర్కొన్నారు. వీళ్లందరి కళ్లలో కనిపిస్తున్న ఆనందం, వాసవి మహిళా మండలి నడుపుతున్న తీరు తనకు చాలా స్ఫూర్తిని ఇచ్చిందని హోంమంత్రి అనిత తెలిపారు. సమాజంలో తల్లికి ఇచ్చే గౌరవస్థానం ప్రపంచంలో ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. మహిళల విషయంలో మంత్రి నారా లోకేశ్ చూపుతున్న స్ఫూర్తిని కూడా మనం ఆదర్శంగా తీసుకోవాలని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. సమాజంలో తల్లిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు.

# కరుణకు మారుపేరు అమ్మ: సిఎం చంద్రబాబు



**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి జీవం అమ్మ ప్రేమతోనే మొదలవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా ఆయన ప్రత్యేక సందేశం ఇచ్చారు. అమ్మ త్యాగం, లాలన వెలకట్టలే నివని చెప్పారు. కరుణకు మారు పేరుగా అమ్మ నిలుస్తుంద న్నారు. ఆమె నిశ్శబ్ద శక్తికి నిలువుటద్దం అని కొనియాడారు. "అమ్మ స్వభావం చాలా సున్నితమైనది. కానీ ఆమె ఆత్మస్థైర్యం మాత్రం ఎంతో గొప్పది. తల్లుల అంకితభావమే కుటుంబాలను చక్కగా తీర్చిదిద్దుతుంది. సమాజానికి దిశానిర్దేశం చేస్తూ మానవత్వాన్ని కాపాడేది అమ్మే" అని సిఎం చంద్రబాబు ప్రశంసించారు. బిడ్డలకు గురువు, దైవం, మార్గదర్శి అన్నీ ఆమేనని స్పష్టం చేశారు.

### తల్లి స్ఫూర్తితోనే నైతిక విలువల పాఠాలు

కనిపించే ప్రతి స్త్రీ, కని పెంచిన అమ్మతో సమానమని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమ్మకు చెప్పలేని పని ఎప్పుడూ, ఎవ్వరూ చేయొద్దని సూచించారు. ఇదే ప్రతి అమ్మ కోరుకునే అసలైన కానుక అని చెప్పారు. చిన్నప్పటి నుంచే మహిళలను గౌరవించడం అమ్మే నేర్పిందన్నారు. స్త్రీ, పురుషులు సమానం అనే భావన తనలో తల్లి వల్లే కలిగిందని గుర్తుచేసుకున్నారు. తన తల్లి స్ఫూర్తితోనే విద్యా శాఖలో నైతిక విలువల పాఠాలను ప్రవేశపెట్టామని లోకేశ్ వెల్లడించారు. మహిళా సాధికారతే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, దీపం2 పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని వివరించారు.

# ఎపి రాజధాని అమరావతిలో రహదారులు, కీలక కట్టడాల నిర్మాణాల కోసం భూ సేకరణ

**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతి ప్రాంతంలో మాస్టర్ ప్లాను ప్రకారం రహదారులు, కీలక కట్టడాల నిర్మాణాల కోసం భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. మందడం, తుళ్లూరు, అబ్బురాజుపాలెం, ఐనవోలు, అనంతవరం, శాఖమూరు, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో భూములు తీసుకోవాల్సి ఉంది. నిడమర్రులోనూ సుమారు 47ఎకరాల వరకూ అవసరం ఉంది. ఈ గ్రామంలో నాలుగు రోడ్లు వేయాల్సి వస్తోంది. దీంతో 120 ఇళ్లకుపైగా తొలగించాల్సి ఉంది. ఐనవోలులో రెండురోడ్లు, మందడంలో రెండు, తుళ్లూరులో రెండు, అబ్బురాజుపాలెంలో రెండు, రాయపూడిలో కొత్తగా మరొక రోడ్డు మాస్టర్ ప్లాను ప్రకారం వేయాల్సి వస్తుంది. వీటిల్లో ఎల్‌పిఎస్ సదుపాయాలు, ట్రంక్ ఇన్‌ఫ్రా, వరద ముంపు నివారణ, అమరావతి ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సిన ప్రాంతంలో 176.24 ఎకరాల భూమి అవసరం ఉంది. ఇవి కాకుండా వేర్వేరు గ్రామాల్లో ఇంకా 1,850 ఎకరాల వరకూ సేకరణ చేయాల్సి ఉంది. వీటిల్లోనూ కొంతమంది రైతులు భూములివ్వడానికి సిద్ధపడ్డారు. ఇటీవల నాలుగు గ్రామాలకు భూ సేకరణ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. నెగోషియబుల్ సెటిల్‌మెంట్ పాలసీ(ఎన్‌ఎస్‌పి) అమల్లో ఉన్న నేపథ్యంలో రైతులు దానికి ముందుకు రావాలని ఇటీవల కమిషనర్ విజయరామరాజు కోరారు. గ్రామాల్లో ఇళ్లు కోల్పోతున్న వారికి తాత్కాలిక నివాసం కోసం నెలకు రూ.5 వేలు అద్దె ఇస్తామని అధికారులు ప్రకటించారు. దీన్ని రూ.15 వేలకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ డిమాండ్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

ఇటీవలి త్రీమెన్ కమిటీ భేటీలోనూ ఈ అంశం చర్చకు వచ్చింది. పొలాలిచ్చి, ఇళ్లస్థలాలు కూడా ఎలా ఇస్తామని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉండవల్లి, పెనుమాక వంటి చోట్ల కూడా కొందరు రైతులు భూములిచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రోడ్లను మెలికలు తిప్పాల్సి వస్తోందని, దీనిపైనా త్వరలోనే నిర్ణయం తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. రైతులతో సంప్రదింపులు జరపాలని సంబంధిత అధికారులను నిర్దేశించారు. రాయపూడిలో పూలింగుకు భూములివ్వని రైతులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

# విద్యాదాన్ ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువు జూన్ 20

**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సరోజినీ దామోదరన్ ఫౌండేషన్ విద్యాదాన్ ఉపకార వేతనాలకు దరఖస్తులు ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 20 చివరి గడువుగా ప్రకటించింది. ఆన్‌లైన్ పరీక్ష జులై 5న నిర్వహిస్తారు. విద్యార్థి చదువులో చూపిన ప్రతిభ, దరఖాస్తులో ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎంపిక చేసిన వారికి ఆన్‌లైన్ పరీక్ష, మౌకిక పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వివరాలను ఈ మెయిల్ ద్వారా విద్యార్థులకు తెలియజేస్తారు. విద్యార్థి కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.2 లక్షల లోపు ఉండాలి. పదో తరగతిలో కనీసం 90% సాధించిన వారు ఇంటర్మీడియట్, డిప్లొమా చదువుతున్న వారు అర్హులు, ఎంపికైన విద్యార్థులకు రెండేళ్లు ఉపకార వేతనాలు అందిస్తారు. కోర్సు, కాలపరిమితి ఆధారంగా ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు ఉపకారవేతనాలు ఇస్తారు. విద్యార్థులు విద్యాదన్.ఆంధ్రా ఎట్‌దిరేట్ఆఫ్ఎస్‌డిఫౌండేషన్ఇండియా.కమ్ అనే సైట్‌లో లేదా 96635 17131 నంబరులో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు సంప్రదించొచ్చని ఫౌండేషన్ వెల్లడించింది.

# స్థానిక సంస్థలకు జాతీయ గుర్తింపుపై డి.సిఎం పవన్ కళ్యాణ్ హర్షం



**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరో కీలక గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్-2025, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయత్ సతత్ పురస్కార్-2025 అవార్డుల్లో దేశవ్యాప్తంగా ఎపి రెండో స్థానం సాధించింది. ఈ విజయంపై పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ సిఎం స్పందించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం గుర్తించడం గర్వకారణమని తెలిపారు. గ్రామ పంచాయతీలు సాధించిన విజయాన్ని ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామప్రజల సమష్టి కృషి వల్లే ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి అవార్డులు సాధించిన గ్రామ పంచాయతీల్లో శృంగవరం, బొక్కసంపాలెం, చెముళ్లపల్లి, గుండమాల పేర్లు నిలిచాయి. ఈ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టతకు సహకరిస్తున్న సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

## తిరుమల సమాచారం



### బర్డ్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరుకు చెందిన కారుమూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసులు రెడ్డి ఆదివారం బర్డ్ ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళాన్ని అందించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో విరాళం డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి దాత అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు నన్నపునేని సదాశివరావు పాల్గొన్నారు.



### మాతంగి వేషంలో గంగమ్మ

**తిరుపతి, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం జాతర వేడుకల్లో ఆదివారం మాతంగి వేషంతో అమ్మవారు వైభవంగా దర్శనమిచ్చారు. మాతంగి వేషధారణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతరలో భాగంగా పురుషులు స్త్రీల వేషాల్లో, స్త్రీలు పురుషుల వేషాల్లో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయబద్ధం గా మాతంగి వేషాలు ధరించిన భక్తులు గంగమ్మ నామస్మరణల మధ్య పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం భక్తులతో కిక్కిరిసి పోగా, జాతర ప్రాంగణం భక్తితో మార్మోగింది.



### గంగమ్మకు తుడా చైర్మన్ సారె

**తిరుమల, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తాతయ్యగుంట గంగమ్మ గంగ జాతర పురస్కరించుకుని గంగమ్మకి తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ దివాకర్ రెడ్డి అంగరంగ వైభవంగా సారె సమర్పించారు. తిరుపతి ప్రజలను చల్లగా చూసే కరుణామయి గంగమ్మ తల్లి. ఈ జాతర కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు, ఇది మన సంస్కృతికి ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, ఎస్ఇ రవీంద్రయ్య, సిపిఓ దేవికుమారి, భూసేకరణ అధికారి సుజన, ఎపిఓలు, జెపిఓలు, ఎఒ శైలజ, వారి కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### అంజనాద్రిలో 12న హనుమజ్జయంతి వేడుకలు

- ఆకాశగంగలోని బాలాంజనేయునికి ప్రత్యేక అభిషేకం

**తిరుమల, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం కొండల్లోని తిరుమల ఆకాశగంగ ప్రాంతంలో మరో దివ్యపుణ్యక్షేత్రం బాలాంజనేయస్వామికి ఈనెల 12న హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. మంగళవారం రోజు పలు రకాల విశేష ఉత్సవాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించనున్నారు. అంజనాద్రిలోని ఆకాశగంగ ఆలయం, జపాలి తీర్థంలోని హనుమాన్ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఆకాశగంగలోని అంజనాద్రి ఆలయం, జపాలి ఆంజనేయస్వామి ఆలయాలకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. వేదపండితులు ఆంజనేయ సహస్రనామార్చన, మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి, అంజనాదేవికి అభిషేకం నిర్వహించనున్నారు. అంజనాద్రిని టిటిడి సర్వాంగసుందరంగా ముస్తాబు చేసే పనులు మొదలుపెట్టింది. శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న బేడి ఆంజనేయస్వామికి, కాలినడకబాటలో ఏడవ మైలు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామికి హనుమజ్జయంతి నాడు ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడవమైలు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహానికి 12వ తేదీ సాయంత్రం 3 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను టిటిడి నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, స్థానికుల సౌకర్యార్థం తిరుమల నుండి ఏడో మైలుకు, తిరిగి తిరుమల చేరడానికి టిటిడి ఉచిత రవాణా సౌకర్యాన్ని కూడా కల్పిస్తుంది.

# గోసంరక్షణలో భాగస్వామ్యం కావాలి

● ఎస్వీ గోశాలకు 1,600 టన్నుల ఎండుగడ్డి విరాళం: టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** గోమాత సంరక్షణ భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సేవ అని, గోసంరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు. టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ నెహ్రూ ఫౌండేషన్ శ్రీనివాస సేవా ట్రస్ట్ ఛైర్మన్ టి.సత్యనారాయణ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ గోశాలకు ఆదివారం 180 లారీల ద్వారా సుమారు 1600 టన్నుల ఎండుగడ్డిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ, కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రాంతం నుండి ఎండుగడ్డిని సేకరించి, స్వంత నిధులతో పాటు రవాణా ఖర్చులను భరిస్తూ ఇంత భారీ స్థాయిలో మొదటిసారిగా విరాళం అందించడం అభినందనీయమన్నారు. గోవుల పరిరక్షణ, పాడి ఉత్పత్తుల పెంపు కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమన్నారు. టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, గత ఏడాది 38 లారీల ఎండుగడ్డిని అందించగా, ఈసారి 180 లారీల ఎండుగడ్డిని విరాళంగా సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. జగ్గంపేట రైతులు ఉచితంగా ఎండుగడ్డిని అందించడం గొప్ప విషయమని రైతులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా టిటిడి పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ ఎస్వీ గోశాలకు రెండు గోవులు, దూడను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ ్మ, జానకీదేవి, జి. భానుప్రకాశ్ రెడ్డి, ఎన్. సదాశివరావు, శాంతారామ్, దర్శన్, ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవిఎన్ శివకుమార్, ఏవీఎస్వో రమేష్, వైద్యులు డా. భువన, డా. అనిల్, మేనేజర్లు మృదుల, గౌరీ, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి తదితరులు

# మహిళల భద్రతపై శ్రీవారి సేవకులకు అవగాహన



**తిరుమల, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలోని సేవాసదన్‌లో మహిళల భద్రతపై తిరుమల సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీవారి సేవకులు హాజరై మహిళల భద్రతకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై అవగాహన పొందారు. ఈ సమావేశంలో ముఖ్యంగా రహదారి భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు సమగ్రంగా వివరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని హాజరైన వారికి తెలియజేశారు. మహిళలు ఎలాంటి ఆపద పరిస్థితులు ఎదురైనప్పటికీ భయపడకుండా వెంటనే స్పందించి సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాల్సిన విధానం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన టోల్‌ఫ్రీ నంబర్లు, పోలీసు సహాయ సేవల వివరాలను కూడా సమావేశంలో తెలియజేశారు. మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా అనేక నేరాలను ముందుగానే నివారించవచ్చని అధికారులు సూచించారు. శ్రీవారి సేవకులు కూడా యాత్రికుల భద్రతలో భాగస్వాములుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమల ఇన్‌స్పెక్టర్లు, సేవాసదన్ సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యుత్ వినియోగదారుల కోసం నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిది జిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి 12:30 వరకు 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం' నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని వినియోగదారుల సమస్యలపై పరిష్కారం చూపుతారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వినియోగ దారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఇ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 సదవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# 13న విజయవాడలో ఎంఎస్‌ఎంఇల నిర్వాహకులకు అవగాహన సదస్సు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రం లోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులకు పెట్టుబడి మార్కెట్లపై అవగాహన కల్పించేందుకు 13న విజయవాడలో ప్రత్యేక సదస్సు నిర్వహి స్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి సంస్థ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఇలు నిధుల సమీకరణకు బ్యాంకులపై మాత్రమే ఆధారపడకుండా, స్టాక్ మార్కెట్ ద్వారా ఈక్విటీ మూలధనాన్ని సేకరించే అవకాశం పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఎన్‌ఎస్‌ఈ ఎమర్జ్ ద్వారా కంపెనీలు రిటైల్, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి ఈక్విటీ సేకరించవచ్చని వివరించారు. దీనివల్ల వడ్డీలేని పెట్టుబడి లభిస్తుందని, కంపెనీ డెట్-ఈక్విటీ నిష్పత్తి మెరుగుపడి, భవిష్యత్‌లో క్రెడిట్ రేటింగ్ పెరిగేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

# భక్తి ప్రపత్తులతో ఘనంగా జరుగుతున్న హనుమజ్జయంతి మహోత్సవాలు

**గుంటూరు విద్య మే 10 ప్రభాతవార్త** 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు హనుమత్ జయంతి మహోత్సవాలు ఘనంగా ఈ నెల 6 నుండి జరుగుతూ ఉన్నాయని అభయాంజనేయ స్వామి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బండారు సాంబశివరావు వారి పాలకమండలి సభ్యులు తెలిపారు. 6 న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, నుండపారాధన , అంకురారోపణ, అగ్ని ప్రతిష్టాపన, యాగశాల ప్రవేశము, గణపతి హోమము జరిగాయన్నారు. 7 న మైలవరపు సుజన శ్రీ దుర్గమ్మతల్లికోలాట భజన మండలి వారి ఆధ్వర్యంలో కోలాటం , 79 అడుగుల అభయాంజనేయ స్వామివారికి మహా శాంతి కుంభాభిషేకములు, నవగ్రహ శాంతి హోమము జరిగిందన్నారు. 8న 79 అడుగుల అభయాంజనేయ స్వామివారికి మహా శాంతి కుంభాభిషేకములు (2వరోజు), చండీహోమము, మాహా విద్య హోమము, బాలపూజ, సువాసినపూజ జరిగిందనీ పేర్కొన్నారు . 9న 79 అడుగుల అభయాంజనేయ స్వామివారికి మహా శాంతి కుంభాభిషేకములు (3వరోజు), మన్యుప్రత్యంగిర హోమము, సువర్చల సమేత అభయాంజనేయస్వామివారి కళ్యాణం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 10 తేదీ ఆదివారం 79 అడుగుల అభయాంజనేయ స్వామివారికి సామూహికంగా 10 లక్షల తమలపాకులతో అర్చన, సీతారాములవారి కళ్యాణం, శ్రీరామ పట్టాభిషేక ఘట్టం. జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, మాజీ శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి సతీమణి ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కవిత, మాజీ మంత్రి సిద్ధ రాఘవులు, ట్రిబుల్ ఎక్స్ ఎల్ అధినేత మాణిక్యవేల్ తనయుడు ప్రవీణ్ రాజ్, ప్రముఖ వ్యాపారవేత్త మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ తదితరులు పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులను పొంది తీర్థ ప్రసాదాలను అందుకున్నారనీ పేర్కొన్నారు.

# ద్వేష పూరిత పోస్టులు పెట్టవద్దు

## జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు క్రైమ్,మే10,ప్రభాతవార్త:** కడప జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై గుంటూరు జిల్లా పోలీస్ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు ముఖ్యంగా యువతకు కీలక సూచనలు,హెచ్చరికలు ఒక ప్రకటనలో జారీ చేశారు.వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్,ఇతర సోషల్ మీడియా వేదికల్లో మతపరమైన ద్వేషపూరిత సందేశాలు, ఫోటోలు, వీడియోలు లేదా రెచ్చగొట్టే కంటెంట్‌ను షేర్ చేయకూడదని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి మత సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత.మతపరమైన ద్వేషాన్ని ప్రోత్సహించే లేదా అశాంతిని రేకెత్తించే కంటెంట్‌ను పోస్ట్ చేయడం చట్ట ప్రకారం శిక్షార్హమైన నేరం అని స్పష్టం చేశారు."ఒక్క పోస్ట్ సమాజంలో అశాంతిని సృష్టించగలదు పోస్ట్ చేసే ముందు దాని ప్రభావం గురించి ఆలోచించండి." అని ఎస్పీ పేర్కొన్నారు.గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో షేర్ చేసే ప్రతి మెసేజ్‌ను నిశితంగా పరిశీలించాలి.ఏవైనా ద్వేషపూరిత, అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే కంటెంట్ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఆ సందేశాలను తొలగించి, సంబంధిత వ్యక్తులను గ్రూప్ నుండి తొలగించాలి.ఎస్పీ గ్రూప్ అడ్మిన్‌లను హెచ్చరిస్తూ, "బాధ్యతాయుతంగా ఆలోచించండి. బాధ్యతాయుతంగా వ్యవహరించండి.ప్రతి గ్రూప్ అడ్మిన్ తమ గ్రూపులలో చట్టవిరుద్ధమైన కంటెంట్ సర్క్యులేట్ కాకుండా చూసుకోవాలి." అని తెలిపారు.తప్పుడు ప్రచారం,మత ద్వేష పూరిత పోస్టులు, ఫేక్ న్యూస్, మార్ఫింగ్ ఫోటోలు లేదా వీడియోలను సృష్టించే, ఫార్వార్డ్ చేసే లేదా ప్రచారం చేసే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశ్యంతో చేసే ఏ చర్య కూడా క్షమించబడదు.ఏ సోషల్ మీడియా వేదికలైనా సరే, వదంతులను వ్యాప్తి చేయవద్దు. ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు లేదా ఫార్వార్డ్ చేసే ముందు సంబంధిత అధికారుల ద్వారా లేదా విశ్వసనీయ వార్తా సంస్థల ద్వారా వాస్తవాలను ధృవీకరించుకోండి."వదంతులను వ్యాప్తి చేయడం వల్ల ప్రభుత్వ,ప్రజా ఆస్తులకు నష్టం వాటిల్లుతుంది, అంతేకాకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుంది. ఇది సమాజంలో ఘర్షణలకు దారితీయవచ్చు."ఎవరైనా వదంతులు లేదా మత ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే జిల్లా ఎస్పీ లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.ప్రజలు సోషల్ మీడియా వేదికలను ప్రజా సంక్షేమం,సానుకూల సందేశాలు,అవగాహన కార్యక్రమాల కోసం మాత్రమే బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు.ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై సైబర్ క్రైమ్,సాధారణ చట్టాల ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి.

# అనంతలో రాష్ట్ర నేతల హడావుడి

● 12న వైయస్ జగన్... 14న మంత్రి నారా లోకేష్ ● 15న సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ రాక






**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ వారం రోజుల్లో రాష్ట్ర స్థాయి నాయకుల హడావుడి నెలకొంది. సిఎం చంద్రబాబు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ వేరువేరుగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సిఎం పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది. పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి ఎయిర్‌పోర్ట్ సమీపం లో మొదటి విడతలో 350 ఎకరాల విస్తీర్ణంలో విమానాల విడిభాగాల తయారీ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండో విడతలో 650 ఎకరాల్లో ఆ పరిశ్రమను విస్తరించనుంది. ఇందులో భాగంగా విమానాల విడిభాగాల తయారీ కేంద్రంను రామచంద్రంగా శంకుస్థాపన చేసేందుకు ఈనెల 15వ తేదీన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టపర్తికి వచ్చే అవకాశం మెండుగా కనిపిస్తోంది. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటన సంబంధించి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇదే సమయంలో 14, 15 తేదీల్లో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేష్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 14న మధ్యాహ్నం ఆర్డిటి హాస్పిటల్ సందర్శించి, సాయంత్రం అనంతపురం చేరుకొని ఆర్డిటికీ ఎఫ్.సి.ఆర్.ఏ రెన్యువల్ జరిగిన నేపథ్యంలో ఆ సంస్థ నిర్వాహకులు మంచో ఫెర్రర్, అన్నే ఫెర్రర్‌ను మంత్రి లోకేష్ కలవనున్నారు. ఆ తర్వాత అనంతపురంలో అర్బన్ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. మంత్రి లోకేష్ సమావేశం నిర్వహించనున్న సభాస్థలిని విజయవాడ నుంచి వచ్చిన మంత్రి లోకేష్ టీంతో కలిసి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మైదానంలో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. శ్రీనగర్ కాలనీలోని గల్లా టౌన్ షిప్ మైదానం వేదిక సమావేశం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. సమావేశంలో ఎంత మంది పాల్గొంటారు, ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు గురించి చర్చించారు. ఇదిలా ఉండగా మాజీ ముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 12వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నారు. పామిడిలో వైసిపి నేత వీరాంజనేయులు కుమార్తె, ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడి వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించనున్నారు. అయితే ఆరోజు వైసిపి పార్టీ కార్యక్రమాలు అంటూ ప్రత్యేకంగా ఏమీ లేవని, పెళ్లికి వచ్చి వెళతారని వైసిపి నాయకులు చెబుతున్నారు.

# ఎస్సీలకు వర్తించే పథకాలన్నీ బుడగ జంగాలకూ అమలు

● వైసిపి పాలనలో బుడగ జంగాలను పట్టించుకోలేదు ● టిటిడి బోర్డు సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



**అనంతపురం, మే 10 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా బేడ, బుడగజంగాల సామాజికవర్గం ఏళ్లతరబడి ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మడకశిర శాసనసభ్యులు, టిటిడి పాలకమండలి సభ్యులు, శ్రీసత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజు వెల్లడించారు. ఉద్యోగాల్లో తప్ప ఎస్సీలకు వర్తించే అన్ని పథకాలు బేడ, బుడగ జంగాల వారికి వర్తింపజేయాలని ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారని, బుడగ జంగాల వారికి శుభ పరిణామం అన్నారు. అనంతపురం పట్టణంలో బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ఎం.ఎస్.రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బేడ, బుడగజంగాల సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషికి ఎం.ఎస్.రాజును ఆ సామాజికవర్గ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ బేడ, బుడగజంగాల దీర్ఘకాల సమస్యల్ని పరిష్కరించిన ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుండి ఉన్న ఈ సమస్య ఎవరూ పట్టించుకోలేదు. 2014-19 మధ్య కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు దృష్టికి బేడ, బుడగజంగాల సమస్యలను తీసుకెళ్లిన వెంటనే జెసి శర్మ ఏకసభ్య కమిషన్ ను చంద్రబాబు నియమించారు. ఆ జెసి శర్మ కమిషన్ రాష్ట్రంలోని 13జిల్లాల్లో పర్యటించి, వారి జీవన స్థితిగతులను పరిశీలించి, వారి సమస్యలను అధ్యయనం చేసి ఆ రిపోర్టును కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు అందజేసింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం జేసీ శర్మ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి తీర్మానం పంపించింది. బేడ, బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రాన్ని ఆ తీర్మానం ద్వారా కోరింది. తదనంతరం ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల తన పాలనలో బుడగ జంగాల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదు. పులివెందుల నుండి ఇచ్ఛాపురం వరకు బుడగ జంగాల సమస్యలపై సైకిల్ యాత్ర చేసినా కన్నెత్తి చూడలేదు. బేడ, బుడగజంగాల హక్కులకు జీఓ144 గొడ్డలిపెట్టుగా మారింది. 2024లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వచ్చినప్పటి నుండి బుడగ జంగాల సమస్యలను ఎప్పటికప్పుడు సిఎం దృష్టికి తీసుకెళ్తానే ఉన్నాం. ఇటీవల నిర్వహించిన జిల్లా కలెక్టర్ల 7వ సమావేశంలో సిఎం చంద్రబాబు బుడగ జంగాల సమస్యల్ని పరిష్కరించడానికి చేసిన ప్రకటన ఒక అద్భుత ఘట్టం. ఉద్యోగాల విషయంలో తప్ప, ఎస్సీలకు వర్తింపజేసే పథకాలన్నీ బుడగ జంగాలకు వర్తింపజేయాలని అధికారులకు సిఎం ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే సమయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి , దళిత ఎమ్మెల్యేగా నేను బుడగజంగాలను ఎస్సీ జాబితాలో ఉపకులంగా చేర్చాలని సీఎం చంద్రబాబు ని కోరాం. చంద్రబాబు ఆ మేరకు ఒప్పుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి బుడగ జంగాలకు ఎస్సీ హోదా వచ్చిన వెంటనే రాష్ట్రంలో దళితులకు అమలయ్యే రిజర్వేషన్ వారికి కూడా వర్తింపజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉంది. బుడగ జంగాల సమస్యను కేంద్రంతో మాట్లాడి పరిష్కరించేందుకు కూడా చంద్రబాబుగారు సిద్ధంగా ఉన్నారు. త్వరలోనే శుభవార్త వింటాం అనే నమ్మకం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బుడగ జంగాల సామాజికవర్గం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ఎం.ఎస్.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగజంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యలమర్తి మధు, తదితరులు ఉన్నారు.

# దుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

**ఇంద్రకీలాద్రి, మే 10, ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోటానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా దర్శనమయ్యేలా ఇఒ వికె శీనా నాయక్ నేతృత్వంలో అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు అంతరాలయ దర్శనాలు నిలిపివేసి త్వరితంగా దర్శనమయ్యే ఏర్పాట్లు చేశారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం అన్నదానం పథకానికి, విశాఖపట్నంకి చెందిన సిహెచ్ దుర్గాప్రసాద్ రూ.1లక్ష విరాళాన్ని ఆదివారం అందించారు. విజయవాడకు చెందిన మరో దాత లక్ష్మీప్రసన్న తమ కుటుంబీకులతో కలిసి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001 విరాళమందించారు.

తెనాలికి చెందిన కె.మాధవరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,116ల విరాళం అందించారు. విజయవాడకు చెందిన డి శ్రీనివాస రావు తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,116ల విరాళాన్ని ఆదివారం నిత్యాన్నదాన పథకానికి అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# భక్తులపై తేనెటీగల దాడి.. 14మందికి గాయాలు

**పెనగలూరు, మే 10 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం దామచెర్ల అటవీ ప్రాంతంలోని నక్క శిల్ప గుర్రప్ప స్వామి దేవస్థానానికి భక్తులు దర్శనార్థం వెళ్లి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అక్కడే భోజనాలు వండుకుంటూ ఉండగా ఉదయం 11.00 గంటల సమయంలో అకస్మాత్తుగా తేనెటీగలు భక్తులపై దాడి చేసింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్న పిల్లలు, ఐదుగురు మహిళలు సహా 14 మంది గాయపడ్డారు.

సమాచారం అందుకున్న వెంటనే పెనగలూరు, చిట్వేల్ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే అంబులెన్సుల ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నది. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించి వైద్యుల ద్వారా చికిత్స వివరాలు తెలుసుకున్నారు.






# ప్రజల రుణం తీర్చుకుంటా

● నెల్లూరు సుందరీకరణే లక్ష్యం: మంత్రి నారాయణ

● మహానాడుపై వైసిపి నేతల విమర్శలు హాస్యాస్పదం

**నెల్లూరు, మే 10 ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు సిటీని సుందరంగా తీర్చిదిద్దమే లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలో 40 లక్షలతో ఈ ఆటో ఛార్జింగ్ స్టేషన్ ప్రహరి గోడకు శంకుస్థాపన చేసిన మంత్రి నగరానికి వచ్చిన 200 ఈ ఆటోలను ఈ నెలాఖరుకల్లా ప్రారంభిస్తామని తెలిపారు. 1.40 కోట్లతో రేబాల వారి వీధిలో నిర్మిస్తున్న పార్కును, ఏసీ ఫంక్షన్ హాల్, అత్యాధునిక జిమ్ పనులను పర్యవేక్షించారు. ఎన్నికల సమయంలో ఒక బాలుడికి ఇచ్చిన మాట మేరకు ఈ పార్కును అద్భుతంగా తీర్చిదిద్దుతున్నానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి తెలిపారు. మహానాడు వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను మంత్రి తప్పు పట్టారు. మహానాడు నిర్వహణ పూర్తిగా తమ పార్టీ అంతర్గత విషయమని, నెల్లూరులో ఇప్పటి వరకు నిర్వహించని కారణంగానే తమ అభ్యర్థన మేరకు ఈ ఏడాది ఇక్కడ నిర్వహిస్తున్నారని, దీనిపై ఇతరుల వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ మంత్రి నారాయణ నేత్రజ్యోతి ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ షఫియ, టీడీపీ ముఖ్య నేతలు ముజీర్, జహీర్, షాహీద్, జమీర్, తిరుమల నాయుడు, బీసీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు జీవితంలో ఎలా రాణించాలో నేర్పుతాయి

● ఎపి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

**విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి క్రీడాకారుడు ఛాంపియన్ కాలేక పోయినా, ఆటలు జీవితంలో ఎలా రాణించాలో నేర్పుతాయని సి రాఘవాచారి ఎపి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో "యూత్ స్పోర్ట్స్ రిక్రియేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా టెన్నిస్ పోటీలలో విజేతలను ఉద్దేశించి ఆయన ఆదివారం ప్రసంగించారు. క్రీడలు జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరుచుకోవడానికి, వాటిని సాధించడానికి పట్టుదలతో, క్రమశిక్షణతో పనిచేసేందుకు దోహద పడతాయని ఆయన అన్నారు. క్రీడాకారులుగా ఎదిగే ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాల్ని నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆధునిక యుగంలో క్రీడాకారులందరూ తమకు అందుబాటులో వున్న స్పోర్ట్స్ ఛానెల్స్ ద్వారా తమ ప్రతిభకు పదునుపెట్టుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. టెన్నిస్ వంటి పవర్ గేమ్‌కు సరైన ప్రోత్సాహం అవసరమన్నారు. స్పాన్సరర్లు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశంలో క్రికెట్‌కు ఉన్నంత ప్రోత్సాహం మరే ఇతర క్రీడకు లేకపోవడం సరైందికాదని అన్నారు. క్రీడల పట్ల ఈ తరం పిల్లల్ని ప్రోత్సహిస్తున్న సీనియర్ టెన్నిస్ కోచ్ దుర్గాకుమార్ వంటి వ్యక్తులు అభినందనీయులని ఆయన ప్రశంసించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు. "యూత్ స్పోర్ట్స్ రిక్రియేషన్ ట్రస్ట్ అధ్యక్షులు ఎస్. దుర్గా కుమార్ మాట్లాడుతూ, ఆరు విభాగాలుగా క్రీడాకారులకు పోటీలు ప్రతినెలా, రెండో ఆదివారం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్పాన్సరర్లు లేకుండా, కేవలం వ్యక్తిగతంగానే ఈ పోటీల నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. టెన్నిస్ క్రీడ పట్ల తమకున్న మక్కువతో పుస్తకాలు రచించామని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక దశలో వున్న టెన్నిస్ క్రీడాకారులకు సరైన మార్గనిర్దేశం చేయడం తమ అభిమతమని అన్నారు. కోచ్ శ్రీనివాస రావు, సామాజిక వేత్త అనురాధ, పలువురు క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎపి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్

# శ్వాస ఆడకనే మాజీ ఐపిఎస్ సతీమణి మృతి

పోస్టుమార్టం నివేదికలో వెల్లడించిన వైద్యులు

నిందితులు తప్పించుకొనేందుకు చిక్కిన సమయం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 10, ప్రభాతవార్త:** మాజీ ఐపిఎస్ వినయ్ రంజన్ రే సతీమణి తనూజ రంజన్(62) శ్వాస ఆడకనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిందితులు నోట్లో గుడ్డలు కుక్కడంతో శ్వాస ఆడక(అస్‌ఫిక్సియా) మృతిచెందిందని వైద్యులు ప్రాథమికంగా అందించిన శవపంచానామాలో తేల్చారు. నోట్లో రక్తంతో తడిసిన గుడ్డ, మణికట్టుపై బంధించిన గుర్తులు, నాలుక కొనపై కొరికిన గాయాలు ఉన్నట్లు ఆయా నివేదికలో వైద్యులు నిర్ధారించారు. ఆమె కాళ్లు, చేతులు బంధించి, నోట్లో గుడ్డలు కుక్కడం వల్ల ఊపిరి ఆడకపోవడం, భయంతో ఆమె మృతిచెందినట్లు ధృవీకరించారు. ఇవే అంశాలను వైద్యులు శవపంచానామాలో ప్రాథమికంగా తెలిపారని జూబ్లీహిల్స్ డివిజన్ ఇంఛార్జి ఎసిపి సామల వెంకటరెడ్డి తెలిపారు. మరోవైపు హత్య, దోపిడి అనంతరం దుండగులు పారిపోయే సమయంలో సెల్‌ఫోన్లు పారేసి పోయారనేది అవాస్తవమన్నారు. కల్పనతో పాటు మరో ముగ్గురు నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు నిందితుల కోసం పోలీసులు బృందాలుగా అన్ని దిక్కుల్లో వెదుకుతున్నారు.

**నిందితులకు చిక్కిన సమయం**

సంఘటన జరిగిన రోజున గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.38 గంటలకు ముగ్గురు అగంతకులు వినయ్ రంజన్ రే నివాసంలోకి చేతిలో ఇనుప రాడ్లు, ముఖానికి నల్లని మాస్కులు ధరించి ప్రవేశించారు. అనంతరం దాదాపు గంట 20 నిమిషాల తరువాత అంటే 2.58 గంటలకు ముందు కల్పన ఒక సంచితో, వెనుక ఉన్న ముగ్గురిలో చివరి వ్యక్తి మరో సంచితో వెనుకవైపు నుంచి వెళ్లినట్లు ఇప్పటికే పోలీసులకు లభించిన సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. తనూజ రంజన్‌ను బంధించడం, ఇంట్లోని బీరువాలను, లాకర్లను పగులగొట్టేందుకు విఫల యత్నం చేశారు. దీనికితోడు తనూజ రంజన్ చేతి వేళ్లకు ఉన్న ఉంగరాలు, మెడలోని పుస్తెలతాడు, మరో బంగారు గొలుసు, చెవి పోగులు తీసుకోవడానికి వారికి సమయం పట్టి ఉం టుందని నేరస్థలాన్ని పరిశీలించిన ఒక పోలీసు అధికారి తెలిపారు. తనూజ అర్ధరాత్రి 2 గంటల తర్వాత మృతి చెందగా ఉదయం 10 గంటల వరకు ఈ విషయాన్ని కుటుంబసభ్యులు గుర్తిం చలేక పోయా రు. ఇంట్లో జరిగిన సంఘటనను గుర్తించడానికి దాదాపు 8 గంటల సమయం పట్టింది. వారు అనుకున్న ప్రాంతానికి అను కున్నట్లుగా వెళ్లడమే కాకుండా నగరాన్ని వదిలి వెళ్లిపోవడానికి అవకాశం చిక్కినట్లైంది. నిందితులు ఆటోలో నాంపల్లికి అక్కడి నుంచి రైలులో నాగపూర్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. నిం దితులు ఎక్కడికి వెళ్తారనే అంశంపై పోలీసులు లోతుగా దృష్టి పెట్టారు. ముంబైలో ఆశ్రయం ఇచ్చేవారిపై ఇప్పటికే దృష్టి పెట్టారు. అలాగే అక్కడి నుంచి చాలా వరకు నేరస్థులు బీహార్‌ను దాటుకొని జానకీపూర్‌కు వెళ్తారని, అక్కడ బంగారం కరిగించే అనేక పరిశ్రమలు ఉన్నాయని, బంగారాన్ని అక్కడ కరిగించి అనంతరం అక్కడి నుంచి హద్దులు దాటి నిందితులు తమ సొంత ఊర్లకు వెళ్లే అవకాశం ఉందని ఇదే తరహా నేరపరిశోధనలో పాల్గొన్న ఒక పోలీసు అధికారి తెలిపారు. నిందితులను సరిహద్దు దాటకముందే పట్టుకోవాలని పోలీసు శాఖ భావించి అందుకు తగిన విధంగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే కల్పనతోపాటు ఉన్న నిందితులను సైతం పోలీసులు గుర్తించారు. కల్పనతోపాటు సురేష్‌సాయి అనే నిందితుడు, మరో ఇద్దరు నిందితులు ఉన్నట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. నలుగురి జాడను గుర్తించేందుకు సాంకేతికంగా అన్ని ప్రయ త్నాలు చేస్తున్నామని ఒక దర్యాప్తు అధికారి వివరించారు.


మాజీ ఐపిఎస్ నివాసం వద్ద విచారిస్తున్న పోలీసులు(ఫైల్)

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్

విజయవాడ, మే 10 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన ఎంపి, మంత్రి పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన బిజెపి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేంద్ర మంత్రి కుమారుడు బండి సాయి భగీరథ్‌పై 17 ఏళ్ల మైనర్ బాలికను లైంగికంగా వేధించినందుకు తెలంగాణలోని బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. బిజెపి హయాంలో మహిళల భద్రత గాలిలో దీపంలా మారింది. బేటీ బచావో- బేటీ పడావో వంటి నినాదాలు కేవలం ఎన్నికల ప్రసంగాలకు, ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యాయి. సొంత పార్టీ నేతల కుటుంబ సభ్యులే ఇలాంటి అమానుష ఘటనలకు పాల్పడుతుంటే, మహిళా రక్షణ గురించి మాట్లాడే నైతిక హక్కు బిజెపికి ఎక్కడుంది? అని ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఈ ఘటనపై బిజెపి అగ్రనాయకత్వం మౌనం వహించడం వారి రాజకీయ కపటత్వాన్ని, నేరస్థులను వెనకేసుకొచ్చే ధోరణిని స్పష్టం చేస్తోందని విమర్శించారు. కేంద్ర మంత్రి పదవిలో బండి సంజయ్ కొనసాగడం వల్ల విచారణ సజావుగా సాగదని, అధికార బలంతో సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. బాధితురాలికి న్యాయం జరగాలంటే రాజీనామా ఒక్కటే మార్గమని ఈశ్వరయ్య స్పష్టం చేశారు.

# మహారాష్ట్ర పోలీసుల మెరుపు దాడి
# అదుపులో నలుగురు మావోయిస్టులు

వికారాబాద్ జిల్లా రుక్మాపూర్‌లో

రైల్వే కూలీలుగా క్వార్టర్స్‌లో షెల్టర్

గడ్చిరౌలి పోలీసుల సోదాలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 10, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ రైల్వేస్టేషన్ పరిసరాల్లో తలదాచుకున్న నలుగురు మావో యిస్టులను మహారాష్ట్ర పోలీసులు మెరుపుదాడులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున మహారాష్ట్ర, తెలంగాణ పోలీసులు దాడులు జరపగా నలుగురిలో ఓ మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు. వారు 10 రోజుల క్రితమే రైల్వే పనుల్లో కూలీలుగా చేరినట్లు తెలిసింది. 40 మంది ఛత్తీస్‌ఘడ్ కూలీలతో పాటు మావోయిస్టులు స్థానికంగా శిథిలావస్థకు చేరిన రైల్వేక్వార్టర్స్‌లో ఉంటున్నారు. మహారాష్ట్రలోని గచ్చిరౌలి జిల్లా పోలీసులకు కచ్చితమైన సమాచారం రావడంతో దాడులు చేపట్టారు. ఓ ఉన్నతాధికారి సహా 15 మంది సాయుధ పోలీసు బలగాలు పక్కా సమాచారంతో రెండు వాహనాల్లో తాండూరు చేరుకున్నాయి. స్థానిక పోలీసుల సహకారంతో తెల్లవారు జామున పెద్దేముల్ మండలం రుక్మాపూర్ రైల్వేస్టేషన్ పరిసరాల తమ అధీనంలోకి తీసుకున్నారు. ఉదయం కూలీలు కాలకృత్యాలు తీర్చుకునే వేళలో ఒక్కసారిగా పోలీసులు వారందరినీ కూర్చో బెట్టారు.

ఇటీవల మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన మావోయిస్టును కూడా వెంట తీసుకు వచ్చారు. అక్కడ ఉన్న కూలీల్లో నలుగురు మావో యిస్టులను పేర్లతో సహా గుర్తు పట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి ఆయుధాలు లేకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఆపరేషన్ కగార్ తర్వాత పలువురు మావోయిస్టులు షెల్టర్ జోన్లలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తున్నది. కూలీలుగా చేరిన మావోయిస్టులను అదుపులోకి తీసుకోవడంతో సహచర కూలీలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ దాడుల్లో గచ్చిరౌలి పోలీసులతోపాటు వికారాబాద్ జిల్లాకు చెందిన పలువురు పోలీసు అధికారులు, సాయుధ పోలీసులు పాల్గొన్నారు. అయితే, తెలంగాణ పోలీసులను సుమారు 150 అడుగుల దూరంలో ఉంచి మిగిలిన తతంగం మహారాష్ట్ర పోలీసులు పూర్తి చేసినట్లు సమాచారం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మావోయిస్టులను పట్టుకున్నట్లు తెలుస్తోంది. వారు ఇక్కడికి ఎలా వచ్చారనే వివరాలపై రైల్వే కాంట్రాక్టర్‌ను విచారించే అవకాశాలు ఉన్నాయి. సుమారు పదేండ్లుగా తాండూరు ప్రాంతంలో బీహార్, ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన చాలామంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. నాపరాయి, సిమెంట్ కర్మాగారాలే కాకుండా హమాలీలుగా కూడా పని చేస్తున్నారు. స్థానిక కూలీలకు ఇచ్చే రేట్లు గిట్టుబాటు కాకపోవడం, వారు వేళకు సరిగ్గా పనిచేయడం లేదనే కారణం వల్ల పొరుగు రాష్ట్రాల కూలీలకు పనులు కల్పిస్తున్నారు. వరి కోత సమయంలో రైస్‌మిల్లుల వద్ద బీహార్, ఛత్తీస్‌గఢ్ హమాలీలు ఎక్కువగా పని చేస్తుంటారు.

# ఆర్టీసి బస్సును ఢీకొట్టిన కారు

● భార్య దుర్మరణం, భర్త పరిస్థితి విషమం



**చంద్రగిరి, మే 10 ప్రభాతవార్త:** అధిక వేగం ప్రమాదకరమనే పోలీసు హెచ్చరికను పెడచెవిన పెట్టిన పాపానికి మూల్యం చెల్లించిన దుర్ఘటన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం తొండవాడ స్వర్ణముఖీ నది వంతెనపై ఆదివారం చోటు చేసుకుంది. సిఐ సురేష్‌కుమార్ వివరాల మేరకు.. తిరుపతిలో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సుగుణలత, ఆమె భర్త విజెఎంఎస్ రాజు ఐరాల నుండి తిరుపతికి కారులో వస్తున్నారు. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై తొండవాడ హైవే స్వర్ణముఖీ వంతెన వద్దకు చేరుకునే క్రమంలో అధికవేగంతో వస్తున్న రాజు కారు అదుపుతప్పి డివైడర్‌ను అధిగమించి అటు వైపు తిరుపతి నుండి వస్తున్న ఆర్టీసి బస్సును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా సుగుణలత (52) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో రాజు తీవ్రగాయాలతో విషమ పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. 108 ద్వారా రాజును తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## లెక్క సరిపోయిందా?




**ఉర్విల్ పటేల్..** ఈ అన్‌క్యాప్డ్ ప్లేయర్ చెన్నైలో విధ్వంసం సృష్టించాడు. సంజూ శాంమ్సన్ అవుటైనపుడు క్రీజ్‌లోకి వచ్చిన ఉర్విల్... సంజూ ప్లేస్‌ను సక్సెస్‌ఫుల్‌గా భర్తీ చేశాడు. ఎదురుగా బౌలింగ్ ఎండ్‌లో అవేష్ ఖాన్. వస్తూనే మొదటి బంతికి సిక్స్. అవేష్ తేరుకునే లోపే ధనాధన్ మరో రెండు సిక్స్‌లు. ఎదుర్కొన్న తొలి మూడు బంతుల్లోనే సిక్స్‌ల హోరు. దీంతో అవేష్ 25 పరుగులిచ్చుకున్నాడు. ఆ తర్వాత కూడా అవేష్ సిక్స్‌లతో ఎంఎ చిదంబరం స్టేడియం హోరెత్తింది. దిగ్వేష్ రాఠీ ఓవర్లోనూ బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు, ఆ తర్వాత ఫోర్, మరో సిక్స్... ఇలా బెదంగొడుతూ మరో 25 రన్స్ పిండుకున్నాడు. షమీ బంతిని స్టాండ్స్‌లోకి పంపిన ఉర్విల్.. ఐపీఎల్ చరిత్రలో రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదుచేశాడు.

కేవలం 13 బంతుల్లోనే ఓ ఫోర్, ఏడు సిక్స్‌లతో అర్ధ సెంచరీ కంప్లీట్ చేశాడు. 2023లో కేకేఆర్‌పై రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ యశస్వీ జైస్వాల్ కూడా 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. ఇప్పటివరకు యశస్వీ పేరిట ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. ఇక షాబాజ్ వేసిన మరో ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ ఫోర్, సిక్స్ బాదిన ఉర్విల్...షాబాజ్ వేసిన మరో ఓవర్లో అవుటయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చింది మొదలు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఉర్విల్ 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో 65 పరుగులు చేశాడు. రెండో వికెట్‌కు రుతురాజ్ గైక్వాడ్‌తో 34 బంతుల్లోనే 81 రన్స్ జోడించాడు. ఐపీఎల్‌లో ఉర్విల్‌కు ఇది తొలి హాఫ్ సెంచరీ. ఉర్విల్‌కు ఇది రెండో ఐపీఎల్ సీజన్. గత సీజన్‌లో మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడే అవకాశం లభించగా, ఈ సీజన్‌లో ఇది నాలుగో మ్యాచ్. ఈసారి వచ్చిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుంటున్నాడు.

ఆట

## ప్లే ఆఫ్ ఆశలు సజీవం

# చెన్నై హ్యాట్రిక్ విజయం



**చెన్నై:** సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ చెలరేగింది. 203 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా చేధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌పై 5వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించింది. మొత్తానికి ఆరో విజయంతో రాజస్థాన్ రాయల్స్‌ను కిందికి నెట్టి పాయిట్ల పట్టికలో అయిదో స్థానానికి చేరింది. ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. మిగతా మూడు మ్యాచ్‌ల్లో చెన్నై గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్ ఖాయం. ఇక లక్నో సూపర్ జెయింట్స్ ఖాతాలో మరో ఓటమి చేరింది. 6పాయింట్లతో అట్టడుగున నిలిచింది. ఇప్పటికే ప్లే ఆఫ్‌కు దూరమైంది.

భారీ లక్ష్య ఛేదనకు సీఎస్‌కే ధాటిగానే ఆరంభించింది. తొలి ఓవర్లో సంజూ(28), గైక్వాడ్(42) చెరో బౌండరీ బాదారు. ప్రిన్స్ యాదవ్ తొలి ఓవర్లోనూ ఒకే సిక్స్ సాధించారు. ఇక మొదట బౌండరీ, ఆ తర్వాత సిక్స్ బాదిన సంజూను తర్వాతి బంతికి రాఠీ క్లీన్ బౌల్డ్ చేశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఉర్విల్ పటేల్(65) పూనకం వచ్చినట్లు ఊగిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి, విజయానికి గట్టి పునాది వేశాడు.

మధ్యలో సీఎస్‌కే కాస్త తడబాటుకు లోనైంది. సునాయాసంగా గెలుస్తుందనుకుంటే, మ్యాచ్‌ను చివరి వరకు తీసుకొచ్చింది. చివరి ఓవర్ తొలి రెండు బంతులకు శివమ్ దూబే (15 నాటౌట్) సిక్సర్లు బాది సీఎస్‌కేను గెలుపందించాడు. ఈ మ్యాచ్‌లో లక్నో చాలా క్యాచ్‌లు జారవిడిచి మూల్యం చెల్లించుకుంది. లక్నో బౌలర్లలో దిగ్వేష్, షాబాజ్ రెండేసి వికెట్లు తీశారు.




అంతకుముందు మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(33 బంతుల్లో 85; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు).. మిచల్ మార్ష్(10)తో కలిసి ఆదిరే ఆరంభం ఇచ్చాడు. నాలుగో ఓవర్లోనే 50 మార్కు దాటించాడు. గత మ్యాచ్ సెంచరీ హీరో మిచెల్ మార్ష్ ఈసారి నిరాశపరిచినా, అతని స్థానంలో వచ్చిన నికోలస్ పూరన్(1)తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరినా... జోష్ ఇంగ్లిస్ జోరు తగ్గలేదు. బంతులను స్టాండ్స్‌ల్లోకి పంపిస్తూ చెన్నై బౌలర్లను బెంబెలెత్తించాడు. అతని ధాటికి పవర్ ప్లే మొదటి ఆరు ఓవర్లలోనే 91 రన్స్ వచ్చాయి. ఈ క్రమంలో 17 బంతుల్లోనే 6 ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతే ధాటిగా ఆడుతూ సెంచరీ చేసే ఊపులో కనిపించాడు. చివరకు ఇంగ్లిస్ జోరుకు ఓవర్టన్ అడ్డుకట్ట వేశాడు. కీపర్ క్యాచ్ ద్వారా పెవిలియన్‌కు పంపాడు. 112 పరుగుల వద్ద జోష్ ఇంగ్లిస్ అవుటైన తర్వాత లక్నో మిడిల్ ఆర్డర్ ఒక్కసారిగా తడబడింది. ఓవర్టన్, అన్షుల్ కంబోజ్.. లక్నో సూపర్ జెయింట్స్ మిడిలార్డర్‌కు బ్రేకులు వేశారు. కెప్టెన్ రిషబ్ పంత్(15), మార్క్‌రమ్(6), రఘు వంశీ(18) నిరాశపరిచారు.

డెత్ ఓవర్లలో షాదాబ్ అహ్మద్(43 నాటౌట్), హిమ్మత్ సింగ్(17) డెత్ ఓవర్లలో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. ఓవర్టన్ వేసిన 19వ ఓవర్లో రెచ్చిపోయిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 4, 6, 4 కొట్టాడు. హిమ్మత్ సింగ్(17)తో కలిసి షాదాబ్ ఏడో వికెట్ అర్ధ శతకం భాగస్వామ్యం నమోదు చేశాడు. కంబోజ్ వేసిన చివరి ఓవర్లో ఆఖరి బంతిని షాదాబ్ సిక్సర్‌గా మలవగా లక్నో స్కోర్ రెండొందలు దాటింది. చెన్నై బౌలర్లలో ఓవర్టన్ మూడు వికెట్లు, అన్షుల్ కంబోజ్ రెండు వికెట్లు, నూర్ అహ్మద్ ఓ వికెట్ పడగొట్టారు.

# చివరి ఓవర్ ఉత్కంఠ - ఆర్సీబీ గెలుపు




**రాయ్‌పూర్:** ఆర్సీబీ ఓడుతూ ఓడుతూ నెగ్గింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ రెండు వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలుపొందింది. 167పరుగుల లక్ష్య చేధనలో టాప్ ఆర్డర్ మరోసారి తడబడింది. కృనాల్ పాండ్యా(73) ఒంటరిపోరాటంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠ రేపింది. చివరి ఓవర్లో 15 పరుగులు చేయాల్సిన దశలో రాజ్‌భవా ఒత్తిడికి లోనయ్యాడు. అయితే మూడో బంతికి షెఫర్డ్‌ను అవుట్ చేశాడు. 3బంతుల్లో 9 పరుగులు ఈదశలో వస్తూనే భువనేశ్వర్ సిక్స్ బాదాడు. తరువాతి బంతికి సింగిల్ తీశాడు. చివరి బంతికి రెండు రన్స్ చేయాల్సిన దశలో రసిఖ్ బౌలర్‌దిశగా ఆడి వేగంగా పరుగులు పూర్తి చేసి ఆర్సీబీకి అద్భుత విజయాన్ని అందించాడు. ఈ విజయంతో ఆర్సీబీ ఖాతాలో ఏడో గెలుపు చేరింది. 14 పాయింట్లతో నిలిచింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్... బెంగళూర్ బౌలర్ల ధాటికి ఆరంభం నుంచే తడబడింది. ముఖ్యంగా భువనేశ్వర్ కుమార్ ముంబైను దెబ్బతీశాడు. తొలి ఓవర్ చివరి బంతికి రికల్టన్(2)ను అవుట్ చేసి ముంబైకు మొదటి ఝలక్ ఇచ్చాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ(22) రెండు ఫోర్లు, రెండు సిక్సులతో ఊపుమీదున్నట్లు కనిపించాడు. అయితే భువీ తన రెండో ఓవర్ అయిదో బంతికి రోహిత్‌ను కీపర్ క్యాచ్‌ద్వారా పెవిలియన్ చేరాడు. క్రీజ్‌లోకి వచ్చఇన కెప్టెన్ సూర్యకుమార్ ను తరౌతి బంతికే డకౌట్‌గా ఔట్‌చేశాడు. దీంతో ముంబై 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

**ఆదుకున్న నమన్, తిలక్**

కష్టాల్లో పడ్డ ముంబైను నమన్ ధీర్(32 బంతుల్లో 47), తిలక్ వర్మ(42 బంతుల్లో 57) ఆదుకున్నారు. ఇద్దరూ ఆచితూచి ఆడుతూ మధ్యమధ్యలో బౌండరీలతో స్కోరును ముందుకు నడిపారు. నాలుగో వికెట్‌కు 82 రన్స్ జోడించడమే గాక స్కోరును వంద దాటించారు. ఆ తర్వాత ముంబై వేగంగా వికెట్లు కోల్పోయింది. నమన్‌ధీర్‌ను రసిఖ్ క్లీన్ బౌల్డ్ చేయగా, విల్ జాక్స్(10)ను షెపర్డ్ పెవిలియన్ చేర్చాడు. మరోవైపు అర్ధసెంచరీతో ఊపు మీదున్న తిలక్ వర్మను భువనేశ్వర్ అద్భుత బంతితో ఔట్ చేసి భారీ దెబ్బకొట్టాడు. దీంతో ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులే చేయగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ 4 వికెట్లు తీయగా... హేజిల్ వుడ్ , సలామ్ దర్, షెఫార్డ్ తలా ఒక వికెట్ పడగొట్టారు.






## ఆసియా క్రీడలకు లాహిరి, ఈశ్వా క్వాలిఫై

హైదరాబాద్, మే 10(వార్త క్రీడా ప్రతినిధి): ఆసియా క్రీడలకు తెలంగాణ సెయిలర్లు కొమరవెల్లి లాహిరి, సురగాని ఈశ్వా అర్హత సాధించారు. భారత యాటింగ్ సమాఖ్య నిర్వహించిన ఆసియా క్రీడల సెలక్షన్ ట్రయల్స్‌లో లాహిరి, ఈశ్వా.. ఈఆర్ఎస్ యూత్ కేటగిరిలో అగ్రస్థానంలో నిలిచారు. లాహిరి, ఈశ్వా అంతర్జాతీయ ట్రైనింగ్ సర్క్యూట్‌కు ఎంపికయ్యారని.. జులైలో ప్రకటించే భారత తుది జట్టులో చోటు దక్కించుకోవడం లాంఛనమని హైదరాబాద్ సెయిలింగ్ క్లబ్ అధ్యక్షుడు సుహీమ్ షేక్ చెప్పారు. లాహిరి స్వస్థలం సిద్ధిపేట, ఈశ్వా సొంత ఊరు చిలుకూరు. లాహిరిది పేద కుటుంబం. కొవిడ్ సమయంలో లాహిరి తల్లి.. సెయిలింగ్ క్లబ్‌లో వంట చేసేది. ఆ సమయంలోనే లాహిరికి సెయిలింగ్‌పై ఇష్టం ఏర్పడింది. మరోవైపు ఈశ్వాకు తండ్రి లేడు. ఆమె తల్లి మాధవి ఒక కర్మాగారంలో రోజు కూలీగా పని చేస్తోంది. సెయిలింగ్‌ను ఇష్టపడడంతో ఆమె కుమార్తెను హైదరాబాద్ క్లబ్‌కు తీసుకొచ్చింది. ఎంతోమంది పేద క్రీడాకారులను సెయిలర్లుగా మలిచిన హైదరాబాద్ సెయిలింగ్ క్లబ్.. ఈశ్వాకు కూడా అవకాశం ఇచ్చింది. కొన్నాళ్లుగా జాతీయ స్థాయిలో లాహిరి, ఈశ్వా స్థిరంగా రాణిస్తున్నారు.

# నాలుగు కంపెనీల్లో లక్ష కోట్లు ఆవిరి




**ముంబయి, మే 10:** ఈక్విటీ మార్కెట్లలోని టాప్ పది కంపెనీల్లో నాలుగుకంపెనీల మార్కెట్ విలువలు రూ.1 లక్షకోట్లు క్షీణించాయి. వీటిలో స్టేట్‌బ్యాంకు ఎక్కువ నష్టపోయింది. ఎస్‌బిఐ మార్కెట్ క్యాప్ రూ.44,722.34 కోట్లు క్షీణించి రూ.9,41,107.62కోట్లకుచేరింది. భారతి ఎయిర్‌టెల్ విలువలు కూడా 31,167.1 కోట్లు క్షీణించి రూ.11,18,055.03 కోట్లకు చేరింది. టిసిఎస్ విలువలు కూడా రూ.28,456.26 కోట్లు తగ్గి రూ.8,66,477.69కోట్లకు చేరాయి. ఎల్‌అండ్‌టి కూడా రూ.5371.84కోట్లు క్షీణించి రూ.5,46,621.21 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మార్కెట్‌క్యాప్ రూ.15,425.09 కోట్లు పెరిగి రూ.12,02, 699.26 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ మార్కెట్ విలువలు కూడా రూ.11,486.89 కోట్లు పెరిగి రూ.5,94,610 కోట్లకు చేరితే హిందూస్థాన్ యూనిలీవర్ రూ. 8763.97 కోట్లు పెరిగి రూ.5,37,562.98 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 6563.28 కోట్లు పెరిగి రూ.19,42, 866.58 కోట్లకు పెరిగింది. ఎల్ఐసి సంస్థ కూడా రూ.2751.37 కోట్లుపెరిగి రూ.5,07,549.44 కోట్లుగా ఉంది. ఐసిఐసిఐబ్యాంకు మార్కెట్ విలువలు కూడా రూ.1694.61 కోట్లుపెరిగి రూ.9,06,675.39 కోట్లుగా ఉంది. రిలయన్స్ టాప్ సంస్థల్లో అగ్రగామిగా నిలిస్తే వరుసగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిబ్యాంకు, టిసిఎస్, బజాజ్‌ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసి సంస్థలు నిలిచాయి.

# మార్కెట్‌లోకి ఒకేసారి పది కొత్త ఫండ్స్




**ముంబయి, మే 10:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఒకేసారి 10 కొత్త పథకాలు ప్రారంభం అయ్యాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా 7 కొత్త స్కీమ్స్ లాంచ్ కాగా మరో 3 స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లు ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్ హౌస్‌లు తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను పూరించేందుకు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫండ్స్ లాంచ్ చేస్తున్నాయి.

ఈసారి తీసుకొచ్చిన కొచ్చిన కొత్త ఫండ్స్‌లో నాలుగు ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్, రెండు ఇండెక్స్ ఫండ్స్, ఒక కాంట్రా ఫండ్ ఉన్నాయి. ఇక ఎస్ఐఎఫ్ ఫండ్స్ రెండు వేరు వేరు కేటగిరీల నుంచి వస్తున్నాయి. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచే రెండు కొత్త స్కీమ్స్ లాంచ్ అయ్యాయి. ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ కేట గిరీ నుంచి నాలుగు కొత్త ఫండ్స్ ఉన్నాయి. ఇందులో ఎడెల్వాయిస్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 14వ తేదీతో ముగు స్తుంది. ఎస్‌బిఐ నిఫ్టీ 200వాల్యూ 30ఈటీఎఫ్ ఎస్‌బీఐ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 18వ తేదీతో ముగుస్తుంది. ఇక గ్రో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఈటీఎఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 20వ తేదీతో ముగుస్తుంది.

యాక్సిస్ నిఫ్టీ క్యాపిటల్ మార్కెట్స్ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 15వ తేదీతో ముగుస్తుంది. గ్రో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ మే 20తో ముగుస్తుంది. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ నుంచి కాంట్రాఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ లాంచ్ అయింది. మోతీలాల్ ఓస్వాల్ కాంట్రా ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే ఓపెన్ అవగా 22వ తేదీ వరకు కొనసాగనుంది. టాటా మ్యూచువల్ ఫండ్ నుంచి టైటానియం ఈక్విటీ లాంగ్‌షార్ట్ ఫండ్ లాంచ్ అయింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ 11వ తేదీతో ముగుస్తుంది. యూనియన్ మ్యూచువల్ ఫండ్ నుంచి అర్థాయ ఈక్విటీ లాంగ్ షార్ట్ ఫండ్ రాగా ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 18వ తేదీ వరకు ఉంటుంది. క్వాంట్ ఎస్ఐఫ్ సెక్టార్ రొటేషన్ లాంగ్‌షార్ట్ ఫండ్ అనే ఎస్ఐఎఫ్ స్కీమ్‌ని క్వాంట్ మ్యూచువల్ ఫండ్ లాంచ్ చేసింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కొనసాగుతోంది. ఈనెల 11వ తేదీతో ముగుస్తుంది.

# ఎక్కువ దిగుమతుల వల్లే రూపాయి క్షీణత



**న్యూఢిల్లీ, మే 10:** ఐదేళ్లక్రితం డాలరుతో రూపాయి మారకం విలువలు రూ.80గా ఉన్నపుడే విస్తృతంగా జరిగిన చర్చలు ఇపుడు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో డాలర్ విలువలు పటిష్టం అయి రూపాయి మారకం విలువలు 100కు చేరుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా వడ్డీ రేట్ల పెంపు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రూపాయి బలహీనతకు కారణాలుగా చెబుతున్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో డాలర్ ప్రభావం అంతగా బలంగా ఉండటంతో భారత్ వంటి దేశాలు దానిపై ఆధారపడుతూనే, అదే ఆధారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రపంచ మొత్తం సరుకు వాణిజ్యంలో అమెరికా వాటా సుమారు 15 శాతమే అయినప్పటికీ, గ్లోబల్ ట్రేడ్ ఇన్వాయిస్‌లలో దాదాపు 54శాతం డాలర్లలోనే ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే విదేశీ మారక లావాదేవీల్లో సుమారు 88శాతం ట్రేడ్లలో డాలర్ ఒక భాగంగా ఉంటుంది. ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో దాదాపు 58 శాతం ఇప్పటికీ డాలర్ ఆస్తుల రూపంలోనే ఉన్నాయి. రూపాయి దీర్ఘకాలిక గమనం పరిశీలిస్తే డాలర్ ప్రభావం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. 2011 ప్రారంభంలో 1 డాలర్ విలువ సుమారు 44 ఉండేది. 2013లో టేపర్ టాంట్రమ్ సమయానికి 60 సమీపానికి చేరింది. కరోనా మహమ్మారి నాటికి రూపాయి విలువ 70 దాటింది. 2022లో ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో రూపాయి 80నుంచి 85 మధ్య ట్రేడ్ అయింది. 2026 నాటికి ఆఫ్‌షోర్ మార్కెట్లో రూపాయి 100కు చేరుతుందనే చర్చలు పెరిగాయి.

భారత్ వద్ద ప్రస్తుతం సుమారు 700 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. వృద్ధి పెరిగే కొద్దీ డాలర్‌పై ఆధారపడటం కూడా పెరుగుతోంది ఈ ఏడాదిలో భారత్ 100 బిలియన్లకు పైగా ఎలక్ట్రానిక్స్ దిగుమతి చేసుకుంది. 2030 నాటికి సెమీకండక్టర్ దిగుమతులు కూడా 100 బిలియన్లు దాటే అవకాశం ఉంది. టెలికమ్యూనికేషన్ మౌలిక వసతులు, పారిశ్రామిక యంత్రాలు, సోలార్ మాడ్యూల్స్, లిథియమ్ అయాన్ బ్యాటరీలు, అడ్వాన్స్‌డ్ తయారీ రంగానికి అవసరమైన పరికరాల కోసం భారత్ ఇప్పటికీ దిగుమతులపై అధికంగా ఆధారపడుతోంది. దీంతో ఒక ఆసక్తికరమైన విరుద్ధ పరిస్థితి ఏర్పడుతోందని ఆర్థిక విశ్లేషకుల అంచనా.

## కెవైసి పాటించని సంస్థలపై ఆర్బీఐ జరిమానా

**ముంబయి, మే 10:** కెవైసి నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేటువేస్తోంది. తాజాగో మరో బ్యాంకుపై చర్యలు తీసుకుంది. నో యువర్ కస్టమర్ కెవైసీకి సంబంధించిన నిబంధనలు పాటించడంలో విఫలమైనట్లు గుర్తించిన క్రమంలో ప్రముఖ ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన యెస్ బ్యాంకు పై చర్యలు తీసుకుంది. రూ.31.80 లక్షల మేర పెనాల్టీ విధించింది. మరో ఫైనాన్స్ సంస్థకు సైతం భారీగా పెనాల్టీలు వేసింది. కస్టమర్లతో ఖాతా ఆధారిత సంబంధాన్ని ఏర్పరచుకునేందుకు, సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ కేటాయించిన కేవైసీ ఐడెంటిఫైయర్‌ను ఉపయోగించే వ్యవస్థను ఏర్పాటు చేయడంలో బ్యాంకు విఫలమైందని ఆర్‌బీఐ తెలిపింది. గతంలో, 2025 మార్చి 31 నాటి బ్యాంకు ఆర్థిక స్థితికి సంబంధించి పర్యవేక్షక మూల్యాంకనం కోసం ఆర్‌బీఐ ఒక చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఈ క్రమంలోనే కేవైసీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో బ్యాంక్ విఫలమైందని తెలిపింది. ఇందుకు సంబంధించి నోటీసులు జారీ చేసింది.

## 1000 మంది ఉద్యోగులపై వేటు

**న్యూఢిల్లీ, మే 10:** నైతిక ప్రవర్తన, ఉద్యోగ నియమావళి ఉల్లంఘనల కింద గడచిన మూడేళ్లలో ఎయిరిండియా వెయ్యిమందికిపైగా ఉద్యోగులను తొలగించింది. అలాగే ఉద్యోగులకు ఇచ్చిన విరామప్రయాణ వ్యవస్థను దుర్వినియోగంచేసిన వారిపైనా వేటు వేసినట్లు ఎయిర్‌లైన్ క్యాంప్‌బెల్ విల్సన్ వెల్లడించారు. ప్రతిఏటా వందలాదిమంది ఉద్యోగులు ఈ నిబంధనలు పాటించనం దుకు ఉద్వాసన పలకాల్సి వస్తోందని, ఉద్యోగులు తమ నైతిక నియమావళిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

# కేంద్రానికి సిఐఐ 5 పాయింట్ల అజెండా



### పారిశ్రామికరంగం ఇంధన సంరక్షణ పాటించాల్సిందే

### ధరల స్థిరత్వంతో సుంకాలను పునరుద్ధరించుకోవచ్చు

**న్యూఢిల్లీ, మే 10:** ముడిచమురుధరల్లో స్థిరత్వం నెలకొంటున్నందున కేంద్రం ఇప్పటివరకూ తగ్గించిన అదనపు సుంకాలనుపునరుద్ధరించవచ్చని సిఐఐ కేంద్రానికి సూచించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా పెట్రోలు, డీజిల్‌పై ప్రత్యేకించి రూ.10 అదనపు సుంకాన్ని తగ్గించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం సిఐఐ ఐదు పాయింట్ల అజెండానుప్రతిపాదించింది. ప్రస్తుత గ్లోబల్ అనిశ్చితుల్లో ఈ అజెండా అమలు అనివార్యం అవుతున్నదని స్వచ్ఛందంగా ఇంధన సంరక్షణ అనివార్యమని పేర్కొంది. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్ కార్యాచరణ మెరుగుపడుతోందని చెప్పిన సిఐఐ 1200 కంపెనీలుమాత్రమే కేంద్రం కొత్తగాప్రకటించిన సిఎంఐఇ పథకాన్ని వినియోగించుకున్నాయని అంతకుముందున్న రూ.4.6 లక్షలకోట్లనుంచి ప్రైవేటు మూలధన వ్యయం రూ.7.7 లక్షలకోట్లకు చేరిందని అన్నారు. సిఐఐ డైరెక్టర్‌జనరల్ చంద్రజిత్ బెనర్జీ మాట్లాడుతూ ప్రైవేటు మూలధన వ్యయం ఇన్వెస్ట్‌మెంట్ సైకిల్‌లో కీలకమని పేర్కొంటూ పరిశ్రమలు కూడా ఇంధన సంరక్షణ పాటించాలని, ఇంధనం, విద్యుత్ వినియోగంలో వచ్చే రెండుత్రైమాసికాల్లో మూడు నుంచి ఐదుశాతం వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. అలాగే భారీ కార్పొరేట్ సంస్థలు ఎంఎస్‌ఎంఇలకు చెల్లింపుల్లో కూడా స్పష్టత ఇవ్వాలని 45రోజుల్లోపు చెల్లించాలని సూచించారు. ట్రెడ్స్ ప్లాట్‌ఫామ్, సప్లయిచైన్ ఫైనాన్సింగ్ యంత్రాంగాలను వినియోగించి మూలధన సమస్యలను కూడా ఎంఎస్‌ఎంఇలకు పరిష్కరించాలని అభిప్రాయపడ్డారు. ఇంధన ధరలు స్థిరంగా ఉన్న తరుణంలో ప్రభుత్వం విధించిన సుంకాలను ఆరునుంచి తొమ్మిదినెలల్లో దశలవారీగా తగ్గించే వీలుంటుందన్నారు. ఉత్పత్తి రంగం ప్రైవేటు మూలధన వ్యయంలో రూ.3.8 లక్షలవరకూ ఉందని, మెటల్స్, ఆటోమొబైల్స్, రసాయనాలు కీలకమని అలాగే సేవలరంగం రూ.3.1 లక్షల కోట్లు కాగా 40శాతం వాటాతో ఉంది. ట్రేడింగ్ కమ్యూనికేషన్స్, ఐటి, ఐటిఇఎస్ రంగాలు వీటిలోకీలకమన్నారు. ఆర్డర్‌బుక్స్ కూడా 10.3శాతంపెరిగిందని, బ్యాంకు క్రెడిట్ గ్రోత్ 10శాతం పెరిగిందని, ఈ ఏడాది రెండో అర్థభాగంలో పదినుంచి 14శాతానికి పెరుగుతుందన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14